VELTHURU TELUGU DAILY

# వెలుతురు

తెలుగు దిన పత్రిక

రంగారెడ్డి, నల్గొండ : శుక్రవారం 03.07.2026
సంపుటి : 08 సంచిక : 24 , పేజీలు : 12 , వెల:రూ . 5/-

SRI SHANTHI PUBLICATIONS PUBLISHED FROM TELANGANA | ANDHRAPRADESH

www.velthuru.com



ఉప్పల్ భగాయత్‌లో కవిత భూపోరాటం.. ఉద్రిక్తత, అరెస్టు

2

# ఉపాధి చట్టంపై సుప్రీంకోర్టుకు

- తెలంగాణ రాష్ట్ర క్యాబినెట్ కీలక నిర్ణయాలు
- కొత్త చట్టం అమలుకు ఆమోదం తెలిపిన మంత్రివర్గం
- ప్రభుత్వ ఉపాధ్యాయులకు కూడా మధ్యాహ్న భోజనం, బ్రేక్ ఫాస్ట్
- లక్షన్నర మంది సిబ్బందికి పథకం ప్రయోజనం
- టిమ్స్ ఆస్పత్రుల్లో 6,278 పోస్టులకు గ్రీన్ సిగ్నల్
- మూసీ అభివృద్ధికి రూ.7,345 కోట్ల ఆమోదం
- మూసీ ప్రాజెక్టుకు 147 కొత్త పోస్టుల సృష్టి
- గిడ్డంగుల నిర్మాణానికి 60 ఎకరాల భూమి కేటాయింపు
- నవోదయ, కేంద్రీయ విద్యాలయాలకు ప్రభుత్వ భూములు
- పలు కీలక ప్రతిపాదనలకు క్యాబినెట్ ఆమోదం



**హైదరాబాద్ వెలుతురు జూలై 02:**

తెలంగాణ రాష్ట్ర క్యాబినెట్ గురువారం పలు కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపింది. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వీబీజీ రామ్‌జీ చట్టం, పాఠశాలల్లో ఉపాధ్యాయులకు భోజన పథకం, టిమ్స్ ఆస్పత్రుల్లో ఉద్యోగాల భర్తీ, మూసీ రివర్ ఫ్రంట్ అభివృద్ధి, గిడ్డంగులు, విద్యాసంస్థలకు భూముల కేటాయింపు వంటి అంశాలపై కీలక నిర్ణయాలు తీసుకుంది.

**ఉపాధి హామీ చట్టంపై సుప్రీంకోర్టుకు వెళ్లాలని నిర్ణయం**

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వీబీజీ రామ్‌జీ చట్టంలోని నిబంధనలపై క్యాబినెట్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. రాష్ట్రాలను సంప్రదించకుండా చట్టం తీసుకురావడం ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొంది. అయితే ఇతర రాష్ట్రాలన్నీ అమలుకు ముందుకొచ్చిన నేపథ్యంలో, ఉపాధి హామీ కూలీలకు పనులు ఆగకుండా ఉండేందుకు జూలై 1, 2026 నుంచి రాష్ట్రంలో చట్టాన్ని అమలు చేయాలని నిర్ణయించింది. అదే సమయంలో చట్టంలోని నిబంధనలను సవాలు చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించాలని, పార్లమెంట్‌లో కూడా కేంద్ర ప్రభుత్వ తీరును నిలదీయాలని నిర్ణయించింది.

**ఉపాధ్యాయులకు కూడా అల్పాహారం, భోజనం**

ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు, లెక్చరర్లు, ఇతర సిబ్బందికి కూడా అల్పాహారం, పాలు, మధ్యాహ్న భోజనం అందించాలని క్యాబినెట్ నిర్ణయించింది. రాష్ట్రవ్యాప్తంగా సుమారు లక్షన్నర మంది ఉపాధ్యాయులు, సిబ్బందికి ఈ నిర్ణయం వర్తించనుంది.

▶ మిగతా 2లో

## గురుకులాల అవినీతిపై కాంగ్రెస్ బీఆర్ఎస్ సవాళ్లు.. గన్‌పార్క్ వద్ద ఉద్రిక్తత

- గురుకులాల కొనుగోళ్లపై చర్చకు ఇరు పక్షాల సిద్ధత
- హైదరాబాద్‌లో రాజకీయంగా వేడెక్కిన వాతావరణం
- గన్‌పార్క్ వద్దకు చేరుకున్న కాంగ్రెస్ మంత్రులు
- సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో చర్చకు రావాలని ఆహ్వానం



- తెలంగాణ భవన్ నుంచి బయల్దేరిన హరీశ్‌రావు
- హరీశ్‌రావును అడ్డుకున్న పోలీసులు..

2



## కాంగ్రెస్, బీఆర్ఎస్‌ది రాజకీయ బిగ్‌బాస్ షో

- కేంద్ర మంత్రి బండి సంజయ్ విమర్శలు
- ఎక్స్ వేదికగా రెండు పార్టీలపై కేంద్ర మంత్రి విమర్శలు

2

## మంత్రులు భయపడి పారిపోయారు

- మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శలు
- గురుకుల టెండర్లు, అప్పులపై ఆరోపణలు
- హరీశ్‌రావు సహా బీఆర్ఎస్ నేతల అరెస్ట్.. విడుదల
- బహిరంగ చర్చల సవాళ్లతో



రోడ్డెక్కిన ప్రధాన పార్టీలు

2

## బీఆర్ఎస్ హయాంలో రూ.8.21 లక్షల కోట్ల ఆర్థిక భారం: మంత్రి జూపల్లి

**హైదరాబాద్, వెలుతురు జూలై 2:**



బీఆర్ఎస్ ప్రభుత్వ పదేళ్ల పాలన ముగిసే నాటికి తెలంగాణ రాష్ట్రంపై అప్పులు, పెండింగ్ బిల్లులు కలిపి మొత్తం రూ.8,21,651 కోట్ల ఆర్థిక భారం మిగిలిందని మంత్రి జూపల్లి కృష్ణారావు వెల్లడించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై తాము చేస్తున్న వ్యాఖ్యలు నిరాధారమని ప్రతిపక్షం చేస్తున్న ఆరోపణలకు సమాధానంగా గన్ పార్కు అమరవీరుల స్థూపం సాక్షిగా ఆయన ఈ లెక్కలను మీడియా ముందుంచారు.

▶ మిగతా 2లో

## భారత్–జపాన్ బంధంలో చారిత్రాత్మక మైలురాయి

- రక్షణ రంగంలో తొలిసారి ఉమ్మడి ప్రాజెక్ట్
- సరికొత్త శిఖరాలకు ద్వైపాక్షిక వ్యూహాత్మక మైత్రి
- పరస్పర నమ్మకమే మన అతిపెద్ద వ్యూహాత్మక ఆస్తి
- భారత్-జపాన్ 16వ వార్షిక సదస్సులో ప్రధాని మోదీ వ్యాఖ్యలు
- జపాన్ తొలి మహిళా ప్రధాని తకాయిచి నా చెల్లెలు
- నారా ప్రాంత ఉమ్మడి బౌద్ధ వారసత్వాన్ని గుర్తుచేసిన మోదీ
- ఏఐ, సరికొత్త సాంకేతికత కోసం ఉమ్మడి విజన్ ఆవిష్కరణ

2

## పేదలకు ఇందిరమ్మ ఇళ్ల పట్టాలు

- క్యూర్ పరిధిలో లక్ష ఇందిరమ్మ ఇళ్లు
- త్వరలో టెండర్లకు ప్లాన్ చేస్తున్న ప్రభుత్వం
- ఇందిరమ్మ ఇళ్ల టెండర్లకు సర్వం సిద్ధం
- స్థల సేకరణ తుది దశకు చేరిందన్న పొంగులేటి
- గోషామహల్‌లో లబ్ధిదారులకు ఇళ్ల పంపిణీ




- ఒకే వేదికపై చేతులు కలిపిన అధికార, ప్రతిపక్ష నేతలు

3




2

- రైతుల ఖాతాల్లో రూ.1,330 కోట్లు జమ
- 3–4 ఎకరాల రైతులకు ప్రభుత్వం ఊరట
- 6.39 లక్షల మంది రైతులకు లబ్ధి
- రైతుల ఖాతాల్లో నేరుగా నగదు జమ
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడి

## ఏజెన్సీ నియోజకవర్గాలకు మరో 2 వేల ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వండి

- సీఎం రేవంత్‌ను కోరిన గిరిజన ఎమ్మెల్యేలు
- ఏజెన్సీ ప్రాంతాలకు అదనపు ఇళ్ల కేటాయింపు విజ్ఞప్తి
- సీతక్క నేతృత్వంలో సీఎంను కలిసిన ఎమ్మెల్యేలు



6

- డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో వినతిపత్రం
- పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని విజ్ఞప్తి
- ఇందిర గిరి జల వికాసం అమలు చేయాలని డిమాండ్

## ప్రజలకు మెరుగైన సేవలు అందాలి

- పోలీస్ అధికారుల సమీక్షలో డీజీపీ సీవీ ఆనంద్
- పోలీస్ స్టేషన్ల పునర్వ్యవస్థీకరణపై డీజీపీ సమీక్ష
- సీపీలతో కీలక సమావేశం నిర్వహించిన అధికారులు
- నాలుగు కమిషనరేట్ల పరిధిలో పునర్వ్యవస్థీకరణపై చర్చ
- భవిష్యత్ నగర విస్తరణను దృష్టిలో ఉంచాలని సూచన
- జనాభా పెరుగుదలకు అనుగుణంగా ప్రణాళిక రూపొందించాలన్న ఆదేశం



6

- ప్రభుత్వ ఉత్తర్వులకు అనుగుణంగా ప్రక్రియ చేపట్టాలని స్పష్టీకరణ
- మున్సిపల్, రెవెన్యూ, కోర్టు పరిధులను పరిగణనలోకి తీసుకోవాలని సూచన

## TGIICలో చీఫ్ ఇంజనీర్ ఇష్టారాజ్యం

- అనుమతీయులకే కంట్రాక్టుల అప్పగింత
- ఎలాంటి అర్హతలు లేని కంపెనీలకు కాంట్రాక్టులు
- సిద్దిపేట జిల్లా వర్గల్ ఫుడ్ పార్క్ లో భారీ అవకతవకలు
- దాదాపు యాభై కోట్ల టెండర్ల గోల్ మాల్
- తప్పుడు పత్రాలు సృష్టించి స్వయంగా టెండర్లు ఓపెన్ చేసిన సీఈ
- టెండర్లు వేసిన ఒరిజినల్ కాంట్రాక్టర్లకు దక్కని వైనం
- ఇష్టారాజ్యంగా సీఈ వ్యవహారశైలి

**హైదరాబాద్ వెలుతురు జూలై 02:**

తెలంగాణ ప్రభుత్వ పారిశ్రామిక అభివృద్ధి సంస్థ లో అవినీతి రాజ్యామేలుతోంది. కొంతమంది ఉన్నతాధికారుల చేతి వాటం వల్ల సంస్థ తీవ్రంగా నష్టపోవుతుందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరిస్తుందని ఓ వైపు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,మంత్రులు చెప్తుంటే ఇంకోవైపు అధికారుల తీరు అందరిని విస్మయానికి గురి చేస్తోంది. ముఖ్యంగా టిజిఐఐసి లో సీఈపై పెద్ద ఎత్తున ప్రచారం సాగుతోంది. వెల కోట్ల రూపాయలతో ముడిపడి ఉన్న సంస్థలో ఎలాంటి అర్హతలు లేని కంపెనీలకు కాంట్రాక్టులు అప్పనంగా ఇచ్చి భారీ మొత్తం లో కమిషన్లు దండుకున్నారన్న ఆరోపనలు ఉన్నాయి.సిద్ధిపేట జిల్లా వర్గల్ ఫుడ్ పార్క్ కు సంబంధించిన వ్యవహారంలో దాదాపు యాబై కొట్ల రూపాయల గోల్ మాల్ జరిగినట్లు తెలుస్తోంది.అర్హత లేని కంపెనీకు నేరుగా సీఈనే తప్పడు పత్రాలు సృచించి స్వయంగా టెండర్లు ఓపెన్ చేసినట్లు సమాచారం. దీనిమీద సదరు కాంట్రాక్టర్లు విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులకు పిర్యాదు చేసారు. ప్రభుత్వం,సంబందిత మంత్రి తక్షణమే స్పందించి సీఈ పై చర్యలు తీసుకోవాలని




డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగాన్ని అడ్డిపెట్టుకొని అక్రమార్గంలో వందల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నా ఇలాంటి వారిపై ఎసిబి ద్రుష్టి పెడితే బాగుంటుంది అంటున్నారు సామాన్య జనం.

# గురుకులాల అవినీతిపై కాంగ్రెస్ బీఆర్ఎస్ సవాళ్లు.. గన్‌పార్క్ వద్ద ఉద్రిక్తత

- **తోపులాట బీఆర్ఎస్ కార్యకర్తలు, పోలీసుల మధ్య తీవ్ర వాగ్వాదం**
- **పారదర్శకంగా టెండర్లు నిర్వహించామని కాంగ్రెస్ స్పష్టం**
- **అప్పులు, గురుకులాల అంశాలపై చర్చకు సిద్ధమన్న బీఆర్ఎస్**
- **హరీశ్‌రావుతో పాటు పలువురు నేతలను అదుపులోకి తీసుకున్న పోలీసులు**

**హైదరాబాద్ వెలుతురు జూలై 02:**

హైదరాబాద్‌లో గురుకుల విద్యాసంస్థల కొనుగోళ్లలో అవినీతి జరిగిందన్న ఆరోపణలతో కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య రాజకీయ పోరు మరింత ఉధృతమైంది. ఒకరిపై ఒకరు సవాళ్లు విసురుకోవడంతో రాజధానిలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఇరు పార్టీల నేతలు చర్చకు సిద్ధమని ప్రకటించగా, గన్‌పార్క్ పరిసరాల్లో పోలీసుల భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.గురుకులాల కొనుగోళ్లలో అవినీతి జరిగిందన్న బీఆర్ఎస్ ఆరోపణలపై బహిరంగంగా చర్చించేందుకు కాంగ్రెస్ మంత్రులు ముందుకొచ్చారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌తో పాటు అడ్లూరి లక్ష్మణ్, అజారుద్దీన్ తదితరులు గన్‌పార్క్ వద్దకు చేరుకుని మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్‌కు చెందిన మాజీ మంత్రులు ఎవరైనా చర్చకు రావచ్చని, సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బహిరంగ చర్చకు సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు.ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ బీఆర్ఎస్ నేతలు చేస్తున్న ఆరోపణలు పూర్తిగా అసత్యమని విమర్శించారు. గురుకుల హాస్టళ్లలో అవినీతి జరిగిందని కేటీఆర్, హరీశ్‌రావు, ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ చేస్తున్న ఆరోపణలకు ఎలాంటి ఆధారాలు లేవన్నారు. మొత్తం కొనుగోలు ప్రక్రియను నాలుగు శాఖల ఆధ్వర్యంలో పూర్తి పారదర్శకంగా నిర్వహించామని తెలిపారు. టెండర్లలో పాల్గొనే అవకాశం అందరికీ కల్పించామని, ప్రజలు ఎన్నుకున్న నాయకులే చర్చకు రావాలని కోరారు. గత పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన కొనుగోళ్లపై కూడా చర్చించేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు.మరోవైపు కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అప్పులు, ఆర్థిక నిర్వహణపై కూడా చర్చించేందుకు తాము సిద్ధమని బీఆర్ఎస్ ప్రకటించింది. మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు తెలంగాణ భవన్‌కు చేరుకున్నారు. మంత్రి జూపల్లి కృష్ణారావు తెలంగాణ భవన్‌కు వచ్చి అప్పుల అంశంపై చర్చిస్తానని చెప్పారని, అందుకే కేటీఆర్ అక్కడే ఉంటారని హరీశ్‌రావు తెలిపారు.తాను ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌తో పాటు ఇతర నేతలతో కలిసి గన్‌పార్క్‌కు వెళ్లి మంత్రులను కలుస్తానని ప్రకటించిన హరీశ్‌రావు తెలంగాణ భవన్ నుంచి బయల్దేరారు. అయితే మార్గమధ్యంలో పోలీసులు ఆయన వాహనాన్ని అడ్డుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. చర్చకు వస్తున్న తమను ఎందుకు అడ్డుకుంటున్నారని హరీశ్‌రావు పోలీసులను ప్రశ్నించారు.హాస్టళ్లలో అవినీతి జరిగిందనే విషయాన్ని ప్రభుత్వం ఎదుర్కోలేకే పోలీసులను అడ్డుపెట్టుకుంటోందని హరీశ్‌రావు ఆరోపించారు. గన్‌పార్క్‌కు నడుచుకుంటూ వెళ్తామని ప్రకటిస్తూ కారు దిగి ముందుకు సాగేందుకు ప్రయత్నించారు. అయితే పోలీసులు అడ్డుకోవడంతో బీఆర్ఎస్ కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ క్రమంలో బీఆర్ఎస్ కార్యకర్తలు, పోలీసుల మధ్య తీవ్ర వాగ్వాదం, తోపులాట చోటు చేసుకుంది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు నినాదాలు చేశారు. పోలీసు బారికేడ్లను దాటేందుకు ప్రయత్నించడంతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది.చివరికి పరిస్థితి అదుపు తప్పకుండా ఉండేందుకు పోలీసులు హరీశ్‌రావుతో పాటు పలువురు బీఆర్ఎస్ నేతలను అదుపులోకి తీసుకున్నారు. దీంతో గన్‌పార్క్ పరిసరాల్లో కొంతసేపు ఉద్రిక్త పరిస్థితులు కొనసాగాయి. గురుకులాల కొనుగోళ్ల అంశంపై కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య రాజకీయ ఆరోపణలు, ప్రత్యారోపణలు మరింత వేడెక్కే అవకాశం కనిపిస్తోంది.

## మూసీ రివర్ ఫ్రంట్‌కు రూ.7,345 కోట్ల ఆమోదం

మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ తొలి దశ పనులకు రూ.7,345.12 కోట్ల పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. తొలి దశలో 21 కిలోమీటర్ల మేర అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. ప్రాజెక్టు నిర్వహణ కోసం కొత్తగా 147 పోస్టులు సృష్టించేందుకు కూడా ఆమోదం తెలిపింది.

**గిడ్డంగులు, విద్యాసంస్థలకు భూముల కేటాయింపు**

వరంగల్ జిల్లా బొల్లికుంట, రంగారెడ్డి జిల్లా కర్మాలపహాడ్‌లో గిడ్డంగుల నిర్మాణానికి మొత్తం 60 ఎకరాల భూమిని తెలంగాణ రాష్ట్ర గిడ్డంగుల సంస్థకు కేటాయించాలని నిర్ణయించింది. అలాగే మహబూబ్‌నగర్, సూర్యాపేట జిల్లాల్లో జవహర్ నవోదయ విద్యాలయాలు, జగిత్యాల జిల్లాలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు ప్రభుత్వ భూములను కేటాయించింది.

# ఉపాధి చట్టంపై...

**(మొదటి పేజీ తరువాయి)**

- **టిమ్స్ ఆస్పత్రుల్లో 6,278 పోస్టులు**

సనత్‌నగర్, ఎల్బీనగర్, అల్వాల్ టిమ్స్‌తో పాటు వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల్లో మొత్తం 6,278 పోస్టుల భర్తీకి క్యాబినెట్ ఆమోదం తెలిపింది. వీటిలో 1,494 రెగ్యులర్, 549 కాంట్రాక్ట్, 4,235 ఔట్‌సోర్సింగ్ పోస్టులు ఉన్నాయి. ఈ ఆస్పత్రులను నిమ్స్ తరహాలో అభివృద్ధి చేయాలని నిర్ణయించింది.

# మంత్రులు భయపడి పారిపోయారు

- **సోమాజిగూడ ప్రెస్‌క్లబ్ వేదికగా ఆర్ఎస్పీ సవాల్**
- **ఫోన్లు చేసినా ఎత్తని అధికార పక్ష నేతలు**
- **ఖాకీల బలప్రయోగం మధ్య బీఆర్ఎస్ నేతల అరెస్టులు**

**హైదరాబాద్ వెలుతురు జూలై 02:**

తెలంగాణ రాష్ట్రంలో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష భారత్ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్టీల మధ్య సాగుతున్న రాజకీయ పోరు సరికొత్త రణరంగానికి దారితీసింది. గురుకుల పాఠశాలల టెండర్లలో భారీగా అవినీతి జరిగిందంటూ బీఆర్ఎస్ చేసిన ఆరోపణలు, అలాగే రాష్ట్ర ప్రభుత్వ అప్పులపై ఇరు పార్టీల మధ్య నడిచిన సవాళ్లు, ప్రతి సవాళ్లు గురువారం నాడు వీధి పోరాటాలుగా మారాయి. పల్లెలు, పట్టణాల అభివృద్ధిని పక్కనబెట్టి నేతలు బహిరంగ చర్చల కోసం రోడ్లపైకి రావడంతో హైదరాబాద్ నగరంలో ఒక్కసారిగా తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.గురుకులాల టెండర్లలో అవినీతి జరిగిందన్న ఆరోపణలను కాంగ్రెస్ మంత్రులు తీవ్రంగా ఖండించారు. బీఆర్ఎస్ ఆరోపణలను నిరూపిస్తే తాను తక్షణమే మంత్రి పదవికి రాజీనామా చేస్తానని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ సవాల్ విసిరారు. ఈ క్రమంలోనే మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్, అజారుద్దీన్‌లు గురువారం ఉదయాన్నే అసెంబ్లీ ఎదురుగా ఉన్న గన్‌పార్క్ అమరవీరుల స్తూపం వద్దకు చేరుకున్నారు. తాము అవినీతికి పాల్పడినట్లు బీఆర్ఎస్ నేతలు నిరూపిస్తే, ముగ్గురం మంత్రులం ఇదే గన్‌పార్క్ సాక్షిగా ముక్కు నేలకు రాస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ సంచలన ప్రకటన చేశారు.ఇదిలావుండగా, బీఆర్ఎస్ సీనియర్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ కాంగ్రెస్ మంత్రుల సవాల్‌పై ప్రతి సవాల్ విసిరారు. తాము సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో చర్చకు సిద్ధంగా ఉన్నామని, కాంగ్రెస్ మంత్రులు అక్కడికి రావాలని కోరారు. అయితే దీనిపై మంత్రులు భిన్నంగా స్పందించారు. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ స్థాయికి తాము రానవసరం లేదని, ఆయన చర్చకు వస్తే కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధులు మాత్రమే ప్రెస్ క్లబ్‌కు వస్తారని స్పష్టం చేశారు. కేటీఆర్, హరీశ్‌రావు లాంటి మాజీ మంత్రులు లేదా ఎమ్మెల్యేలు వస్తేనే తాము నేరుగా చర్చిస్తామని తేల్చిచెప్పారు.మంత్రుల సవాల్‌ను స్వీకరించిన మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు గురువారం ఉదయం బీఆర్ఎస్ ప్రధాన కార్యాలయమైన తెలంగాణ భవన్‌కు చేరుకున్నారు. అక్కడి నుంచి పార్టీ ముఖ్య నేతలు, కార్యకర్తలతో కలిసి చర్చల కోసం గన్‌పార్క్ వైపు బయలుదేరేందుకు సిద్ధమయ్యారు. అయితే, శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా చూసేందుకు పోలీసులు తెలంగాణ భవన్ పరిసరాల్లో భారీగా మోహరించారు. హరీశ్‌రావు కాన్వాయ్‌ను గేటు దాటకుండానే బారికేడ్లు పెట్టి పోలీసులు తీవ్రంగా అడ్డుకోవడంతో అక్కడ ఉద్రిక్తత చోటుచేసుకుంది.పోలీసులు తమను అడ్డుకోవడంపై మాజీ మంత్రి హరీశ్‌రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "కాంగ్రెస్ మంత్రులే స్వయంగా ఆధారాలతో గన్‌పార్క్‌కు రమ్మని సవాళ్లు విసిరారు. వారి మాట నమ్మే మేము అన్ని రికార్డులతో బయలుదేరాం. మమ్మల్ని రమ్మని పిలిచి, ఇప్పుడు పోలీసుల వెనుక దాక్కోవడం ఏంటి?" అని నిలదీశారు. పోలీసులను అడ్డుపెట్టుకుని ప్రతిపక్షాన్ని ఆపాలని చూస్తున్నారంటేనే కాంగ్రెస్ ప్రభుత్వం చర్చకు భయపడి పారిపోతోందని అర్థమవుతోందని హరీశ్‌రావు ఘాటు విమర్శలు చేశారు.తాము గన్‌పార్క్‌కు వెళ్లకుండా ఆపవద్దని హరీశ్‌రావు పోలీసులను కోరారు. తాము వస్తున్న విషయాన్ని అక్కడున్న మంత్రులకు చెప్పాలని, కావాలంటే తానే ఫోన్ చేస్తానని చెప్పారు. ఈ క్రమంలోనే ముగ్గురు కాంగ్రెస్ మంత్రులకు హరీశ్‌రావు ఫోన్ చేసినా వారు స్పందించలేదని బీఆర్ఎస్ వర్గాలు తెలిపాయి. దీంతో పోలీసులకు, బీఆర్ఎస్ శ్రేణులకు మధ్య పెద్ద ఎత్తున తోపులాట జరిగింది. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు హరీశ్‌రావుతో పాటు పలువురు బీఆర్ఎస్ నేతలను బలవంతంగా అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.గురుకులాల టెండర్ల రచ్చ ఇలా ఉంటే.. రాష్ట్ర అప్పుల వ్యవహారంపై కూడా మరో రణరంగం నడిచింది. కాంగ్రెస్ ప్రభుత్వం అడ్డగోలుగా అప్పులు చేస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించగా, దానికి మంత్రి జూపల్లి కృష్ణారావు కౌంటర్ ఇచ్చారు. అప్పులపై చర్చకు తాను సిద్ధమని జూపల్లి సవాల్ విసరడంతో, కేటీఆర్ గురువారం ఉదయమే తెలంగాణ భవన్‌కు చేరుకుని నిరీక్షించారు. తాము ఆర్థిక లెక్కలతో సిద్ధంగా ఉన్నామని, జూపల్లి ఎప్పుడు వస్తారో తేల్చుకుందామని కేటీఆర్ ప్రకటించారు.ట్విస్ట్ ఏంటంటే.. తెలంగాణ భవన్‌కు వెళ్లాల్సిన ఆబ్కారీ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు గురువారం ఉదయం హఠాత్తుగా గన్‌పార్క్ వద్ద ప్రత్యక్షమయ్యారు. తాను గాంధీభవన్‌కు వెళ్తున్న సమయంలో గన్‌పార్క్‌కు హరీశ్ రావు వస్తున్నారనే సమాచారం తెలిసి ఇక్కడికి వచ్చానని జూపల్లి వెల్లడించారు. "నేను నా సవాల్‌కు కట్టుబడే వచ్చాను. కానీ ఇక్కడికి బీఆర్ఎస్ పార్టీ వాళ్లు ఎవరూ రాలేదు. అప్పుల వివరాలపై చర్చించేందుకు బీఆర్ఎస్ నుంచి ఏ నాయకుడు వచ్చినా సరే.. నేను ఇక్కడే కూర్చుని లెక్కలు తేల్చడానికి సిద్ధం" అని జూపల్లి స్పష్టం చేశారు. ఈ సవాళ్లు, అరెస్టుల పర్వంతో తెలంగాణ రాజకీయాలు ఒక్కసారిగా కుదిపేశాయి.

# కాంగ్రెస్, బీఆర్ఎస్‌ది రాజకీయ బిగ్‌బాస్ షో

- **ముందే రిహార్సల్ చేసి రాజకీయాలు చేస్తున్నారని ఎద్దేవా**
- **గురుకులాల టెండర్లు, అప్పులపై చర్చకు రావాలని సవాల్**
- **అవినీతి, అక్రమాలపై బహిరంగ చర్చకు సిద్ధమని ప్రకటన**
- **బీజేపీ అధ్యక్షుడు రామచంద్రరావు ఆధ్వర్యంలో వేదిక ఏర్పాటు చేస్తామన్న బండి**
- **ప్రజల ప్రశ్నలకు సమాధానం చెప్పే ధైర్యం ఉందా అని ప్రశ్న**
- **మోదీ ప్రభుత్వ నిధులు, సంక్షేమంపైనా చర్చిద్దామని సవాల్**
- **కాంగ్రెస్, బీఆర్ఎస్ పాలనా వైఫల్యాలను బయటపెడతామన్న వ్యాఖ్య**
- **ప్రజలు రాజకీయ డ్రామాలను గమనిస్తున్నారని హెచ్చరిక**
- **తెలంగాణలో డబుల్ ఇంజిన్ ప్రభుత్వం రావాలని ప్రజలు కోరుకుంటున్నారని వ్యాఖ్య**

**హైదరాబాద్ వెలుతురు జూలై 02:**



కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై కేంద్ర మంత్రి బండి సంజయ్ తీవ్ర విమర్శలు గుప్పించారు. ఎక్స్ వేదికగా స్పందించిన ఆయన.. ఇరు పార్టీల నేతల తీరు రాజకీయ బిగ్‌బాస్ షోను తలపిస్తోందని ఎద్దేవా చేశారు. ప్రతి వారం ముందే రిహార్సల్ చేసుకుని పోటాపోటీగా నటిస్తున్నట్లుగా వ్యవహరిస్తున్నారని, అబద్ధాలకు ఆస్కార్ అవార్డు ఉంటే కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలిద్దరూ అర్హులేనని వ్యాఖ్యానించారు.తెలంగాణ ప్రజలను అమాయకులుగా భావించవద్దని, ప్రజలు అన్నింటినీ గమనిస్తూ నవ్వుకుంటున్నారని బండి సంజయ్ పేర్కొన్నారు. గురుకులాల టెండర్లు, తెలంగాణ అప్పులు, అవినీతి, అక్రమాల అంశాలపై బహిరంగ చర్చకు రావాలని కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు సవాల్ విసిరారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు ఆధ్వర్యంలో తేదీ, సమయం, వేదికను ఖరారు చేస్తామని తెలిపారు.ప్రజల ప్రశ్నలకు సమాధానం చెప్పేందుకు సిద్ధమా అని ప్రశ్నించిన బండి సంజయ్.. కాంగ్రెస్, బీఆర్ఎస్ పాలనా వైఫల్యాలను ప్రజల ముందుంచేందుకు బీజేపీ సిద్ధంగా ఉందన్నారు. అలాగే ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం తెలంగాణ అభివృద్ధికి కేటాయించిన నిధులు, అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలపైనా చర్చించేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు.ఇరు పార్టీలు రాజకీయ డ్రామాలు కొనసాగిస్తే ప్రజలు తప్పకుండా తిరస్కరిస్తారని బండి సంజయ్ హెచ్చరించారు. ప్రస్తుతం జరుగుతున్న రాజకీయ బిగ్‌బాస్ షోలో ప్రజలు 'డబుల్ ఎలిమినేషన్' కోరుకుంటున్నారని, తెలంగాణలో కూడా డబుల్ ఇంజిన్ ప్రభుత్వం రావాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారని తన ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు.

# ఉప్పల్ భగాయత్‌లో కవిత భూపోరాటం.. ఉద్రిక్తత, అరెస్టు

- **తెలంగాణ ఉద్యమకారులకు ఇళ్ల స్థలాల కోసం డిమాండ్**
- **బోడుప్పల్‌లో భూపోరాటానికి దిగిన కల్వకుంట్ల కవిత**
- **పోలీసుల అడ్డుకోవడంతో ఉద్రిక్త పరిస్థితులు**
- **తోపులాటలో కవితకు స్వల్ప గాయాలు**
- **అనుమతి లేదంటూ టెంట్లు తొలగించిన పోలీసులు**
- **కవితతో పాటు పలువురు కార్యకర్తల అరెస్టు**
- **బొల్లారం పోలీస్ స్టేషన్‌కు తరలింపు**
- **పీఎస్ ఎదుట మద్దతుదారుల ఆందోళన**
- **ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు**
- **ఉప్పల్ భగాయత్ భూముల అంశం మళ్లీ తెరపైకి**

**హైదరాబాద్ వెలుతురు జూలై 02:**

ఉప్పల్ భగాయత్ భూముల్లో తెలంగాణ ఉద్యమకారులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రక్షణసేన పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత చేపట్టిన భూపోరాటం ఉద్రిక్తతకు దారితీసింది. బోడుప్పల్‌లో ఉద్యమకారులు, పార్టీ కార్యకర్తలతో కలిసి ఆమె నిర్వహించిన నిరసన కార్యక్రమాన్ని పోలీసులు అడ్డుకోవడంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.ఈ కార్యక్రమానికి ముందస్తు అనుమతి లేదని పేర్కొంటూ పోలీసులు నిరసన స్థలంలో ఏర్పాటు చేసిన టెంట్లను తొలగించారు. దీంతో పోలీసులకు, నిరసనకారులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుని తోపులాట జరిగింది. ఈ ఘటనలో కల్వకుంట్ల కవితకు స్వల్ప గాయాలైనట్లు సమాచారం.పరిస్థితి అదుపు తప్పకుండా పోలీసులు కవితతో పాటు అక్కడున్న ఉద్యమకారులు, కార్యకర్తలను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారిని బొల్లారం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దీంతో పోలీస్ స్టేషన్ పరిసరాల్లో ఉద్రిక్త వాతావరణం నెలకొంది.కవిత అరెస్టును నిరసిస్తూ ఆమె మద్దతుదారులు బొల్లారం పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.ఉప్పల్ భగాయత్ భూములను తెలంగాణ ఉద్యమకారులకు కేటాయించాలన్న డిమాండ్ నేపథ్యంలో ఈ నిరసన కార్యక్రమం చేపట్టగా, తాజా పరిణామాలతో ఈ అంశం మరోసారి రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది.

# బీఆర్ఎస్ హయాంలో రూ.8.21 లక్షల కోట్లు...

2014 జూన్ 2న రాష్ట్ర ఏర్పాటు సమయంలో మొత్తం బకాయిలు రూ.90,161 కోట్లు మాత్రమే ఉండగా, 2023 డిసెంబర్ 1 నాటికి అవి భారీగా పెరిగాయని వివరించారు.

**ఆయన వెల్లడించిన వివరాలు ఇలా ఉన్నాయి...**

- **రాష్ట్ర ఏర్పాటు సమయంలో ఎఫ్ఆర్‌బీఎం (FRBM) రుణాలు రూ.72,658 కోట్లు ఉండగా, 2023 డిసెంబర్ నాటికి అవి రూ.3,89,673 కోట్లకు చేరాయి.**
- **ప్రభుత్వ హామీతో ప్రత్యేక ప్రయోజన సంస్థలు (SPVs) తీసుకుని, ప్రభుత్వం చెల్లించాల్సిన రుణాలు రూ.11,609 కోట్ల నుంచి రూ.1,27,208 కోట్లకు పెరిగాయి.**
- **ఈ రెండు కలిపి ప్రభుత్వ ప్రత్యక్ష బాధ్యతగా ఉన్న అప్పులు రూ.84,268 కోట్ల నుంచి రూ.5,16,881 కోట్లకు చేరినట్లు తెలిపారు.**
- **ప్రభుత్వ హామీతో ఎస్‌పీవీలు తీసుకుని, వాటినే చెల్లించే రుణాలు రూ.5,893 కోట్ల నుంచి రూ.95,462 కోట్లకు పెరిగాయని పేర్కొన్నారు.**
- **కార్పొరేషన్లు తీసుకున్న ప్రభుత్వేతర హామీ రుణాలు రూ.59,414 కోట్లు ఉన్నాయని తెలిపారు.**
- **దీంతో మొత్తం రాష్ట్ర అప్పులు రూ.6,71,757 కోట్లకు చేరాయని వివరించారు.**

అప్పులతో పాటు పెండింగ్ బిల్లుల భారం కూడా భారీగానే ఉందని మంత్రి తెలిపారు. ఉద్యోగులు, మూలధన పనులు, సంక్షేమ పథకాలకు సంబంధించిన పెండింగ్ బిల్లులు రూ.40,154 కోట్లు, డిస్కంల విద్యుత్ బకాయిలు, సింగరేణి విద్యుత్ బకాయిలు, ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ బకాయిలు తదితర ఇతర పెండింగ్ చెల్లింపులు రూ.1,09,740 కోట్లు ఉన్నాయని చెప్పారు.మొత్తంగా అప్పులు, పెండింగ్ బిల్లులు కలిపి రాష్ట్రంపై రూ.8,21,651 కోట్ల ఆర్థిక భారం మిగిలిందని మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. కేటీఆర్.. నేను చెప్పిన లెక్కలు తప్పని.. కేసీఆర్ తో చెప్పించాలని, నా లెక్కలు తప్పని తేలితే రాజీనామాకు సిద్ధమనే మాటకు కట్టుబడి ఉన్నానని సవాల్ విసిరారు. ఈ అంశంపై బహిరంగ చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని, ప్రతిపక్ష నేతలు వాస్తవాలను ప్రజల ముందుంచాలని ఆయన సవాల్ విసిరారు.

# భారత్-జపాన్ బంధంలో చారిత్రాత్మక మైలురాయి

**ఢిల్లీ వెలుతురు జూలై 02:**

భారతదేశం, జపాన్ దేశాల మధ్య దశాబ్దాలుగా కొనసాగుతున్న అంతర్జాతీయ స్నేహ బంధం సరికొత్త స్థాయికి చేరుకుంది. ఢిల్లీ వేదికగా నిర్వహించిన భారత్-జపాన్ 16వ వార్షిక శిఖరాగ్ర సదస్సులో రెండు దేశాల అగ్రనేతలు పాల్గొని ద్వైపాక్షిక సంబంధాలపై కీలక ప్రకటనలు చేశారు. ఈ సందర్భంగా భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మాట్లాడుతూ, ప్రస్తుత అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో రెండు దేశాల మధ్య ఉన్న 'పరస్పర విశ్వాసమే' అన్నిటికంటే అతిపెద్ద వ్యూహాత్మక ఆస్తి అని అభివర్ణించారు. ప్రపంచ సంక్షోభ సమయాల్లో ఇరు దేశాల నమ్మకం మరింత బలపడిందని ఆయన స్పష్టం చేశారు.వార్షిక శిఖరాగ్ర సమావేశం కోసం భారత్‌కు విచ్చేసిన జపాన్ ప్రధాని సనాయె తకాయిచికి ప్రధాని మోదీ ఘనస్వాగతం పలికారు. ఆమెను తన 'చెల్లెలు' అని ఆత్మీయంగా సంబోధిస్తూ ప్రత్యేక గౌరవాన్ని చాటారు. జపాన్ దేశానికి మొట్టమొదటి మహిళా ప్రధానమంత్రిగా ఎన్నికైన సనాయె తకాయిచి ఎంతో దూరదృష్టి కలిగిన, ప్రజాదరణ పొందిన లీడర్ అని ప్రధాని కొనియాడారు. ఆమె ప్రాతినిధ్యం వహిస్తున్న జపాన్‌లోని నారా ప్రాంతం, భారతదేశంతో ముడిపడి ఉన్న ఉమ్మడి బౌద్ధ సాంస్కృతిక వారసత్వానికి ఒక చారిత్రాత్మక కేంద్రంగా నిలిచిందని మోదీ గుర్తుచేశారు.ఈ చారిత్రాత్మక సదస్సులో రక్షణ రంగానికి సంబంధించి ఒక అద్భుతమైన నిర్ణయం తీసుకున్నారు. భారత్, జపాన్ దేశాలు తమ రక్షణ చరిత్రలోనే మొట్టమొదటి సారిగా ఒక ఉమ్మడి ప్రాజెక్టును చేపట్టేందుకు చారిత్రాత్మక ఒప్పందం కుదుర్చుకున్నాయని ప్రధాని మోదీ వెల్లడించారు. దీనితో పాటు భవిష్యత్ అంతర్జాతీయ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంలో సరికొత్త భాగస్వామ్యం కోసం ఇరు దేశాల ప్రతినిధులు ఒకే ఉమ్మడి విజన్ పత్రాన్ని ఆవిష్కరించారు. ఇది ప్రపంచ వ్యూహాత్మక రంగంలో కొత్త అధ్యాయానికి నాంది పలుకుతుందని మోదీ ఆశాభావం వ్యక్తం చేశారు.గడచిన కొద్ది కాలంలో భారత్-జపాన్ దేశాల మధ్య ఆర్థిక, పెట్టుబడి భాగస్వామ్యం ఊహించని రీతిలో వేగవంతంగా పుంజుకుందని ప్రధాని మోదీ హర్షం వ్యక్తం చేశారు. గడిచిన ఏడాది కాలంలోనే ఇరు దేశాల ప్రైవేటు, ప్రభుత్వ రంగాల మధ్య దాదాపు 120 సరికొత్త వ్యాపార ఒప్పందాలు కుదిరాయని తెలిపారు. ఈ నూతన ఒప్పందాల ద్వారా దాదాపు 10 బిలియన్ డాలర్లకు పైగా జపాన్ దేశ పెట్టుబడులు భారత దేశానికి తరలిరానున్నాయని స్పష్టం చేశారు. ఇరు దేశాల ఫైనాన్షియల్ సర్వీసెస్ ఏజెన్సీల మధ్య జరిగిన తాజా ఒప్పందం దేశంలోకి పెట్టుబడుల ప్రవాహాన్ని మరింత సులభతరం చేస్తుందని పేర్కొన్నారు.భారతదేశంలో పెట్టుబడులు పెట్టడానికి జపాన్ పారిశ్రామిక వేత్తలు ఎంతో ఆసక్తిగా ఉన్నారని, అందుకు అనుగుణంగానే భారత ప్రభుత్వం పెద్ద ఎత్తున ఆర్థిక సంస్కరణలు చేపట్టిందని సీఎం తెలిపారు. తమ తదుపరి ప్రధాన టార్గెట్ జపాన్ నుంచి భారతదేశానికి ఏకంగా 10 ట్రిలియన్ల పెట్టుబడులను ఆకర్షించడమేనని మోదీ స్పష్టం చేశారు. అలాగే రానున్న పదేళ్ల కాలంలో దేశంలో ప్రస్తుతం పనిచేస్తున్న జపాన్ కంపెనీల సంఖ్యను రెట్టింపు చేయడమే తమ ప్రభుత్వ ధ్యేయమన్నారు. దేశంలో నిరంతరాయంగా జరుగుతున్న సంస్కరణలు 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' (వ్యాపార సౌలభ్యం)ను భారీగా మెరుగుపరిచాయని, ఈ సువర్ణ అవకాశాన్ని జపాన్ కంపెనీలు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.కేవలం రక్షణ, పారిశ్రామిక రంగాలకే పరిమితం కాకుండా ప్రజా ఆరోగ్య రక్షణలో కూడా భారత్-జపాన్ దేశాలు కీలక భాగస్వామ్యం వహించనున్నాయి. ఇందులో భాగంగా ఫార్మాస్యూటికల్స్ (ఔషధాల తయారీ), అత్యాధునిక వైద్య పరికరాల ఉత్పత్తి, బయోటెక్నాలజీ రంగాలలో ఇరు దేశాల నిపుణుల మధ్య పలు కీలక ఒప్పందాలు జరిగాయి. ఈ రంగాలలో జరిగే ఉమ్మడి పరిశోధనలు, పరస్పర సహకారం కేవలం ఇరు దేశాలకే కాకుండా, అంతర్జాతీయ స్థాయిలో ప్రపంచ ఆరోగ్య భద్రతను పటిష్టం చేయడానికి ఎంతగానో దోహదపడతాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆత్మవిశ్వాసం వ్యక్తం చేశారు.ప్రస్తుత ఆధునిక డిజిటల్ యుగంలో ఆర్థిక భద్రత, ఇంధన స్వయంసమృద్ధి అత్యంత ముఖ్యమైనవని ఇరు దేశాలు బలంగా నమ్ముతున్నాయి. అందుకోసం ఒక పటిష్టమైన ఆర్థిక భద్రత ఉమ్మడి రోడ్‌మ్యాప్‌ను సిద్ధం చేసినట్లు ప్రధాని మోదీ ప్రకటించారు. దీని ద్వారా అంతర్జాతీయంగా డిమాండ్ ఉన్న సెమీ కండక్టర్ల తయారీ, క్వాంటం టెక్నాలజీ, అధునాతన మెటీరియల్స్ వంటి అత్యంత వ్యూహాత్మక రంగాల్లో గ్లోబల్ సరఫరా గొలుసు దెబ్బతినకుండా స్థిరంగా ఉండేలా ఇరు దేశాలు కలిసికట్టుగా అడుగులు వేయనున్నట్లు స్పష్టం చేశారు.పర్యావరణ పరిరక్షణ మరియు ఇంధన భద్రత కోసం భారత్-జపాన్ బయోగ్యాస్ చొరవకు ఇరు దేశాల నేతలు ఆమోదం తెలిపారు. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ కింద భారతదేశం అంతటా సుమారు 1000 సరికొత్త బయోగ్యాస్ మరియు సేంద్రియ ఎరువుల ప్లాంట్లను స్థాపించనున్నారు. జపాన్ సాంకేతికతతో ఏర్పాటు కానున్న ఈ ప్లాంట్లు భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'గోబర్ధన్' కార్యక్రమానికి మరింత బలాన్ని చేకూర్చే స్తాయని ప్రధాని తెలిపారు.

# 14 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు ప్రత్యామ్నాయ పర్సన్-ఇన్-చార్జ్ కమిటీల నియామకం



**హైదరాబాద్, వెలుతురు జూలై 2:**

రాష్ట్రంలోని 14 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు (PACS) ప్రత్యామ్నాయ నాన్–అఫీషియల్ పర్సన్–ఇన్–చార్జ్ (PIC) కమిటీలను నియమిస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేయడం జరిగిందని వ్యవసాయ, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలియజేశారు. తెలంగాణ సహకార సంఘాల చట్టం ప్రకారం ఈ కమిటీలను ఆరు నెలలపాటు లేదా ఆయా సంఘాలకు ఎన్నికలు నిర్వహించే వరకు లేదా ప్రభుత్వం తదుపరి ఉత్తర్వులు జారీ చేసే వరకు, ఏది ముందైతే అది వర్తించే విధంగా నియమించడం జరిగిందన్నారు. సహకార సంఘాల ప్రత్యేక కమిషనర్ మరియు రిజిస్ట్రార్ ఆయా సహకార సంఘాల పనితీరుపై సమగ్ర పరిశీలన నిర్వహించి ప్రభుత్వానికి నివేదిక సమర్పించగా.. సంఘాల్లో రుణాల వసూళ్లలో తీవ్ర జాప్యం, ఎగవేతదారుల (డిఫాల్టర్ల) జాబితా తయారు చేయకపోవడం, బకాయిల వసూళ్ల కోసం చర్యలు చేపట్టకపోవడం, ఆడిట్ అభ్యంతరాలను సరిదిద్దకపోవడం, నిర్వహణ కమిటీ సభ్యులు సమావేశాలకు హాజరుకాకపోవడం, పరిపాలనా లోపాలు, సహకార సంఘాల ప్రధాన లక్ష్యాలకు విరుద్ధంగా వ్యవహరించడం వంటి అంశాలు వెలుగులోకి వచ్చినట్లు నివేదికలో పేర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో ప్రస్తుత కమిటీలు కొనసాగితే సహకార రుణ వ్యవస్థ లక్ష్యాల అమలు దెబ్బతింటుందని ప్రభుత్వం నిర్ధారణకు వచ్చింది. ఇదే సమయంలో, రాష్ట్రవ్యాప్తంగా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల పునర్వ్యవస్థీకరణ (Reorganisation) ప్రక్రియ ప్రస్తుతం ప్రభుత్వ పరిశీలనలో కొనసాగుతోంది. ఈ ప్రక్రియ పూర్తికాకముందు ఎన్నికలు నిర్వహించడం సాధ్యం కాని పరిస్థితి నెలకొన్నందున, రైతులకు రుణాలు, ఎరువులు, విత్తనాల పంపిణీతో పాటు ఇతర సహకార సేవలు ఎలాంటి అంతరాయం లేకుండా కొనసాగేందుకు ప్రత్యామ్నాయ నాన్–అఫీషియల్ పర్సన్–ఇన్–చార్జ్ కమిటీల నియామకం అవసరమని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు కరీంనగర్ జిల్లాలోని మానకొండూరు PACS, తాడికల్ PACS, మెట్ పల్లి PACS, వరంగల్ జిల్లాలోని అమీనాబాద్ PACS, ఖానాపూర్ PACS, మహ్మదాపూర్ PACS, మందపల్లి PACS, సూరిపల్లి PACS, రెడ్లవాడ PACS, చెన్నరావుపేట PACS, గురిజాల PACS, నర్సంపేట PACS మరియు వికారాబాద్ జిల్లాలో కుల్కచర్ల PACS, పరిగి PACS లకు ప్రత్యామ్నాయ నాన్–అఫీషియల్ పర్సన్–ఇన్–చార్జ్ కమిటీలను నియమిస్తూ, ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేయడం జరిగింది. ఈ కమిటీలు వెంటనే బాధ్యతలు స్వీకరించి ఆయా సహకార సంఘాల నిర్వహణను పర్యవేక్షించనున్నాయని ఈ సందర్భంగా మంత్రి పేర్కొన్నారు. ఉత్తర్వుల అమలుకు అవసరమైన తదుపరి చర్యలు చేపట్టాలని సహకార సంఘాల ప్రత్యేక కమిషనర్ & రిజిస్ట్రార్‌ను మంత్రి ఆదేశించారు.

# ప్రభుత్వ టీచర్లకూ అల్పాహారం, మధ్యాహ్న భోజనం

- **క్యాబినెట్ కీలక నిర్ణయం**
- **ఉపాధ్యాయులకూ పథకం వర్తింపు**
- **ప్రభుత్వ పాఠశాలల్లో అమలు**
- **కళాశాల సిబ్బందికీ వర్తింపు**
- **విద్యార్థులతో కలిసి భోజనం**
- **హాజరు పెంపుపై ప్రభుత్వం దృష్టి**
- **పాఠశాలల్లో సమాన వాతావరణం**
- **సంక్షేమానికి మరో అడుగు**
- **అమలు విధివిధానాలు త్వరలో క్యాబినెట్‌కు ప్రతిపాదన ఆమోదం**

**హైదరాబాద్ వెలుతురు జూలై 02:**

తెలంగాణ ప్రభుత్వం ప్రభుత్వ విద్యాసంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, సిబ్బంది సంక్షేమం దిశగా కీలక నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయ సిబ్బందికి కూడా అల్పాహారం, మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. ఈ మేరకు జరిగిన క్యాబినెట్ సమావేశంలో ప్రతిపాదనకు ఆమోదం లభించింది.ప్రస్తుతం ప్రభుత్వ



పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అల్పాహారం, మధ్యాహ్న భోజన పథకాలు అమల్లో ఉన్నాయి. తాజాగా అదే పథకాన్ని ఉపాధ్యాయులు, ఇతర సిబ్బందికీ విస్తరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు కూడా ఒకే ప్రాంగణంలో అల్పాహారం, మధ్యాహ్న భోజనం చేయనున్న పరిస్థితి ఏర్పడనుంది.ఈ నిర్ణయం ద్వారా పాఠశాలల్లో మరింత సానుకూల వాతావరణం ఏర్పడటంతో పాటు, ఉపాధ్యాయులు విద్యార్థులతో కలిసి భోజనం చేయడం వల్ల పర్యవేక్షణ, పోషకాహారంపై అవగాహన కూడా పెరుగుతుందని ప్రభుత్వం భావిస్తోంది. అలాగే ప్రభుత్వ విద్యాసంస్థల్లో సంక్షేమ కార్యక్రమాల అమలుకు ఇది మరో ముందడుగుగా అధికారులు పేర్కొంటున్నారు.ఈ పథకం అమలుకు సంబంధించిన మార్గదర్శకాలు, అర్హతలు, అమలు తేదీ, నిధుల కేటాయింపు తదితర అంశాలపై సంబంధిత శాఖ త్వరలో పూర్తి ఉత్తర్వులు జారీ చేయనుంది.

# బాణాపురంలో ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశం చేసిన భట్టి

- **లబ్ధిదారులతో కలిసి గృహప్రవేశం**
- **పేదల సొంతింటి కలే లక్ష్యం**
- **అర్హులందరికీ ఇల్లు అందిస్తాం**
- **ప్రభుత్వ సంకల్పాన్ని వివరించిన భట్టి**

**ముదిగొండ వెలుతురు జూలై 02:**

ముదిగొండ మండలం బాణాపురం గ్రామంలో నిర్మించిన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు పాల్గొన్నారు. లబ్ధిదారుల కుటుంబ సభ్యులతో కలిసి కొత్త ఇంటిలో గృహప్రవేశం చేసి వారికి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ ప్రతి నిరుపేద కుటుంబానికి సొంత ఇల్లు అందించి గౌరవప్రదమైన జీవనం కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. అదే ఉద్దేశంతో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తున్నట్లు వివరించారు.పేద కుటుంబాలకు సురక్షితమైన, శాశ్వత గృహ వసతి కల్పించడం ద్వారా వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచాలని ప్రభుత్వం సంకల్పించిందన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి సొంత ఇంటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా రాష్ట్రంలోని పేదలకు శాశ్వత గృహ వసతి కల్పించడంతో పాటు వారి జీవన నాణ్యతను మెరుగుపరచడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని భట్టి విక్రమార్క పేర్కొన్నారు.



# జపాన్ ప్రధాని నా చిట్టి చెల్లెలు: మోదీ

- **భారత్ పర్యటనకు వచ్చిన జపాన్ ప్రధానికి ఘన స్వాగతం**
- **సంయుక్త మీడియా సమావేశంలో ఆప్యాయ వ్యాఖ్యలు చేసిన ప్రధాని**

**ఢిల్లీ వెలుతురు జూలై 02:**

భారత్ పర్యటనకు వచ్చిన జపాన్ ప్రధాని సనాయె తకాయిచికి ప్రధాని నరేంద్ర మోదీ ఘన స్వాగతం పలికారు. అనంతరం నిర్వహించిన సంయుక్త మీడియా సమావేశంలో ఆమెను తన చిట్టి చెల్లెలుగా అభివర్ణిస్తూ ఆప్యాయంగా మాట్లాడారు. భారత్ అభివృద్ధి ప్రయాణంలో జపాన్ కీలక భాగస్వామి దేశమని మోదీ పేర్కొన్నారు.దీనికి ప్రతిస్పందించిన జపాన్ ప్రధాని సనాయె తకాయిచి.. భారత్, జపాన్ ఒకే లక్ష్యాలతో ముందుకు సాగుతున్నాయని, ద్వైపాక్షిక భాగస్వామ్యం మరింత బలోపేతం అవుతుందని అన్నారు.ఢిల్లీలో జరిగిన శిఖరాగ్ర సమావేశంలో రక్షణ, సాంకేతికత, ఆర్థిక సహకారం, పెట్టుబడులు తదితర కీలక అంశాలపై ఇరు దేశాల మధ్య విస్తృతంగా చర్చలు జరిగాయి. పరస్పర సహకారాన్ని మరింత విస్తరించే దిశగా పలు అంశాలపై ఏకాభిప్రాయం వ్యక్తమైనట్లు అధికారులు తెలిపారు.



# పేదలకు ఇందిరమ్మ ఇళ్ల పట్టాలు

**హైదరాబాద్ వెలుతురు జూలై 02:**

తెలంగాణ రాష్ట్రంలో నిరుపేదలకు సొంత ఇంటి కల నెరవేర్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ముందుకు సాగుతోంది. క్యూర్ పరిధిలో నిర్మించ తలపెట్టిన ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి త్వరలోనే భారీ ఎత్తున టెండర్లు పిలవనున్నట్లు రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. ఈ ఇళ్ల నిర్మాణానికి అత్యంత కీలకమైన స్థల సేకరణ ప్రక్రియ ప్రస్తుతం తుది దశకు చేరుకుందని ఆయన స్పష్టం చేశారు. దశలవారీగా రాష్ట్రంలోని ప్రతి ఒక్క పేద కుటుంబానికి పక్కా గృహాన్ని అందించి తీరుతామని, ఎవరూ అధైర్యపడాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు.హైదరాబాద్ నగరం గోషామహల్ నియోజకవర్గ పరిధిలో అన్ని హంగులతో పూర్తి చేసిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు సంబంధించిన అధికారిక పట్టాలను గురువారం నాడు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్‌లతో పాటు కాంగ్రెస్ అగ్రనేత మహ్మద్ అజారుద్దీన్, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్, హైదరాబాద్ ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ పాల్గొన్నారు. స్థానిక బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ కూడా ఈ వేదికను పంచుకుని మంత్రులతో కలిసి పేదలకు ఇళ్ల తాళాలు, పట్టాలను అందజేశారు. సొంత ఇళ్లు దక్కడంతో లబ్ధిదారుల కుటుంబాల్లో ఆనందోత్సాహాలు వ్యక్తమయ్యాయి.ఇళ్ల పంపిణీ అనంతరం ఏర్పాటు చేసిన సభలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి భవిష్యత్ కార్యాచరణను వివరించారు. క్యూర్ పరిధిలోని ఇన్నర్ రింగ్ రోడ్ ప్రాంతంలో దాదాపు ఒక లక్ష ఇందిరమ్మ ఇళ్లను నిర్మించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఇచ్చిన ప్రత్యేక ఆదేశాల మేరకు.. మూడు వేర్వేరు కార్పొరేషన్ల పరిధిలో లక్ష ఇళ్లకు అవసరమైన భూమిని సేకరిస్తున్నామని, మరో రెండు మూడు రోజుల్లో ఈ ప్రక్రియ ముగుస్తుందని చెప్పారు. ప్రాథమికంగా క్యూర్ పరిధిలోని 19 నియోజకవర్గాల్లో పైలట్ ప్రాజెక్ట్ కింద ఒక్కో నియోజకవర్గంలో 500 నుండి 1,000 ఇళ్ల నిర్మాణాన్ని ప్రారంభిస్తామని, ఆ తర్వాత రెండు, మూడు విడతల్లో మిగిలిన ఇళ్లను పూర్తి చేస్తామన్నారు.గ్రామీణ ప్రాంతాలతో పాటు పట్టణాల్లోని పేదలకు ఇళ్లు కట్టించి ఇవ్వడంలో కాంగ్రెస్ ప్రభుత్వం సరికొత్త చరిత్ర సృష్టించబోతోందని మంత్రి తెలిపారు. ఇప్పటికే పల్లెల్లో ఒక్కో నియోజకవర్గానికి సుమారు 5,500 ఇళ్లను మంజూరు చేసి పనులు ప్రారంభించామన్నారు. అదే సమయంలో హైదరాబాద్ వంటి మహానగరాల్లో భూమి విలువ ఆకాశాన్నంటుతోందని గుర్తుచేశారు. నగరంలో ఎకరా భూమి ధర రూ.100 కోట్ల నుండి రూ.200 కోట్ల వరకు పలుకుతున్నప్పటికీ.. ప్రభుత్వం ఆ వాణిజ్య విలువను అస్సలు పరిగణనలోకి తీసుకోదని స్పష్టం చేశారు. ఎంత ఖరీదైన భూమి అయినా సరే, దానిని పేదల కోసమే కేటాయించి అక్కడే ఇళ్లు కట్టించి వారి పేరు మీద రిజిస్ట్రేషన్ పట్టాలు ఇస్తామని ప్రకటించారు.గోషామహల్ పరిధిలోని ధూల్‌పేట ప్రాంతంలో గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ఎన్నో ఏళ్లుగా అసంపూర్తిగా, పాడుపడిపోయి ఉన్న 125 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుని పూర్తి చేసిందని పొంగులేటి చెప్పారు. ఈ రోజు ఆ ఇళ్లను లబ్ధిదారులకు సగర్వంగా అప్పగించామన్నారు. అయితే ఈ నియోజకవర్గంలో ఇంకా ఎంతో మంది నిరుపేదలు ఇళ్లు లేక అద్దె ఇళ్లలో మగ్గుతున్నారని.. వారందరికీ కూడా రాబోయే రోజుల్లో ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. అందుకోసం ధూల్‌పేట పరిసర ప్రాంతాల్లో ప్రభుత్వ స్థలాలను తక్షణమే అన్వేషించాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్‌కు వేదికపై నుంచే మంత్రి ఆదేశాలు జారీ చేశారు.గత పాలకులు అనుసరించిన తప్పుడు విధానాలను కాంగ్రెస్ ప్రభుత్వం మార్చివేసిందని మంత్రి పొంగులేటి ఈ సందర్భంగా వివరించారు. "గతంలో పేదలకు ఇళ్లు ఇస్తున్నామనే పేరుతో వారిని హైదరాబాద్ నగరానికి 30 నుండి 40 కిలోమీటర్ల దూరంలో ఎక్కడో అడవుల్లో, శివార్లలో ఉన్న ప్రాంతాలకు తరలించేవారు. దీనివల్ల వారి రోజువారీ జీవనోపాధి, కూలీ పనులు దెబ్బతినేవి. కానీ మా ప్రభుత్వంలో అలాంటి పద్ధతి ఉండదు. నగరంలో నివసించే పేదలకు వారి జీవనాధారాలు, వ్యాపారాలు ఎక్కడైతే ఉన్నాయో.. దానికి అత్యంత దగ్గరగా, అదే నియోజకవర్గ పరిధిలోనే ఇళ్లు కట్టించి ఇవ్వడం మా ప్రభుత్వ కట్టుబాటు" అని స్పష్టం చేశారు.పదేళ్ల పాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ సాధించిన ప్రగతి కంటే.. కేవలం రెండున్నరేళ్ల పాలనలోనే కాంగ్రెస్ ప్రభుత్వం అత్యధిక ఇళ్లను నిర్మించి చూపిస్తుందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సవాల్ విసిరారు. "ఒకవేళ నేను చెప్పినట్లుగా పదేళ్ల బీఆర్ఎస్ మార్కు కంటే ఎక్కువ ఇళ్లను రెండున్నరేళ్లలో పేదలకు ఇవ్వలేకపోతే.. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో నేను అసలు పోటీనే చేయను. ఈ ఓపెన్ ఛాలెంజ్‌ను నేను ఎప్పుడో విసిరాను. కానీ దురదృష్టవశాత్తూ ఇప్పటివరకు ఏ ఒక్క బీఆర్ఎస్ నేత కూడా నా సవాల్‌ను స్వీకరించేందుకు ముందుకు రాలేదు" అని ఎద్దేవా చేశారు.

గత బీఆర్ఎస్ ప్రభుత్వం పేదలకు ఇళ్లు కట్టిస్తే తమకు ఎలాంటి ఆర్థిక ప్రయోజనం ఉండదనే స్వార్థ ఆలోచనతోనే డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను పూర్తిగా పక్కనబెట్టేసిందని మంత్రి పొంగులేటి ధ్వజమెత్తారు. కేవలం కమీషన్లు, అవినీతికి ఆస్కారం ఉండే భారీ నీటిపారుదల ప్రాజెక్టుల పేరుతో లక్షల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని ఆరోపించారు. కానీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఆ తప్పుడు పోకడలకు స్వస్తి చెప్పిందని.. ప్రజల సొమ్మును తిరిగి ప్రజల సంక్షేమం కోసమే, ముఖ్యంగా పేదల సొంత గూడు నిర్మాణం కోసమే ఖర్చు పెడుతోందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా త్వరలోనే 'గుడిసెల్లేని తెలంగాణ' అనే మహోన్నత లక్ష్యాన్ని నిజం చేసి చూపిస్తామని మంత్రి పొంగులేటి ధీమా వ్యక్తం చేశారు.



# ఇవాళే ఆఖరి రోజైతే?

ఉదయం అలారం కీర్తనలు నిద్ర లేవగానే అరచేతిలో అరచేతి వెడల్పు ప్రపంచం అవును, కళ్లు తెరిచీ తెరవగానే ఫోన్ స్క్రీన్ వైపు చేతులు సాచి, నోటిఫికేషన్ల సునామీలో మునిగిపోవడం మన నిత్యకృత్యం. ఆఫీసు డెడ్‌లైన్లు, మెయిళ్ల మోతలు, రోడ్లపై ట్రాఫిక్ యుద్ధాలు, రేపటి గురించిన ఆందోళనలు ఇదీ మన సగటు ఉదయాల అసలు సిసలు ముఖచిత్రం. ఈ యాంత్రిక జీవన స్రవంతిలో పడి మనం ఒక రొటీన్ చక్రంలో కొట్టుకుపోతున్నాం. కానీ, ఒక్క క్షణం గుండెల మీద చేయి వేసుకుని ఆలోచించండి. ఈ రోజు రాత్రి మనం హాయిగా కళ్లు మూసుకున్న తర్వాత, రేపు ఉదయం మళ్లీ ఆ కళ్లు తెరవకపోతే? ఒకవేళ ఇవాళ్టి రోజే మన జీవితపు ఆఖరి పేజీ అయితే, ఈ అమూల్యమైన క్షణాలను మనం ఇలాగే, ఇంతే అనాలోచితంగా గడిపేస్తామా? ఈ ప్రశ్న వినడానికి కాస్త గంభీరంగా, గుండె గిచ్చి నట్టుగా అనిపించవచ్చు. కానీ ఇది జీవితం పట్ల నిరాశను పెంచే చీకటి ఆలోచన కాదు, మంచు తెరల వెనుక దాగున్న సత్యాన్ని వెలికితీసి, మనల్ని నిద్రలేపే ఒక అద్భుతమైన జీవన దర్పణం.



కాలం వెనక్కి వెళ్తే, ప్రాచీన గ్రీకు, రోమన్ మేధావులు ఒక అద్భుతమైన జీవిత సూత్రాన్ని నమ్మారు. దాన్ని వారు మెమెంటో మోరి అని పిలిచేవారు. అంటే, నువ్వు ఒకరోజు మరణిస్తావనే సత్యాన్ని ఎప్పుడూ గుర్తుంచుకో అని దాని అంతరార్థం. రోమన్ స్టోయిక్ తత్వవేత్త సెనెకా తన అమూల్యమైన వ్యాసాలలో ఒక చక్కని మాట చెప్పారు. మనుషులు జీవితాన్ని పొదుపుగా వాడుకోవడం చేతకాక, ఇష్టం వచ్చినట్టు ఖర్చు పెట్టేస్తారు. ఎప్పుడైతే కాలం యొక్క అంతిమ విలువ తెలుస్తుందో, అప్పుడే నిజమైన బతుకు మొదలవుతుంది. చావుకు భయపడుతూ బతకడం అజ్ఞానం,కానీ చావు ఎలాగూ వస్తుందని తెలిసి, ఉన్న సమయాన్ని అత్యంత అర్థవంతంగా తీర్చిదిద్దుకోవడమే అసలైన జ్ఞానమని ఆయన బోధించారు.మన భారతీయ ఆధ్యాత్మిక చింతన కూడా సరిగ్గా ఇదే సత్యాన్ని మరో కోణంలో ఆవిష్కరించింది. కురుక్షేత్ర రణరంగంలో నిరాశతో కుంగిపోయిన అర్జునుడికి శ్రీకృష్ణ పరమాత్ముడు భగవద్గీత ద్వారా ఇదే పరమార్థాన్ని ప్రబోధించారు. ఈ భౌతిక శరీరం నశ్వరమైనదని, కేవలం ఆత్మ మాత్రమే శాశ్వతమని ఆయన స్పష్టం చేశారు. అంటే, ఏది ఎలాగూ శాశ్వతంగా మనతో ఉండదో, దాని కోసం అత్యాశతో, ఆరాటంతో కొట్టుమిట్టాడకుండా, ప్రస్తుత క్షణంలో ధర్మబద్ధంగా, ప్రశాంతంగా జీవించడమే మానవ జన్మకు సార్థకత అని గీతాసారం మనకు గుర్తుచేస్తోంది.ఆస్ట్రేలియాకు చెందిన ప్రముఖ హాస్పిస్ నర్సు బ్రోనీ వేర్, తన జీవితంలో ఎక్కువ భాగం మరణ పడకపై ఉన్న రోగులకు సేవ చేయడానికే అంకితం చేశారు. ఆఖరి శ్వాస తీసుకునే ముందు ఆ మనుషులు పడిన పశ్చాత్తాపాలను, వారి మనోవేదనలను ఆమె నిశితంగా గమనించి ఒక పుస్తక రూపంలో ప్రపంచం ముందుకు తెచ్చారు. ఆశ్చర్యకరమైన విషయం ఏంటంటే, చనిపోయే ముందు ఎవరూ కూడా నేను ఇంకాస్త సంపాదించి ఉంటే బాగుండు అని అనుకోలేదు! మెజారిటీ రోగులు మేము ఇతరుల అంచనాలకు అనుగుణంగా బతికాము కానీ, మాకు నచ్చినట్టు, మా మనసుకు నచ్చిన జీవితాన్ని జీవించలేకపోయాము అని కన్నీరు పెట్టుకున్నారు. రాత్రింబవళ్లు కేవలం ఆఫీసు పనులకే పరిమితమయ్యామని, స్నేహితులకు, కుటుంబానికి దూరమయ్యామని, మనసులోని అసలైన భావాలను ధైర్యంగా వ్యక్తపరచలేకపోయామని వారు తీవ్రంగా తపించిపోయారు.మనస్తత్వ శాస్త్ర పరిశోధనలు కూడా ఇదే విషయాన్ని ఘంటాపథంగా చెప్తున్నాయి. జీవితంలో ఎప్పుడైనా మరణం సంభవిస్తుందనే స్పృహ మనుషులలో ప్రాధాన్యతలను పూర్తిగా మారుస్తుందని తేలింది. భౌతిక సంపద, లగ్జరీ వస్తువుల కంటే కూడా మనుషుల మధ్య ఉండే ఆత్మీయ బంధాలు, జీవితానుభవాలు, సమాజానికి పనికొచ్చే పనులకే మనుషులు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తారని అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి. మరణాన్ని ఒక నిషేధిత విషయంగా దాచిపెట్టడం కంటే, దాన్ని అప్పుడప్పుడూ గుర్తుచేసుకోవడం వల్ల మానసిక ఆరోగ్యం మెరుగుపడటమే కాకుండా, జీవితం పట్ల తృప్తి పెరుగుతుందని సైకాలజిస్టులు అభిప్రాయపడుతున్నారు.మరణాన్ని ఒక గైడింగ్ ఫోర్స్‌గా మార్చుకున్న మహానుభావులలో యాపిల్ సహ వ్యవస్థాపకుడు స్టీవ్ జాబ్స్ అగ్రగణ్యుడు. 2005లో స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయం స్నాతకోత్సవంలో ఆయన చేసిన ప్రసంగం ప్రపంచవ్యాప్తంగా పెను సంచలనం సృష్టించింది. తనకు క్యాన్సర్ సోకిన భయానక అనుభవాన్ని పంచుకుంటూ ఆయన ఒక రహస్యాన్ని చెప్పారు. తను ప్రతిరోజూ ఉదయం అద్దం ముందు నిలబడి, ఈ రోజే నా జీవితంలో ఆఖరి రోజు అయితే, ఇవాళ నేను చేయాలనుకుంటున్న పనిని నిజంగానే సంతోషంగా చేస్తానా? అని ప్రశ్నించుకునేవారట. వరుసగా కొన్ని రోజుల పాటు ఆ ప్రశ్నకి కాదు అనే సమాధానం వస్తే, తక్షణమే తన జీవితంలో ఏదో పెద్ద మార్పు చేయాల్సిన సమయం ఆసన్నమైందని ఆయన గ్రహించేవారు. ఈ ఒక్క ఆలోచనే ఆయనను సంచలనాత్మక నిర్ణయాలు తీసుకునేలా, అనవసరమైన సామాజిక ఒత్తిళ్లను పక్కనపెట్టి అద్భుతాలు సృష్టించేలా చేసింది.మన మధ్యే ఉన్న కథలు మన వాస్తవాలు.మన తెలుగు రాష్ట్రాల్లోని ఇళ్లను ఒక్కసారి పరిశీలిస్తే ఇలాంటి ఎన్నో భావోద్వేగాల కథలు కనిపిస్తాయి. పిల్లల చదువులు, ఇళ్ల స్థలాలు, బ్యాంకు బ్యాలెన్స్‌ల కోసం రాత్రింబవళ్లు రెక్కలు ముక్కలు చేసుకునే తల్లిదండ్రులు ఎందరో! ఆ పరుగులో వారు తమ సొంత ఆరోగ్యాన్ని, కనీస ఇష్టాలను పూర్తిగా సమాధి చేస్తారు. ఉద్యోగంలో తదుపరి ప్రమోషన్ కోసం అర్ధరాత్రి దాకా లాప్‌టాప్‌ల ముందు కూర్చుంటూ వృద్ధులైన తల్లిదండ్రులతో గడపాల్సిన సాయంత్రాలను, భార్యాపిల్లలతో నవ్వుకోవాల్సిన క్షణాలను రేపు చూద్దాంలే అంటూ వాయిదా వేస్తూనే ఉంటాం. కానీ, ఆ రేపు అనేది మన జీవితంలో వస్తుందనే గ్యారంటీ కార్డ్ ఎవరి దగ్గరైనా ఉందా?కరోనా మహమ్మారి సృష్టించిన బీభత్సం మన కళ్లముందే ఉంది. ఎంతోమంది ఐశ్వర్యవంతులు, ఆరోగ్యవంతులు సైతం క్షణాల వ్యవధిలో కంటికి కనిపించని వైరస్‌కు బలయ్యారు. ఆ సంక్షోభం మనకు ఒక పెద్ద పాఠం నేర్పింది. ఆస్తులు, అంతస్తులు తాత్కాలికమని ఆరోగ్యం, కుటుంబ సాన్నిహిత్యం, మనశ్శాంతి మాత్రమే శాశ్వతమని చాలామంది గ్రహించారు. మరణం అనేది మన తలుపు తట్టినప్పుడు మాత్రమే మనం అసలైన ప్రాధాన్యతలను గుర్తించగలుగుతున్నాం.ఇక్కడ మనం గమనించాల్సిన ముఖ్యమైన విషయమేమిటంటే, చివరి రోజు అనే భావన మనల్ని భయపెట్టడానికి కాదు, మన జీవితానికి ఒక స్పష్టతను ఇవ్వడానికి మాత్రమే. దీనికోసం ప్రతిరోజూ ఏదో సినిమాటిక్‌గా, నాటకీయంగా బతకాల్సిన అవసరం లేదు. కేవలం వారానికి ఒక్కసారైనా మన పరుగును కాస్త ఆపి, నేను సరైన దారిలోనే వెళ్తున్నానా? నా ప్రాణప్రదమైన మనుషుల కోసం నేను సమయం కేటాయిస్తున్నానా? అని ఆత్మపరిశీలన చేసుకోవాలి. అవతలి వ్యక్తిపై కోపం వచ్చినప్పుడు కాస్త తగ్గడం, మనసుకు నచ్చిన వారికి ప్రేమను వ్యక్తపరచడానికి రేపటి వరకు ఆగకపోవడం, చిన్న చిన్న సంతోషాలను వాయిదా వేయకుండా ఇప్పుడే ఆస్వాదించడం ఈ మార్పులన్నీ ఆ ఒక్క చిన్న ప్రశ్న నుంచే మొదలవుతాయి.జీవితం అంటే మనం ఎన్ని సంవత్సరాలు బతికామనే క్యాలెండర్ లెక్క కాదు, ప్రతి క్షణాన్ని ఎంత హృదయపూర్వకంగా ఆస్వాదించామనే శ్వాసల లెక్క. మరణం మనల్ని నిరాశలో ముంచడానికి రాదు, జీవితాన్ని ఎలా చేజార్చుకుంటున్నామో గుర్తుచేసి మేల్కొలపడానికి వస్తుంది.కాబట్టి, ఇవాళ రాత్రి హాయిగా పరుపుపై వాలే ముందు, ఒక్క నిమిషం కళ్లు మూసుకుని మిమ్మల్ని మీరు ప్రశ్నించుకోండి. ఈ రోజే నా జీవితంలో ఆఖరి రోజు అయితే, నేను గడిపిన ఈ విధానం నాకు తృప్తిని ఇచ్చిందా? నా మాటలు, నా పనులు నేను కోరుకున్న స్వేచ్ఛా జీవితాన్ని ప్రతిబింబిస్తున్నాయా, లేక సమాజం గీసిన గీతల్లో ఇరుక్కుని బతుకుతున్నానా? సమాధానం మీ అంతరాత్మలోనే ఉంది. మరి ఆ ప్రయాణాన్ని ఇప్పుడైనా ప్రారంభిస్తారా?



డా. సూర్యదేవర రామకృష్ణ ,
Moral Philosopher, 9490754169

# తెలంగాణ రైతాంగం – వాస్తవాలు, వాగ్దానాలు, వర్తమానం

తెలంగాణ ఉద్యమం కేవలం ఒక రాష్ట్ర సాధన కోసం జరిగిన పోరాటం మాత్రమే కాదు. అది దశాబ్దాలుగా నిర్లక్ష్యానికి గురైన ప్రాంత ప్రజల ఆత్మగౌరవం కోసం, వారి హక్కుల కోసం సాగిన మహోద్యమం. ఆ ఉద్యమంలో రైతు ప్రధాన పాత్ర పోషించాడు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణ రైతాంగం ఎదుర్కొన్న సమస్యలు ఎన్నో. సాగునీటి కొరత, విద్యుత్ సమస్యలు, బోర్లు ఎండిపోవడం, అప్పుల భారం, పంటలకు గిట్టుబాటు ధరలు లేకపోవడం వంటి ఎన్నో కష్టాలతో రైతు జీవితం సాగేది. ఆ పరిస్థితుల్లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే రైతు జీవితం మారుతుందనే ఆశతో లక్షలాది మంది ప్రజలు ఉద్యమంలో భాగమయ్యారు.2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కొత్త ప్రభుత్వం రైతాంగాన్ని కేంద్రంగా చేసుకుని అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేసింది. రైతులకు వ్యవసాయ విద్యుత్ సరఫరాను మెరుగుపరచడం, సాగునీటి ప్రాజెక్టులకు ప్రాధాన్యం ఇవ్వడం, చెరువుల పునరుద్ధరణకు చర్యలు చేపట్టడం, వ్యవసాయ పెట్టుబడి కోసం రైతు బంధు వంటి పథకాలను ప్రవేశపెట్టడం ద్వారా వ్యవసాయ రంగంలో కొత్త ఆశలు చిగురించాయి. అనేక ప్రాంతాల్లో సాగు విస్తీర్ణం పెరిగింది. రైతులు మక్కజొన్న, పత్తి, వరి వంటి పంటలను సాగు చేసి మార్కెట్‌లో విక్రయించే స్థాయికి చేరుకున్నారు. ఈ మార్పులను చాలా మంది రైతులు ప్రత్యక్షంగా అనుభవించామని చెప్పడం కూడా వాస్తవమే.అయితే, ఈ మార్పుల గురించి మాట్లాడేటప్పుడు అతిశయోక్తులు కాకుండా చారిత్రకంగా నిర్ధారించదగిన అంశాలను గుర్తుంచుకోవాలి. ఉదాహరణకు "రాష్ట్రం ఏర్పడిన ఆరు నెలల్లోనే పూర్తిగా రైతుల పరిస్థితి మారిపోయింది" లేదా "ఉమ్మడి రాష్ట్రంలో 20–30 సంవత్సరాల పాటు రైతులకు కేవలం రెండు మూడు గంటల మాత్రమే విద్యుత్ ఇచ్చేవారు" వంటి వ్యాఖ్యలపై భిన్నాభిప్రాయాలు, వేర్వేరు గణాంకాలు ఉన్నాయి. కాబట్టి అలాంటి అంశాలను రాజకీయ వ్యాఖ్యలుగా చూడాలి తప్ప, అందరూ అంగీకరించిన చారిత్రక వాస్తవాలుగా పరిగణించడం సరైంది కాదు.రాజకీయాలు మారుతాయి. ప్రభుత్వాలు మారుతాయి. కానీ రైతు సమస్యలు మాత్రం పరిష్కారానికి నిరంతర కృషిని కోరుకుంటాయి. ప్రస్తుతం తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వంపై కూడా రైతాంగం నుంచి అనేక ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా వ్యవసాయ విద్యుత్ సరఫరా విషయంలో రైతులు పలుచోట్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని చెబుతున్నారు. విద్యుత్ కోతలు, సమయానికి కరెంట్ అందకపోవడం వల్ల పంటలకు నీరు పెట్టలేక రైతులు ఆందోళన చెందుతున్న సందర్భాలు కనిపిస్తున్నాయి. వ్యవసాయం అనేది సమయంతో ముడిపడి ఉంటుంది. ఒకసారి నీరు ఆలస్యమైతే పంట మొత్తం దెబ్బతినే ప్రమాదం ఉంటుంది. అందుకే రైతు కోరుకునేది రాజకీయ ప్రసంగాలు కాదు, నిరంతరాయంగా విద్యుత్ సరఫరా.విద్యుత్ సమస్యలతో పాటు ఎరువుల కొరత కూడా రైతాంగాన్ని తీవ్రంగా కలవరపెడుతోంది. సాగు సీజన్ ప్రారంభమైన ప్రతిసారి ఎరువుల కోసం రైతులు దుకాణాల ముందు క్యూలలో నిలబడే పరిస్థితులు కనిపిస్తుంటాయి. సరైన సమయంలో ఎరువులు అందకపోతే పంట దిగుబడి తగ్గుతుంది. రైతు చేసిన పెట్టుబడి వృథా అవుతుంది. కాబట్టి ఎరువుల సరఫరా, విత్తనాల నాణ్యత, మార్కెట్ సదుపాయాలు వంటి అంశాలపై ప్రభుత్వం మరింత చిత్తశుద్ధితో పనిచేయాల్సిన అవసరం ఉంది.అంతేకాదు, రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర లభించకపోతే అతని శ్రమకు విలువ ఉండదు. కనీస మద్దతు ధర ప్రకటించడం ఒక్కటే సరిపోదు. రైతు తన పంటను అమ్మే సమయంలో నిజంగా ఆ ధర లభించేలా కొనుగోలు వ్యవస్థ బలోపేతం కావాలి. లేకపోతే మధ్యవర్తుల చేతుల్లో రైతు నష్టపోవాల్సి వస్తుంది. రైతు సంక్షేమం గురించి మాట్లాడే ప్రతి ప్రభుత్వం ఈ విషయాన్ని గుర్తుంచుకోవాలి.ఇక జాతీయ రాజకీయాల విషయానికి వస్తే, దేశవ్యాప్తంగా రైతు సమస్యలపై అధికార, ప్రతిపక్ష పార్టీలు పరస్పరం విమర్శలు చేసుకుంటుంటాయి. ఒకవైపు కేంద్ర ప్రభుత్వ విధానాలను ప్రతిపక్ష నేతలు విమర్శిస్తుంటే, మరోవైపు రాష్ట్ర ప్రభుత్వాల పనితీరుపై అధికార పార్టీలు ప్రశ్నలు లేవనెత్తుతుంటాయి. ప్రజాస్వామ్యంలో విమర్శలు సహజమే. అయితే రైతు దృష్టిలో చూస్తే అతనికి ముఖ్యమైనది ఎవరు ఎవరిని విమర్శించారు అనేది కాదు. తన పొలానికి నీరు వస్తుందా? కరెంట్ వస్తుందా? ఎరువులు దొరుకుతాయా? పంటకు గిట్టుబాటు ధర లభిస్తుందా? అనే ప్రశ్నలకే సమాధానం కావాలి.రైతు దేశానికి అన్నదాత. అతని కష్టంపై సమాజం మొత్తం ఆధారపడి ఉంది. అలాంటి రైతును రాజకీయ లాభనష్టాల కోణంలో చూడటం తగదు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయడం ప్రతి ప్రభుత్వ బాధ్యత. రైతు సమస్యలను కేవలం సభలలో ప్రసంగించే అంశాలుగా కాకుండా, క్షేత్రస్థాయిలో పరిష్కరించాల్సిన బాధ్యత పాలకులపై ఉంటుంది.తెలంగాణ సమాజం తన ఆత్మగౌరవాన్ని ఎంతో విలువైనదిగా భావిస్తుంది. ఈ నేల సంస్కృతి పరస్పర గౌరవాన్ని, మానవత్వాన్ని, కష్టపడే మనిషికి విలువ ఇవ్వడాన్ని నేర్పింది. రాజకీయ విభేదాలు ఉండవచ్చు. అభిప్రాయ భేదాలు ఉండవచ్చు. కానీ ప్రజలను తక్కువ చేసి మాట్లాడటం, వారి బాధలను చిన్నచూపు చూడటం ఏ ప్రజాస్వామ్యానికీ మంచిది కాదు. రైతు, కూలీ, పేద ప్రజల ఆత్మగౌరవాన్ని గౌరవించడం ప్రతి ప్రజాప్రతినిధి కర్తవ్యం.ఈ దేశ సంపదను సృష్టించేది కష్టజీవులే. రైతు పండించిన ధాన్యమే దేశానికి ఆహార భద్రతను కల్పిస్తుంది. కూలీ నిర్మించిన భవనాల్లోనే సమాజం జీవిస్తుంది. కాబట్టి వారిని ఓట్ల కోసం మాత్రమే గుర్తు చేసుకోవడం కాదు, వారి సమస్యలకు శాశ్వత పరిష్కారాలు చూపించడమే నిజమైన ప్రజాసేవ.చివరగా చెప్పాలంటే, తెలంగాణ రైతాంగం గతంలో ఎన్నో కష్టాలు ఎదుర్కొంది. రాష్ట్రం ఏర్పడిన తర్వాత కొన్ని రంగాల్లో గణనీయమైన పురోగతి కనిపించింది. అదే సమయంలో ప్రస్తుతం కూడా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను నిర్లక్ష్యం చేయలేం. విద్యుత్ సరఫరా, ఎరువుల లభ్యత, సాగునీరు, పంటలకు గిట్టుబాటు ధర, మార్కెట్ సదుపాయాలు వంటి అంశాలపై ప్రభుత్వం నిరంతరం దృష్టి సారించాలి. రైతు సంతోషంగా ఉంటేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుంది. రాజకీయాలు శాశ్వతం కావు, కానీ రైతు శ్రమ శాశ్వతం. అందుకే రైతు సంక్షేమాన్ని మాటల్లో కాదు, చేతల్లో చూపించాల్సిన సమయం ప్రతి ప్రభుత్వానిదే.



మన్నారం నాగరాజు
సామాజిక రాజకీయ విశ్లేషకులు

# గ్రామ సమస్యలపై ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ని కలిసిన తులేకాలేన్ గ్రామస్తులు

- **అభివృద్ధికి నిధుల మంజూరుకు నాది హామీ మాట ఇస్తున్న నిధులు మంజూరు చేయిస్తాను**
- **ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి**

**ఇబ్రహీంపట్నం వెలుతురు జులై 02:**

ఇబ్రహీంపట్నం మండలం తులేకాలేన్ గ్రామానికి చెందిన గ్రామస్తులు తొర్రూర్ ఎమ్మెల్యే క్యాంప్ ఆ ఫీసులో ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి గారిది కలిసి గ్రామ అభివృద్ధి కోసంనిధులు మంజూరు చేయాలని కోరారువెంటనే స్పందించిన ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూప్ర తి పల్లె మెరిసేలా ప్రజలు మురిసేలా ప్రగతికి బాటలు వేయటమే లక్ష్యమని ఇందుకు నిధులమంజూరు బాధ్యతతనదని హామీ ఇచ్చారు సందర్భంగా గ్రామ సర్పంచ్ వార్డుసభ్యులు మాట్లాడుతూ రెండున్నరేళ్లలో గ్రామంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు.ఎమ్మెల్యే సహకారంపట్ల వారు హర్షం వ్యక్తం చేశారు మరిన్ని సమస్యలను ఈసందర్భంగా వారు వివరించారు తులేకలాన్ లో రోడ్లుప్రభుత్వ పాఠశాలలో సౌకర్యాలు తదితరసమస్యల గురించి ఎమ్మెల్యేకు వివరించి చెప్పారు విన్న వించారు గతంలో మంజూరు చేసిన నిధులు చేపట్టిన కార్యక్రమాలపై ఆరాతీసిన ఎమ్మెల్యే మరి న్ని నిధులను మంజూరు చేసేందుకు సిద్ధమేనని చెప్పారు నియోజకవర్గంలోని ప్రతీ ఊరునూ స మస్యల్లేకుండా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో పనిచేస్తున్నట్లు ఎమ్మెల్యేమల్ రెడ్డి చెప్పారు ప్రజలు పెట్టు కున్న నమ్మకాన్ని నిలబెట్టుకునేందుకు రాజకీయాలకతీతంగా ప్రతీఒక్కరూ కలిసిరావాలని కోరా రు తులేకలాన్ గ్రామస్థుల అభ్యర్థన మేరకు ఊరిని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు సహకరిస్తానని ఆయన హామీ ఇచ్చారు ఈకార్యక్రమంలో గ్రామసర్పంచ్ వార్డు సభ్యులు స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# ప్రతి అర్హ ఓటరికి ఇబ్బంది లేకుండా ఓటరు జాబితా సవరణ పూర్తి చేయాలి: మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు



**కూకట్ పల్లి జూలై 02 వెలుతురు:**

భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించాలని మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు సూచించారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని వివేకానంద నగర్ డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో నిర్వహిస్తున్న సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని మాధవరం రంగారావు పరిశీలించారు. ఈ సందర్భంగా బూత్ లెవెల్ ఆఫీసర్లు (బీఎల్ఓలు), బీఆర్ఎస్ పార్టీ బూత్ లెవెల్ ఏజెంట్లు (బీఎల్ఏలు)తో కలిసి ఇంటింటికీ వెళ్లి ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటిని బీఎల్ఓలు, బీఎల్ఏలు తప్పనిసరిగా సందర్శించి, ఫారంలో వివరాలను ఎలా నమోదు చేయాలనే విషయాన్ని ఓటర్లకు స్పష్టంగా వివరించాలని సూచించారు. అర్హులైన ప్రతి ఓటరు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా సమగ్ర ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులకు, సిబ్బందికి సూచించారు. ఓటరు జాబితా ప్రజాస్వామ్యానికి పునాది అని పేర్కొన్న ఆయన, ప్రతి అర్హ పౌరుడు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తన వివరాలను సరిచూసుకొని అవసరమైన మార్పులు, చేర్పులు చేసుకోవాలని కోరారు.

# ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో ఐక్యతను పెంపొందిస్తాయి: టీపీసీసీ చీఫ్ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్


**కూకట్ పల్లి జూలై 02 వెలుతురు:**

ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో ఐక్యత, సౌభ్రాతృత్వ భావాలను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలంగాణ రాష్ట్ర పీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. దేవాలయాలు భక్తి, సంస్కృతి, సామాజిక విలువలకు కేంద్రబిందువులుగా నిలుస్తాయని ఆయన పేర్కొన్నారు. బోరబండ శివాజీనగర్‌లోని శ్రీశ్రీశ్రీ నల్లపోచమ్మ నూతన దేవాలయ యంత్ర, విగ్రహ, సింహవాహన శిఖర ప్రతిష్ఠ మహోత్సవానికి శివాజీనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆలయ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ నాయకుడు అక్కినాపురం లక్ష్మణ్ గౌడ్ ఆహ్వానం మేరకు టీపీసీసీ చీఫ్ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయనతో పాటు పీసీసీ సభ్యుడు, టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం వేద పండితులు వేదాశీర్వచనాలు అందించి, తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ



కమిటీ సభ్యులు వారిని శాలువాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ నల్లపోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవంలో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో శాంతి, సత్సంకల్పాలను పెంపొందించడంతో పాటు ప్రజల్లో ఐక్యతను బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు. అమ్మవారి కృపాకటాక్షాలు ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని, రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులు పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్న ఆయన, హైదరాబాద్‌లో నెల రోజుల పాటు జరిగే ఆషాఢ బోనాల ఉత్సవాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. భక్తిశ్రద్ధలతో మహోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్న ఆలయ కమిటీ సభ్యులను అభినందిస్తూ వారి సేవాభావాన్ని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో బి-బ్లాక్ అధ్యక్షుడు తూము వేణు, డివిజన్ అధ్యక్షులు మొయినుద్దీన్, కృష్ణ రాజ్‌పుత్, విఠల్ రెడ్డి, నరసింహ యాదవ్, కనకయ్య, లక్ష్మీనారాయణ, సుంకన్న, మస్తాన్ రెడ్డి, భారతమ్మ, కలికోట శంకర్, రాజేష్ గౌడ్, పల్లపు వేణు, చోటా మొయిజ్, అహ్మద్ వాజీద్ పాషా, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# గౌడ సంఘం సభ్యుడు పల్లె శ్రీనివాస్ గౌడ్ కూతురి వివాహ వేడుకల్లో పాల్గొన్న కాంగ్రెస్ నాయకుడు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి



**మంచాల వెలుతురు జులై 02:**

మంచాల మండలం చౌటుప్పల్ మండలం తూప్రాన్ పేట్ గ్రామం కె ఆర్ సి గార్డెన్ లో జరిగిన ఆరుట్ల గ్రామానికి చెందిన గౌడ సంఘం సభ్యుడు పల్లె శ్రీనివాస్ గౌడ్ కూతురి వివాహ వేడుకల్లో పాల్గొని నూతన దంపతులు అక్షిత సాయికుమార్ గౌడ్ ను ఆశీర్వదించిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి ఆయన వెంట ఇందిరమ్మ కమిటీ సభ్యుడు చెరుకు నరసింహ గౌడ్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గుడ్డిమల్ల చంద్రయ్య ముదిరాజ్ అంతటి రాజుగౌడ్ వై యస్సార్ మాధగోని జంగయ్యగౌడ్ తలారి కృష్ణ ముదిరాజ్ ఎన్నుదుల సురేష్ తన గంటి కృష్ణ మాడపాకుల యాదగిరి సుంకరి ప్రవీణ్ గౌడ్ మాడపాకుల శ్రీనివాస్ అంతటికృష్ణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆరుట్ల గ్రామంలో ఎస్ఐఆర్ ఓటర్ సర్వే కార్యక్రమంలో పాల్గొని బూత్ లెవెల్ ఇంచార్జ్ లకు ఐడీ కార్డులు అందజేసిన ఎడ్మ నరేందర్ రెడ్డి

- **గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పార్టీ బలోపేతం కోసం కృషి చేస్తూ ఎస్ ఐ ఆర్ ఓటర్ సర్వే కార్యక్రమం లో అర్హులైన ప్రజల ఓట్లు తొలగించకుండా చూసుకోవాలి**
- **కాంగ్రెస్ పార్టీ మంచాల మండలం అధ్యక్షుడు ఎడ్మనరేందర్ రెడ్డి**

**మంచాల వెలుతురు జూలై 02:**

మంచాల మండలం తెలంగాణ రాష్ట్రంలో ఎన్నికల కమిషన్ చేపట్టిన (ఎస్ ఐ ఆర్) స్పెషల్ఇంటె న్సివ్ రివిజన్ ఓటర్ సర్వే కార్యక్రమంలో భాగంగా ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి గారి ఆదేశాల మేరకు ఆరుట్ల గ్రామంలో కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ ప్రధాన కార్యదర్శి చిందం శ్రీశైలం ఆధ్వర్యంలో పర్యటించిన మంచాల మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎడ్మ నరేందర్ ఆరుట్ల గ్రామంలో గడప గడపకు వెళ్లి ఎస్ ఐ ఆర్ ఓటర్ సర్వే కార్యక్రమం ఎలా జరుగుతుందో అడిగి వి వరాలు తెలుసుకున్నారు అనంతరం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేసిబూత్ లెవెల్ ఇంచార్జ్ లకు ఐడి కార్డు అందజేశారు సందర్భంగా అధ్యక్షుడు ఎడ్మ నరేందర్ రెడ్డి మాట్లాడుతూ అర్హులైన ప్రజల ఓట్లు కాంగ్రెస్ పార్టీ నాయకుల కార్యకర్తల ఓట్లు తొలగిపోకుండాబూత్ లెవెల్ అధికారుల వెంట ఉండి బూత్ లెవెల్ అధికారులు ఇచ్చే ప్రతిపత్రం క్షుణ్ణంగా పరిశీలించి వివరాలు వ్రాసేలా కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు కృషి చేయాలి అనిఅన్నారు గ్రామాల్లో ప్రతి వార్డుకు ఒక కమిటీని ఏర్పాటు చేసుకుని అర్హులైన వారి ఓట్లు తొలిగిపోకుండా తగు జాగ్రత్తలు తీసుకునేలా ప్రతి కాంగ్రెస్ పార్టీ నాయకుడు కార్యకర్త పని చేయాలి అని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో మంచాల వ్యవసాయ సహకార సంఘం డైరెక్టర్ జెనిగే వెంకటేష్ యాదవ్



ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ డైరెక్టర్ సాతిరిఎల్లేష్ మంచాల మండలం యూత్ కాంగ్రెస్అధ్యక్షుడు రావుల రాఘవ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మారగోని మాసయ్యగౌడ్ గుడ్డిమల్ల చంద్రయ్య ముదిరాజ్ మర సురేష్ బూత్ లెవెల్ ఇంచార్జ్ లు నూకం మల్లేష్ ముదిరాజ్ శంకర్ ముదిరాజ్ రావులమహేష్ లచ్చగారి జంగారెడ్డి చిందం ఐలయ్య బీర్ మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పన ధ్యేయంగా పనిచేయాలి:జోత్స్నా శివారెడ్డి





**కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) జూలై 02:**

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పన ధ్యేయంగా పనిచేయాలని తెలంగాణ ఎడ్యుకేషన్ కమిషన్ సభ్యురాలు జ్యోత్స్న శివారెడ్డి పేర్కొన్నారు. గురువారం జెడ్పీహెచ్ఎస్ షాపూర్ నగర్ పాఠశాలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా సియుఆర్ఈ నిధులతో నిర్మిస్తున్న మరుగుదొడ్ల నిర్మాణ పనులను పరిశీలించి, పనుల పురోగతిని సమీక్షించారు.పాఠశాల ఆవరణలో పరిశుభ్రతను ఎప్పటికప్పుడు పాటించాలని సంబంధిత అధికారులకు సూచించారు. సియుఆర్ఈ నిధులతో చేపడుతున్న పనులను నాణ్యతతో, నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని ఆదేశించారు.ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత విద్యుత్, స్కావెంజర్ నిధులు, సియుఆర్ఈ నిధులు, మధ్యాహ్న భోజనంలో సన్నబియ్యం వంటి కార్యక్రమాలు అమలవుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, విద్యార్థుల సంక్షేమం గణనీయంగా మెరుగుపడుతున్నాయని ఆమె పేర్కొన్నారు.ప్రభుత్వ పాఠశాలలను మరింత అభివృద్ధి చేసి విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణాన్ని కల్పించేందుకు తెలంగాణ ఎడ్యుకేషన్ కమిషన్ నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉపాధ్యాయులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఏవీబీ పురంలో డ్రైనేజీ, తాగునీటి సమస్యలపై జనసేన పోరాటం.. అధికారుల నుంచి త్వరిత పరిష్కార హామీ..

**కూకట్ పల్లి జూలై 02 వెలుతురు:**

ఏవీబీ పురం 11వ రోడ్ లో నెలకొన్న డ్రైనేజీ, తాగునీటి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ జనసేన నాయకులు, కాలనీవాసులు వాటర్ వర్క్స్ అధికారులకు వినతిపత్రం సమర్పించారు. సమస్యపై అధికారులు వెంటనే స్పందించి బాధిత ప్రాంతాన్ని సందర్శించి త్వరలోనే పరిష్కారం చూపుతామని హామీ ఇవ్వడం స్థానికుల్లో ఆశలు రేకెత్తించింది. కూకట్ పల్లి నియోజకవర్గ జనసేన పార్టీ కాంటెస్టెడ్ అభ్యర్థి ముమ్మారెడ్డి ప్రేమ్ కుమార్ సూచనల మేరకు ఏవీబీ పురం ప్రెసిడెంట్ సీమాద్రి, జనసేన నాయకులు, కాలనీవాసులు భారత్‌నగర్‌లోని వాటర్ వర్క్స్ విభాగం మేనేజర్ సయ్యద్ అబ్దుల్ జాకేను కలిసి వినతిపత్రం



అందజేశారు.వినతిపత్రంలో ఏవీబీ పురం 11వ రోడ్ లో సుమారు వంద కుటుంబాలు నివసిస్తున్నప్పటికీ డ్రైనేజీ, తాగునీటి పైప్‌లైన్ సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని వెంటనే మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. స్పందించిన వాటర్ వర్క్స్ జనరల్ మేనేజర్ చంద్రశేఖర్ స్వయంగా ఏవీబీ పురం లో పర్యటించి స్థానిక కుటుంబాలతో మాట్లాడారు. వారి సమస్యలను పరిశీలించిన అనంతరం అవసరమైన చర్యలు తీసుకుని డ్రైనేజీ, తాగునీటి సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అధికారుల తక్షణ స్పందనపై జనసేన కాంటెస్టెడ్ అభ్యర్థి ముమ్మారెడ్డి ప్రేమ్ కుమార్, కాలనీవాసులు వాటర్ వర్క్స్ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు కొల్లా శంకర్, వేముల మహేష్, టి. ప్రసాద్, దుర్యోధన, మోహన్ రావు తదితరులు, స్థానిక కాలనీ వాసులు పాల్గొన్నారు.

# బాలుడిని తల్లిదండ్రులకు అప్పజెప్పిన జీడిమెట్ల పోలీసులు

**కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) జూలై 02:**



గత నెల 20న సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ లో మూడు సంవత్సరాల బాబు నిఖిల్ అనే బాబు కిడ్నాప్ గురైనట్లు వారి తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సికింద్రాబాద్ రైల్వే పోలీస్ కేసు నమోదు చేయడం జరిగింది. ఆ తర్వాత సీసీ కెమెరాల ఆధారంగా నేరస్తుల కోసం విచారించిన క్రమంలో షేక్ మహబూబ్ అలీ అనే వ్యక్తి ఆ బాబుని తీసుకొని జీడిమెట్ల పోలీస్ స్టేషన్ రావడం జరిగింది. అతని విచారించగా రెండు రోజుల క్రితం నాకు ఈ బాబు దొరికాడు సికింద్రాబాద్ అని చెప్పాడు. కానీ పూర్తిస్థాయిలో విచారిస్తే అతని 20వ తారీకు తీసుకోవడం జరిగింది. ఆ ఫొటోస్ ను ఆధారంగా చేసుకుని సికింద్రాబాద్ రైల్వే పోలీసులను సంప్రదించగా ఈఫోటో చూపిస్తే ఆ బాలుడు కిడ్నాప్ గురైనట్లు చెప్పడం కిడ్నాప్ అయినా బాలుడు తల్లిదండ్రులకు వీడియో కాల్ చేసి చూపియ్యగా వారు కూడా ఈ బాబు వాళ్ళ బాబాయ్ అని చెప్పడంతో ఆ బాబును గురువారం తల్లిదండ్రులకు అప్పచెప్పడం జరిగింది. ఎవరైతే అనుమానించడంలో అతన్ని జీడిమెట్ల పోలీస్ కి సికింద్రాబాద్ రైల్వే పోలీస్ కి హ్యాండ్ ఓవర్ చేయడం జరిగింది. తదుపరి విచారణ తర్వాత చట్టరీత్యా వారిపై సికింద్రాబాద్ రైల్వే పోలీసులు చర్యలు తీసుకుంటారు.

# నిజాంపేట్ మున్సిపల్ సర్కిల్ అభివృద్ధిపై సమగ్ర సమీక్ష నిర్వహించిన ఎమ్మెల్యే కె.పి.వివేకానంద

**కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) జూలై 02:**

చెరువుల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన, పారిశుద్ధ్య నిర్వహణపై అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీచేశారు.కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు, పరిశుభ్రమైన వాతావరణం కల్పించడమే లక్ష్యంగా కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి. వివేకానంద గురువారం ప్రగతి నగర్‌లోని నిజాంపేట్ మున్సిపల్ సర్కిల్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈసందర్భంగా సర్కిల్ పరిధిలోని చెరువుల అభివృద్ధి, సుందరీకరణతో పాటు వాటి పరిరక్షణకు చేపట్టాల్సిన చర్యలపై అధికారులతో ఎమ్మెల్యే సుదీర్ఘంగా చర్చించారు. ముఖ్యంగా తుర్క చెరువు అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు. పత్తికుంట చెరువు, మేడికుంట చెరువు, అంబీర్ చెరువు అభివృద్ధి పనులను కూడా త్వరితగతిన ప్రారంభించి పూర్తి చేయాలని సూచించారు.అనంతరం సర్కిల్ పరిధిలో జరుగుతున్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులు, సీసీ రోడ్ల నిర్మాణ పనుల పురోగతిని సమీక్షించారు. కొత్త వీధిదీపాల ఏర్పాటు, ఇప్పటికే ఉన్న వీధి దీపాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. పారిశుద్ధ్య నిర్వహణను మరింత పటిష్టంగా చేపట్టి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆదేశించారు.2బీహెచ్‌కే గృహ సముదాయాల్లో



అవసరమైన మౌలిక వసతుల అభివృద్ధి పనులను ప్రాధాన్యతతో చేపట్టాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రభుత్వం చేపట్టిన ఎస్ఐఆర్ (SIR) కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు, ప్రజల్లో అవగాహన కల్పించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అధికారులను కోరారు. నిజాంపేట సర్కిల్ అభివృద్ధికి సంబంధించిన ప్రతి పనిని నాణ్యతతో, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని, ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే ఈసందర్భంగా స్పష్టం చేశారు. ఈసమావేశంలో నిజాంపేట సర్కిల్ ఉప కమిషనర్ షబ్బీర్ అలీ, డిప్యూటీ తహశీల్దారు ఉమామహేశ్వర రెడ్డి, ఇరిగేషన్ డిఈ రూప్ లాల్, వీరారెడ్డి, ఎఈ రవి, ఇంజనీరింగ్ శాఖ, జలమండలి శాఖ అధికారులు, నిజాంపేట కార్పొరేషన్ మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, అధ్యక్షుడు రంగరాయ ప్రసాద్, మాజీ కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, సంక్షేమ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి సహాయ నిధి ( CMRF ) చెక్కులను పంపిణీ చేసిన డీసీసీ ఉపాధ్యక్షులు కూన శ్రీనివాస్ గౌడ్

**కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) జూలై 02:**



కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన పలువురు అనారోగ్యం రీత్యా వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందిన వెంకట్రావు, లావణ్య, మోహన్, శంకర్ నాయుడు, స్వరూప తదితరులు ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్నారు. వారి దరఖాస్తులను పరిశీలించిన అనంతరం మొత్తం రూ.3.50 లక్షల విలువైన సహాయ నిధి చెక్కులు మంజూరయ్యాయి. ఈ చెక్కులను కూన శ్రీనివాస్ గౌడ్ షాపూర్ నగర్ లోని నివాసంలో బాధితులకు అందజేశారు.ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ... ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ పథకాన్ని వినియోగించుకోవాలని సూచించారు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, జిల్లా ఇన్చార్జ్ మంత్రి శ్రీధర్ బాబు సారథ్యంలో కుత్బుల్లాపూర్ నియోజక వర్గంలో అర్హులైన అందరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు కృషి చేస్తామన్నారు. బాధితులు తమకు ఆర్థిక చేయూత అందించిన ప్రభుత్వానికి, డీసీసీ ఉపాధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్ కు ధన్యవాదాలు తెలిపారు. ఈకార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఏనుగుల శ్రీనివాసరెడ్డి, సిహెచ్ బుచ్చిరెడ్డి, మోతే శ్రీనివాస్ యాదవ్, షాకీర్, రఘు గౌడ్, వెంకట్ రెడ్డి, శంకర్ గౌడ్, చోటు బాయ్, లక్ష్మణ్, కనకరాజు, రాకేష్ మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# తెలంగాణ రాష్ట్ర డిజిపి సివి ఆనంద్ ను కలిసిన బిఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ బూడిద రాంరెడ్డి

- **మత్తు మహమ్మారిని చిత్తు చేయాలి యువత జీవితాల్లో వెలుగులు నింపాలి**
- **బిఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ బూడిద రాంరెడ్డి**

**ఇబ్రహీంపట్నం వెలుతురు జులై 02:**

ఇబ్రహీంపట్నం నియోజకవర్గం డిజిపి కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర డిజిపి సివి ఆనంద్ ను కలిసిన బిఆర్ ఆర్ ఫౌండేషన్ చైర్మన్ బూడిద రాంరెడ్డి ఈసందర్భంగామాట్లడుతూనేటి బాలలే రేపటి దేశపుపౌరులు నేటి యువతకు రేపటి భవిష్యత్తు అవగాహన లేకపోతే ఈస మాజాన్ని కాపాడే వారు లేరని చెడు వ్యసనాలకు బానిసగా మారిన యువతను కాపాడడానికి కట్టుది ట్ట మైన చర్యలను తీసుకోవాలని బిఆర్ ఆర్ ఫౌండేషన్ చైర్మన్ బూడిద రాంరెడ్డి తెలంగాణ డీజీపీ సివి ఆనంద్ గారిని కలిసి వినతిపత్రం అందజేశారు డ్రగ్స్ గంజాయి యువత దరి



చేరకుండా ప్ర త్యేక ఆపరేషన్ లు చేపట్టాలని తెలిపారు రోడ్లపైన 24 గంటలు గంజాయి సప్లయ్ చేసే ముఠాల ను పట్టుకోవడానికి రెక్కీ నిర్వహించే టీమ్ లను ఏర్పాటు చేయాలని తెలిపారు అదే రకంగా ఫోన్ లో ఆన్లైన్ బెట్టింగ్ గేమ్స్ కి బానిసలుగా మారి కోట్లలో అప్పుచేసే యువతి యువకులకు ప్రత్యేక కౌన్సిలింగ్ నిర్వహించి వారి జీవితాలలో వెలుగులు నింపాలని ఆవేదన వ్యక్తం చేశారు. డీజీపీ సి.వి ఆనంద్ సానుకూలంగా స్పందిస్తూ డ్రగ్స్ మహమ్మారిని అంతంచేయాలని తెలంగాణ పోలీస్ డిపార్ట్మెంట్ చిత్తశుద్ధిగా పని చేస్తుందని తెలిపారు కార్యక్రమంలో బిఆర్ఆర్ ఫౌండేషన్ సభ్యుడు పున్నం రాము తదితరులు పాల్గొన్నారు.

# ఫుట్ బాల్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన మల్కాపురం విద్యార్థినులు

**చౌటుప్పల్ వెలుతురు జూలై 02:**



ఫుట్ బాల్ రాష్ట్రస్థాయి పోటీలకు చౌటుప్పల్ మండలం దండు మల్కాపురంలోని జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినులు జి. భవ్య (9 వ తరగతి), వై. రష్మిక (ఏడవ తరగతి) ఎంపికయ్యారు. ఈనెల 3, 4, 5 తేదీల్లో నిజామాబాదులో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో ఈ విద్యార్థినులు పాల్గొననున్నారు. ఉమ్మడి నల్గొండ జిల్లా ఫుట్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల రెండున నల్గొండ జిల్లా చర్లపల్లి లో నిర్వహించిన సబ్ జూనియర్ ( అండర్ 14) బాలికల ఎంపిక పోటీలో మల్కాపురం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినిలు ఆరుగురు పాల్గొన్నారు. విద్యార్థినులు క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించి ఇద్దరు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన ఈ విద్యార్థినులను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఆర్. శోభ, ఫిజికల్ డైరెక్టర్ భావన, ఇతర ఉపాధ్యాయులు అభినందించారు.

# స్నేహితురాలికి ₹20,000/ ఆర్థిక సాయం చేసిన పదవ తరగతి స్నేహితులు

**మోత్కూర్, జులై 2,వెలుతురు న్యూస్ :**



మోత్కూరు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల 2005-2006 బ్యాచ్ పదవ తరగతి చదువుకున్న స్నేహితురాలు చిల్లవసంత భర్త శ్రీను చనిపోయిన విషయం తెలుసుకున్న స్నేహితులు తొండ్లయి గ్రామంలో చిల్ల వసంతకు ఇరవై వేయిల రూపాయలు ఆర్థిక సాయం చేశారు.ఆపదలో ఉన్న స్నేహితురాలికి సాయం చేసిన స్నేహితులను గ్రామ ప్రజలు అభినందించారు.ఈకార్యక్రమంలో ఎడ్ల యాకు ,బీసు వెంకటేష్ , అద్దంకి రమేష్, కడమంచి ధనంజయ్, కందుల కవిత,ఎండి మలాన్బి తదితరులు పాల్గొన్నారు.

# మోత్కూర్ చేనేత సహకార సంఘంలో మొదలైన ఎన్నికల నామినేషన్ ప్రక్రియ

**మోత్కూర్, జులై 2,వెలుతురు న్యూస్ :**



మోత్కూర్ చేనేత సహకార సంఘంలో జూలై 10 వ తారీకు జరిగే ఎన్నికలలో భాగంగా గురువారం రోజున స్థానిక చేనేత సహకార సంఘ భవనంలో 9 మంది డైరెక్టర్ల స్థానాలకు గాను 21 మంది డైరెక్టర్లుగా నామినేషన్ వేశారు. 7 జనరల్ స్థానానికి 17 మంది డైరెక్టర్లుగా,2 మహిళ రిజర్వేషన్ స్థానాలకు గాను నలుగురు మహిళ డైరెక్టర్లుగా మొత్తం 21 మంది మొదటి రోజు నామినేషన్లు వేశారని ఎన్నికల అధికారి సయ్యద్ సుజాత్ అలీ ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చేనేత సహకార సంఘం మేనేజర్ వేముల నరసయ్య, దోర్నగోపయ్య తదితరులు పాల్గొన్నారు.

# బందెల లింగస్వామి మృతదేవానికి నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య



**రామన్నపేట వెలుతురు న్యూస్ జూలై 02:**

మండలం ఉత్తటూరు గ్రామానికి చెందిన బందెల లింగస్వామి అనారోగ్యంతో మృతి చెందగా మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఉత్తటూరు గ్రామానికి వెళ్లి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించడం జరిగింది. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి మనోధైర్యం కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు పోషబోయిన మల్లేశం మాజీ సర్పంచ్ కోళ్ల స్వామి నాయకులు కోళ్ల కిషన్, జెట్టి సైదులు, పోతుల స్వామి, మేడి రాజు, జంగిలి శీను, బందెల నరసింహ, జంగిలి స్వామి, యాదయ్య రాజు, వెంకన్న, మల్లయ్య తదితరులు పాల్గొనడం జరిగింది.

# తెలంగాణ ఉద్యమకారుల ముందస్తు అరెస్ట్

**రామన్నపేట వెలుతురు న్యూస్ జూలై 02:**




మండలంలో తెలంగాణ ఉద్యమకారులను ముందస్తుగా అరెస్టు చేయడం జరిగినది. తెలంగాణ ఉద్యమకారులకు 250 చదరపు గజాల స్థలం ఇవ్వాలని చలో భూదాన్ కార్యక్రమానికి టిఆర్ఎస్ పార్టీ అధినేత మాజీ ఎంపీ కల్వకుంట్ల కవిత ఇచ్చిన పిలుపుమేరకు రామన్నపేట తెలంగాణ ఉద్యమకారులను ముందస్తుగా అరెస్టు చేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎస్కే చాంద్ మండల అధ్యక్షులు నోముల శంకర్ మండల ఉపాధ్యక్షుడు బొడ్డుపల్లి లింగయ్య. మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎండి ఇమామ్ తదితరులు అరెస్టు చేయడం జరిగినది.

# శ్రీ చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవ కరపత్రం ఆవిష్కరించిన సర్పంచ్ గరిక సత్యనారాయణ

**రామన్నపేట వెలుతురు న్యూస్ జులై 02:**



పట్టణ కేంద్రంలో ప్రసిద్ధిగాంచిన శ్రీ చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్స కరపత్ర ఆవిష్కరణకు ముఖ్య అతిదులుగా గ్రామ సర్పంచ్ గరిక సత్యనారాయణ, ఉపసర్పంచ్ మోటె రమేష్ ఆవిష్కరించారు.అనంతరం ఆలయ చైర్మన్ లవణం ఉపేందర్ మాట్లాడుతూ నాలుగో తారీఖు శనివారం రోజున బ్రహ్మోత్సవ అంకురార్పణ ప్రత్యేక పూజల, ధ్వజారోహణ అనంతరం హోమము నిర్వహించబడును. ఆదివారం ఐదో తారీకు రోజున స్వామివారికి ప్రత్యేక పూజలు 11 గంటల 15 నిమిషాలకు శ్రీ స్వామివారి కళ్యాణ మహోత్సవ కార్యక్రమం నిర్వహించబడును. అనంతరం ఒంటిగంటకు అన్నప్రసాద వితరణ కార్యక్రమం జరుగుతుంది. సోమవారం ఆరో తారీఖు నాడు తెల్లవారుజామున స్వామివారి రథోత్సవం ఊరేగింపు ఉంటుందని తెలిపారు. ఈ బ్రహ్మోత్సవాల్లో రామన్నపేట మండల మరియు పట్టణ ప్రజలు పెద్దాయత్తున పాల్గొని కార్యక్రమాలను జయప్రదం చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సాల్వేర్ అశోక్, జెల్ల వెంకటేష్, గోదాసు సుగ్రీవులు, ఊట్కూరు నరసింహ, వనం అంజయ్య, కోట సుధాకర్, పూజారి శ్రీనివాస్ ఆచార్యులు, భూసాని యాదగిరి, రాధా కిషన్, వార్డు సభ్యులు సుర్వి హరిబాబు, ఊట్కూరు శీను, ఆలయ కమిటీ భక్త బృందం తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు మెరుగైన సేవలు అందాలి

- ప్రజాప్రతినిధులు, సంబంధిత వర్గాలతో సంప్రదింపులు జరపాలని ఆదేశం
- హైదరాబాద్ కమిషనరేట్‌లో కొన్ని స్టేషన్ల పరిధులపై ప్రత్యేక మార్గదర్శకాలు
- ప్రజాకేంద్రిత పోలీసింగ్ లక్ష్యంగా పునర్వ్యవస్థీకరణ
- సేవల మెరుగుదలే ప్రధాన ఉద్దేశమని స్పష్టం

**హైదరాబాద్ వెలుతురు జూలై 02:**

హైదరాబాద్ నగర పరిధిలోని పోలీస్ స్టేషన్ల పునర్వ్యవస్థీకరణపై ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. సీయూఆర్ఈ (క్యూర్) పరిధిలోని హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి, ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ల కమిషనర్లతో సమావేశమై పోలీస్ స్టేషన్ల పునర్వ్యవస్థీకరణకు సంబంధించిన అంశాలపై విస్తృతంగా చర్చించారు.ఈ సందర్భంగా నగర భవిష్యత్ విస్తరణ, జనాభా పెరుగుదల, పరిపాలనా అవసరాలను దృష్టిలో ఉంచుకుని దీర్ఘకాలిక ప్రణాళికతో పోలీస్ స్టేషన్ల పునర్వ్యవస్థీకరణ చేపట్టాలని సూచించారు. ప్రభుత్వ ఉత్తర్వులను కచ్చితంగా పాటిస్తూ, మున్సిపల్, రెవెన్యూ, న్యాయస్థానాల పరిధులకు అనుగుణంగా ఈ ప్రక్రియను అమలు చేయాలని ఆదేశించారు. అలాగే సంబంధిత వర్గాలతో సంప్రదింపులు జరిపిన అనంతరమే తుది నిర్ణయాలు తీసుకోవాలని స్పష్టం చేశారు.హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని కొన్ని పోలీస్ స్టేషన్ల హద్దుల నిర్ణయంపై ప్రత్యేక ఆదేశాలు జారీ చేసినట్లు వెల్లడించారు. పునర్వ్యవస్థీకరణ ప్రక్రియ ప్రజాకేంద్రిత పోలీసింగ్‌కు మరింత బలం చేకూర్చడంతో పాటు ప్రజలకు అందించే సేవలు మరింత సమర్థవంతంగా ఉండేలా చూడాలని నాలుగు కమిషనరేట్ల పోలీస్ కమిషనర్లకు సూచించారు.

# ఏజెన్సీ నియోజకవర్గాలకు మరో 2 వేల ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వండి

- ఐటీడీఏలను మరింత బలోపేతం చేయాలని సూచన
- ఆశ్రమ పాఠశాలలను ఇంటర్ వరకు అప్‌గ్రేడ్ చేయాలని అభ్యర్థన
- గిరిజన ప్రాంతాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి కోరిన ప్రజాప్రతినిధులు
- మంత్రులు పొంగులేటి, అడ్లూరి, అజారుద్దీన్ సమావేశంలో పాల్గొనడం
- గిరిజన సంక్షేమంపై సమగ్ర చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి

**హైదరాబాద్ వెలుతురు జూలై 02:**

ఏజెన్సీ ప్రాంతంలోని శాసనసభ నియోజకవర్గాలకు అదనంగా 2 వేల ఇందిరమ్మ ఇళ్లను కేటాయించాలని ఆదివాసీ, గిరిజన ప్రాంతాల ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డిని కోరారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క నేతృత్వంలో గిరిజన ఎమ్మెల్యేల బృందం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రిని కలిసి ఈ మేరకు వినతిపత్రాన్ని సమర్పించింది.ఈ సందర్భంగా గిరిజన ప్రాంతాల అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. ఏజెన్సీ ప్రాంతాల్లో సాగు చేస్తున్న పోడు భూములకు అర్హులైన గిరిజనులకు పట్టాలు మంజూరు చేయాలని, అలాగే ఇందిర గిరి జల వికాసం. పథకాన్ని అమలు చేసి గిరిజన ప్రాంతాల్లో సాగునీటి సదుపాయాలను మెరుగుపరచాలని విజ్ఞప్తి చేశారు.అదేవిధంగా సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థలను (ఐటీడీఏలు) మరింత బలోపేతం చేయాలని, గిరిజన విద్యార్థుల ఉన్నత విద్య కోసం ఆశ్రమ పాఠశాలలను ఇంటర్మీడియట్ స్థాయి వరకు అప్‌గ్రేడ్ చేయాలని కోరారు. గిరిజన ప్రాంతాల సామాజిక, విద్యా, ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని ఎమ్మెల్యేలు సూచించారు.ముఖ్యమంత్రిని కలిసిన వారిలో అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు ఉన్నారు. ఈ సమావేశంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, మహమ్మద్ అజారుద్దీన్ కూడా పాల్గొన్నారు.

# కీవ్‌పై క్షిపణులు, డ్రోన్లతో భారీ దాడి

- ఉక్రెయిన్ దాడులకు రష్యా ప్రతీకారం అర్ధరాత్రి భారీ వైమానిక దాడులు
- కీవ్‌లో వరుస పేలుళ్లతో భయం
- నివాస భవనాలు ధ్వంసమైన ఘటన
- ప్రజలు బంకర్లలోకి పరుగులు
- విమాన దాడి హెచ్చరికలతో అలజడి
- డ్రోన్లు, క్షిపణులతో ముమ్మర దాడి
- ఇంధన కేంద్రాల దాడులకు ప్రతిస్పందన
- యుద్ధం మరింత ఉధృతమయ్యే సూచనలు
- ప్రపంచ దేశాల్లో పెరుగుతున్న ఆందోళన

**రష్యా వెలుతురు జూలై 02:**



రష్యా-ఉక్రెయిన్ యుద్ధం మరోసారి తీవ్రరూపం దాల్చుతోంది. ఇటీవల రష్యాలోని చమురు శుద్ధి కర్మాగారాలు, ఇంధన మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకుని ఉక్రెయిన్ వరుస డ్రోన్ దాడులు నిర్వహించింది. ఈ దాడుల కారణంగా రష్యాలో కొన్ని ప్రాంతాల్లో ఇంధన సరఫరాపై ప్రభావం పడగా, మాస్కో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ పరిణామాలకు ప్రతీకారంగా రష్యా అర్ధరాత్రి ఉక్రెయిన్‌పై భారీ స్థాయిలో క్షిపణులు, డ్రోన్లతో విరుచుకు పడింది.రాజధాని కీవ్‌తో పాటు పలు ప్రాంతాల్లో గంటలపాటు వైమానిక దాడులు కొనసాగినట్లు ఉక్రెయిన్ అధికారులు తెలిపారు. ఒకదాని వెంట ఒకటి క్షిపణులు, ఆత్మాహుతి డ్రోన్లు దూసుకొచ్చిన నేపథ్యంలో నగరమంతా భారీ పేలుళ్ల శబ్దాలతో మారుమోగింది.

వైమానిక దాడి హెచ్చరిక సైరన్లు మోగడంతో ప్రజలు భయాందోళనలకు గురై బంకర్లు, మెట్రో స్టేషన్లు, భూగర్భ ఆశ్రయ కేంద్రాల్లోకి పరుగులు తీశారు.ఈ దాడుల్లో పలు నివాస భవనాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. కొన్ని అపార్ట్‌మెంట్ సముదాయాల్లో అగ్నిప్రమాదాలు సంభవించినట్లు స్థానిక అధికారులు వెల్లడించారు. అగ్నిమాపక సిబ్బంది, సహాయక బృందాలు రాత్రంతా సహాయక చర్యలు చేపట్టాయి. శిథిలాల కింద చిక్కుకున్న వారి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. మృతులు, గాయపడిన వారి సంఖ్యపై పూర్తి వివరాలు ఇంకా వెల్లడికాలేదు.ఉక్రెయిన్ వైమానిక రక్షణ వ్యవస్థలు పలు క్షిపణులు, డ్రోన్లను గాల్లోనే కూల్చివేసినప్పటికీ, కొన్ని లక్ష్యాలను తాకినట్లు అధికారులు తెలిపారు. విద్యుత్, ఇతర మౌలిక సదుపాయాలపై కూడా దాడులు జరిగినట్లు సమాచారం. దీంతో కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.మరోవైపు, రష్యాలోని చమురు శుద్ధి కర్మాగారాలపై ఉక్రెయిన్ ఇటీవల నిర్వహించిన దాడులు మాస్కోకు గట్టి ఎదురుదెబ్బగా మారాయి. ఈ పరిణామాల నేపథ్యంలో ఇరు దేశాలు ఒకదానిపై ఒకటి మరింత తీవ్ర స్థాయిలో దాడులు కొనసాగిస్తున్నాయి. యుద్ధం మరింత విస్తరించే అవకాశాలపై అంతర్జాతీయ సమాజం ఆందోళన వ్యక్తం చేస్తుండగా, శాంతి చర్చలు ఇప్పటికీ ముందుకు సాగకపోవడం పరిస్థితిని మరింత క్లిష్టంగా మారుస్తోంది.

# బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నకిరే కంటి మొగులయ్యకు సన్మానం



**రామన్నపేట వెలుతురు న్యూస్ జూలై 02:**

సుభాష్ సెంటర్ లో బిజెపి మండల అధ్యక్షుడు బండ మధుకర్ రెడ్డి ఆధ్వర్యంలో నకిరేకల్ కంటెస్టెడ్ ఎమ్మెల్యే అభ్యర్థి నకిరేకంటి మొగులయ్య కి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా నియమించిన సందర్భంగా రామన్నపేట మండలంలో సన్మాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. పార్టీ అడుగుజాడల్లో నడుస్తూ నిబద్ధత కలిగిన బిజెపి కార్యకర్తలకు ఎల్లప్పుడూ బిజెపి పార్టీ అవకాశాలు కల్పిస్తుంది. అని ఒక సామాన్య కార్యకర్త కూడా బిజెపి పార్టీలో రాష్ట్ర అధ్యక్షుడు జాతి అధ్యక్షులు ప్రధానమంత్రి స్థాయికి కూడా ఎదుగుచు అని అది ఒక బిజెపి పార్టీలోనే సాధ్యపడుతుంది. అని ఈ కార్యక్రమంలో హాజరైన రాష్ట్ర నాయకులు జిల్లా నాయకులు మండల నాయకులు ప్రతి ఒక్కరు హర్షం వ్యక్తం చేయడం జరిగింది. ఈ యొక్క కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ వనం అంజయ్య జిల్లా కార్యదర్శి తాటిపాముల శివకృష్ణ గౌడ్ మండల ఇన్చార్జి కొరివి శంకర్ మండల ప్రధాన కార్యదర్శిలు జంగిలి సత్యనారాయణ, బెజ్జంకి శివకుమార్ ఉపాధ్యక్షుడు బట్టే రమేష్ కార్యదర్శి బాత్క నరేష్ సీనియర్ నాయకులు జల్ల లక్ష్మీనారాయణ, రాజు, గజం సత్యం, గోపగోని ధర్మరాజు, ఆకిటి యాదయ్య, రాపోలు విశ్వనాథం, యాదయ్య, వెంకట్, వీరమల్ల సత్యనారాయణ, గండికోట శీను తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ యూనిఫామ్‌లతో దోపిడీ..

- సత్తుపల్లి డెకాయిట్ కేసు ఛేదించిన పోలీసులు
- 12 మంది నిందితుల అరెస్ట్.. ఇద్దరు పరారీలో
- ముఠాలో కానిస్టేబుల్, ఆర్ఎస్ఐ ఉన్నట్లు వెల్లడి
- వ్యాపారవేత్త నుంచి రూ.40 లక్షల దోపిడీ
- నగదు, వాహనాలు, యూనిఫామ్‌లు స్వాధీనం

**సత్తుపల్లి వెలుతురు జూలై 02:**

సత్తుపల్లిలో సంచలనం సృష్టించిన డెకాయిట్ కేసును పోలీసులు ఛేదించారు. ఈ కేసులో 12 మంది నిందితులను అరెస్ట్ చేయగా, మరో ఇద్దరు పరారీలో ఉన్నట్లు వెల్లడించారు. నిందితుల ముఠాలో ఓ పోలీస్ కానిస్టేబుల్, ఆర్ఎస్ఐ కూడా ఉన్నట్లు పోలీసులు తెలిపారు.పోలీస్ యూనిఫామ్‌లు ధరించి వ్యాపారవేత్తను బెదిరించి రూ.40 లక్షలు దోచుకున్నట్లు దర్యాప్తులో తేలిందని అధికారులు వెల్లడించారు. ఈ ఘటనపై ప్రత్యేక దృష్టి సారించిన పోలీసులు హైదరాబాద్ నుంచి ఖమ్మం వరకు విస్తృతంగా ఆపరేషన్ నిర్వహించి నిందితులను అదుపులోకి తీసుకున్నారు.నిందితుల వద్ద నుంచి రూ.17.60 లక్షల నగదు, రెండు ఇన్నోవా కార్లు, ఒక ఎర్టిగా కారు, ఒక టీవీఎస్ యాక్సెస్ స్కూటీని స్వాధీనం చేసుకున్నారు. అలాగే 16 సెల్‌ఫోన్లు, పోలీస్ యూనిఫామ్‌లు, హ్యాండ్‌కఫ్‌లు, నకిలీ రూ.500 నోట్ల కట్టలను కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.కల్లూరు ఏసీపీ ఆధ్వర్యంలోని ప్రత్యేక బృందం ఈ కేసును ఛేదించినట్లు పోలీసులు తెలిపారు. పరారీలో ఉన్న మరో ఇద్దరు నిందితుల కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని, కేసుకు సంబంధించిన ఇతర కోణాల్లో కూడా దర్యాప్తు కొనసాగుతోందని వెల్లడించారు.



# ఓటరు జాబితాలో ప్రతి అర్హుడి పేరు ఉండేలా చర్యలు

కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జహీరాబాద్ మున్సిపల్ చైర్మన్ మహమ్మద్ యూనుస్ అర్హులైన మహిళలకు 13 వ వార్డు కౌన్సిలర్ సయ్యద్ అతీకుర్ రహ్మాన్ హక్కానీ, కాంగ్రెస్ స్థానిక నాయకులతో కలిసి ఉచిత చీరలను పంపిణీ చేశారు.



- ఝరసంఘం–కోహీర్‌లో ప్రత్యేక ఓటర్ లిస్టు సవరణను

**పరిశీలించిన ఎమ్మెల్యే మాణిక్‌రావు**

**జహీరాబాద్ వెలుతురు జూలై 02:**

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గ పరిధిలో కొనసాగుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు గురువారం ఝరసంఘం మండల కేంద్రం, కోహీర్ పట్టణంలో పరిశీలించారు. ఇంటింటికి వెళ్లి బీఎల్ఓలు, బీఎల్ఏలు ఓటర్ల వివరాల నమోదు, మార్పులు, చేర్పులు, తొలగింపుల ప్రక్రియను ఎలా నిర్వహిస్తున్నారో స్వయంగా పరిశీలించి సంబంధిత అధికారులతో మాట్లాడారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రతి అర్హుడైన పౌరుడి పేరు ఓటరు జాబితాలో తప్పనిసరిగా నమోదయ్యేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఎవరూ తమ ఓటు హక్కును కోల్పోకుండా పారదర్శకంగా, ఎన్నికల కమిషన్ నిబంధనలకు అనుగుణంగా సవరణ ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏలు) ప్రతి ఇంటిని సందర్శించి ఓటర్లకు అవసరమైన సహాయం అందించాలని, ఓటరు జాబితాలో ఉన్న పొరపాట్లను వెంటనే గుర్తించి సరిదిద్దేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలు కూడా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ ఓటరు వివరాలను పరిశీలించి అవసరమైన సవరణలు చేయించుకోవాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో ఝరసంఘం మండల పార్టీ అధ్యక్షుడు వెంకటేశం, కోహీర్ మండల పార్టీ అధ్యక్షుడు నర్సింలు, మాజీ ఎంపీపీ సంగమేశ్వర్, సీనియర్ నాయకుడు కలీమ్, యువ నాయకుడు కొనింటి మిథున్ రాజ్‌తో పాటు పార్టీ నాయకులు, స్థానిక అధికారులు పాల్గొన్నారు.

# ఖర్గేను కలిసిన జహీరాబాద్ మైనార్టీ నాయకుడు

- నియోజకవర్గంలో వర్గపోరుపై ఆవేదన
- పార్టీ అంతర్గత విభేదాలతో కార్యకర్తలు నష్టపోతున్నారని మాడిగి సర్పంచ్ హర్షద్ జామ పటేల్ వినతి....



**జహీరాబాద్ వెలుతురు జూలై 02:**

కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేను సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గానికి చెందిన మైనార్టీ నాయకుడు, మాడిగి గ్రామ సర్పంచ్ హర్షద్ జామ పటేల్ బుధవారం బెంగుళూరులో మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా జహీరాబాద్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీలో నెలకొన్న వర్గపోరుపై ఖర్గే దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. అంతర్గత విభేదాల కారణంగా పార్టీకి, ముఖ్యంగా క్షేత్రస్థాయి కార్యకర్తలకు తీవ్ర నష్టం జరుగుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.పార్టీ బలోపేతానికి అందరూ సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని, ప్రస్తుతం వర్గ విభేదాల వల్ల కార్యకర్తల్లో నిరుత్సాహం నెలకొంటోందని హర్షద్ జామ పటేల్ పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నాలు కూడా అంతర్గత విభేదాల కారణంగా ప్రభావితమవుతున్నాయని వివరించారు.జహీరాబాద్ నియోజకవర్గంలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని, నాయకుల మధ్య సమన్వయం పెంపొందించి వర్గపోరుకు ముగింపు పలకాలని మల్లికార్జున్ ఖర్గేను ఆయన కోరినట్లు తెలిపారు.

# సేవే శాశ్వత సంపద... సమాజ సేవతోనే ప్రజల గుండెల్లో సుస్థానం





- జహీరాబాద్ అసెంబ్లీ కోఆర్డినేటర్మొహమ్మద్ గౌస్...
- కాంగ్రెస్ నాయకుడు పవార్ శ్రీనివాస్ నాయక్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహణ...

**జహీరాబాద్ వెలుతురు జూలై 02:**

సమాజానికి చేసే సేవే మనిషికి శాశ్వత గుర్తింపును, ప్రజల గుండెల్లో చిరస్థాయి స్థానాన్ని కల్పిస్తుందని జహీరాబాద్ అసెంబ్లీ కోఆర్డినేటర్ మొహమ్మద్ గౌస్ అన్నారు. ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు, కాంగ్రెస్ నాయకుడు పవార్ శ్రీనివాస్ నాయక్ జన్మదిన వేడుకలు బుధవారం రాత్రి జహీరాబాద్ పట్టణంలోని చిన్న హైదరాబాద్ వార్డులోని ఆయన స్వగృహంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా మొహమ్మద్ గౌస్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నరేష్ గౌడ్‌తో కలిసి శ్రీనివాస్ నాయక్‌కు బొకే అందజేసి, శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కేక్ కట్ చేయించి వేడుకలను ఆనందోత్సాహాల మధ్య నిర్వహించారు.ఈ సందర్భంగా మొహమ్మద్ గౌస్ మాట్లాడుతూ, ప్రజల కోసం నిస్వార్థంగా పనిచేసే నాయకులకు సమాజంలో ఎల్లప్పుడూ గౌరవం ఉంటుందని అన్నారు. సేవా కార్యక్రమాలే నాయకుడి వ్యక్తిత్వానికి నిజమైన గుర్తింపుగా నిలుస్తాయని పేర్కొన్నారువార్ శ్రీనివాస్ నాయక్ మాట్లాడుతూ, తన ఆదాయంలో కొంత భాగాన్ని నిరుపేదలు, ఆపదలో ఉన్న కుటుంబాల సంక్షేమానికి వెచ్చిస్తూ సమాజ సేవను మరింత విస్తృతంగా కొనసాగిస్తానని తెలిపారు. జన్మదిన సందర్భంగా శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.కార్యక్రమంలో మాజీ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కండెం నర్సింలు, జిల్లా యువజన ప్రధాన కార్యదర్శి రవీందర్ చవాన్, 11వ వార్డు ఇన్‌చార్జి మొహమ్మద్ నవీద్, ధర్మ నాయక్, నరేష్ నాని, మొహమ్మద్ నజీర్ అహ్మద్‌తో పాటు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీనివాస్ నాయక్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# మూడు గంటల పాటు జహీరాబాద్ మున్సిపల్ కార్యాలయం ముట్టడి

- హోతీ డబుల్ బెడ్‌రూం కాలనీలో నీరు–వీధిదీపాల కోసం మహిళల బిందెల నిరసన...
- రెండు రోజుల్లో సమస్యలు పరిష్కరిస్తామని చైర్మన్ యూనుస్ హామీ...
- అమలు కాకుంటే మళ్లీ ఆందోళన....
- సీపీఎం జహీరాబాద్ ఏరియా కమిటీ సభ్యుడు ఎస్. మహిపాల్....





**జహీరాబాద్ వెలుతురు 02:**

జహీరాబాద్ మున్సిపల్ పరిధిలోని హోతీ(కె) డబుల్ బెడ్‌రూం కాలనీలో నెలకొన్న తాగునీటి, వీధిదీపాల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో కాలనీవాసులు గురువారం మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడించారు. మహిళలు ఖాళీ బిందెలతో పెద్ద ఎత్తున పాల్గొని మూడు గంటల పాటు కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా సీపీఎం జహీరాబాద్ ఏరియా కమిటీ సభ్యుడు ఎస్. మహిపాల్ మాట్లాడుతూ, కాలనీలో నెలలుగా తాగునీటి సమస్య తీవ్రంగా ఉన్నప్పటికీ అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. పలుమార్లు వినతిపత్రాలు ఇచ్చినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని, దీంతో ప్రజల తరఫున ఆందోళన చేపట్టాల్సి వచ్చిందన్నారు.వీధిదీపాలు లేక రాత్రి వేళల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఇప్పటికే ఇద్దరు పాముకాటుకు గురయ్యారని తెలిపారు. నీటి సంపులో నీళ్లు తీసుకునేందుకు వెళ్లిన ఓ మహిళ ప్రమాదవశాత్తు సంపులో పడిపోయిందని పేర్కొన్నారు. బోర్ మోటార్ పనిచేయకపోవడం, మంజీరా నీరు కూడా అందకపోవడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలు వెంటనే పరిష్కరించకపోతే మరింత ఉధృతంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.ఆందోళన విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్మన్ మహమ్మద్ యూనుస్ నిరసన స్థలానికి చేరుకుని ఆందోళనకారులతో చర్చించారు. రేపటి సాయంత్రంలోగా బోర్ మోటార్ ఏర్పాటు చేసి తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని, ఎల్లుండి సాయంత్రంలోగా వీధిదీపాలను ఏర్పాటు చేయడంతో పాటు ఇతర సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని స్పష్టమైన హామీ ఇచ్చారు. చైర్మన్ హామీతో సీపీఎం నాయకులు, కాలనీవాసులు ఆందోళనను విరమించారు.అయితే, ఇచ్చిన హామీలు గడువులోగా అమలు కాకపోతే మళ్లీ మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడించి మరింత తీవ్ర స్థాయిలో ఆందోళన చేపడతామని సీపీఎం నాయకులు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు సలీముద్దీన్, తిరుపతి, నరేష్, బక్కన్నతో పాటు డబుల్ బెడ్‌రూం కాలనీవాసులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# డాక్టర్ కోసం గంటల నిరీక్షణ... ఖాళీ కుర్చీకే వినతిపత్రం అందజేసిన బీజేపీ

- జహీరాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు, మందులు, మౌలిక వసతుల కొరతపై ఆగ్రహం....
- సమస్యలు పరిష్కరించకుంటే భారీ ఆందోళనకై బీజేపీ పట్టణ అధ్యక్షుడు పూల సంతోష్ హెచ్చరిక...





**జహీరాబాద్ వెలుతురు జూలై 02:**

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలపై భారతీయ జనతా పార్టీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో గురువారం వినూత్న నిరసన చేపట్టారు. ఆసుపత్రి ఇన్‌చార్జ్ డాక్టర్ కిరణ్‌ను కలిసి వినతిపత్రం అందజేయడానికి వచ్చిన బీజేపీ నాయకులు ఆయన అందుబాటులో లేకపోవడంతో నిరసనగా ఖాళీ కుర్చీకే వినతిపత్రం సమర్పించారు. అధికారుల నిర్లక్ష్యానికి ఇదే నిదర్శనమని ఆరోపిస్తూ ప్రభుత్వ తీరుపై తీవ్ర విమర్శలు గుప్పించారు.ఈ సందర్భంగా బీజేపీ పట్టణ శాఖ అధ్యక్షుడు పూల సంతోష్ మాట్లాడుతూ, ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు కనీస స్థాయిలో కూడా వైద్య సేవలు అందడం లేదని ఆరోపించారు. వైద్యులు, సిబ్బంది కొరత తీవ్రంగా ఉండటంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారని, అవసరమైన మందులు అందుబాటులో లేకపోవడంతో పేద ప్రజలు బయట కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు.ఆసుపత్రిలో పారిశుద్ధ్య నిర్వహణ అధ్వాన్నంగా ఉందని, తాగునీరు, మరుగుదొడ్లు వంటి కనీస మౌలిక సదుపాయాలు కూడా సక్రమంగా లేక రోగులు, వారి సహాయకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. ప్రజల ఆరోగ్యంతో నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఏమాత్రం సమంజసం కాదని, ప్రభుత్వం వెంటనే స్పందించి అన్ని సమస్యలను పరిష్కరించి నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వం, సంబంధిత అధికారులు తక్షణ చర్యలు తీసుకోకపోతే భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.ఈ నిరసన కార్యక్రమంలో బీజేపీ నాయకులు సుధీర్ బండారి, కృష్ణారెడ్డి, కౌన్సిలర్లు బొగ్గుల సంతోష్, అప్పం శ్రావణ్, అరుణ్ కుమార్, విశ్వనాథ్ యాదవ్, సోమ అనిల్, పాలింకర్ సంతోష్, నరేష్ పాటిల్, బండి వెంకట్, రాయిపల్లి సునీల్, సురేష్, పూరి శివ, పూజ, శ్రీకాంత్, మహేష్ ముదిరాజ్, మంజునాథ్, చందు, అబ్బర్, దిల్దర్, రాజ్‌కుమార్, చరణ్, డీకే సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# తోకముడిచిన కాంగ్రెస్ మంత్రులు తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలి

- హరీష్ రావు అరెస్టు ప్రజాస్వామ్య విరుద్ధమని విమర్శ....
- ముగ్గురు మంత్రులు రాజీనామా చేయాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు బండి మోహన్డిమాండ్...

**జహీరాబాద్ వెలుతురు జూలై 02:**

బహిరంగ చర్చకు వస్తామని ప్రకటించి చివరి క్షణంలో వెనక్కి తగ్గిన కాంగ్రెస్ మంత్రులు తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు బండి మోహన్ డిమాండ్ చేశారు.గురువారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం రెండున్నర ఏళ్లలోనే అవినీతిలో కూరుకుపోయిందని ఆరోపించారు. ప్రభుత్వ పనితీరుపై బహిరంగ చర్చకు సిద్ధమని ప్రకటించిన మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ నిర్ణయించిన వేదికకు రాకపోవడం ప్రజలను తప్పుదోవ పట్టించడమేనని విమర్శించారు.చర్చకు బయలుదేరిన మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావును పోలీసులు అడ్డుకోవడం, అరెస్టు చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. ఒక మాజీ మంత్రికి ఇవ్వాల్సిన గౌరవం కూడా



ఇవ్వకుండా వ్యవహరించడం దురదృష్టకరమని పేర్కొన్నారు.మంత్రి జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ తెలంగాణ ప్రజలకు బేషరతుగా క్షమాపణ చెప్పి తమ మంత్రి పదవులకు రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. మాజీ మంత్రి హరీష్ రావుకు క్షమాపణ చెప్పాలని కూడా కోరారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్వీ జహీరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి రాకేష్ మాట్లాడుతూ, హరీష్ రావుపై జరిగిన చర్యలను రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. హరీష్ రావుపై ఇలాంటి చర్యలు కొనసాగితే రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

# 13వ వార్డులో అర్హులైన మహిళలకు ఉచిత చీరల పంపిణీ

- మహిళల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట....
- మున్సిపల్ చైర్మన్ మహమ్మద్ యూనుస్....

**జహీరాబాద్ వెలుతురు జూలై 02:**

రాష్ట్ర ప్రభుత్వం మహిళల సంక్షేమం కోసం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాల్లో భాగంగా సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మున్సిపల్ పరిధిలోని

13వ వార్డు గడి ప్రాంతంలో అర్హులైన మహిళలకు ఉచిత చీరల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్ర



మానికి ముఖ్య అతిథిగా హాజరైన జహీరాబాద్ మున్సిపల్ చైర్మన్ మహమ్మద్ యూనుస్ అర్హులైన మహిళలకు 13 వ వార్డు కౌన్సిలర్ సయ్యద్ అతీకుర్ రహ్మాన్ హక్కానీ, కాంగ్రెస్ స్థానిక నాయకులతో కలిసి ఉచిత చీరలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, మహిళల ఆర్థిక, సామాజిక సాధికారతకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. మహిళల అభ్యున్నతి కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలను ప్రతి అర్హురాలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.మహిళల సంక్షేమం, కుటుంబాల అభివృద్ధి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్న ఆయన, సంక్షేమ పథకాల అమలులో ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని చెప్పారు.ఈ కార్యక్రమంలో నాగిరెడ్డి, మహమ్మద్ అతర్, స్థానిక నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# శ్రీ జగన్నాథ రథయాత్ర పోస్టర్‌ను ఆవిష్కరించిన నగర మేయర్ కొలగాని శ్రీనివాస్

**కరీంనగర్ వెలుతురు జూలై 02:**

కరీంనగర్ నగరంలో ఈ నెల 16వ తేదీ, గురువారం నిర్వహించనున్న శ్రీ జగన్నాథ రథయాత్రకు సంబంధించిన పోస్టర్‌ను నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ ఆవిష్కరించారు. అనంతరం మేయర్ గారు మాట్లాడుతూ, కరీంనగర్ ఇస్కాన్ (ISKCON) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ జగన్నాథ రథయాత్ర నగరంలో ఆధ్యాత్మిక వాతావరణాన్ని మరింత పెంపొందించే మహత్తర కార్యక్రమమని పేర్కొన్నారు.జులై 16వ తేదీ మధ్యాహ్నం 1 గంటలకు మహాశక్తి టెంపుల్ వద్ద ప్రారంభమయ్యే ఈ పవిత్ర రథయాత్ర వైశ్య భవన్ వరకు ఘనంగా కొనసాగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, భజనలు, కీర్తనలు తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.ప్రతి సంవత్సరం వేలాది మంది భక్తులు పాల్గొనే ఈ రథయాత్రలో ఈ ఏడాది కూడా కరీంనగర్ నగరంలోని 66 డివిజన్ల ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని మేయర్ పిలుపునిచ్చారు. నగర ప్రజలందరూ సకుటుంబ సమేతంగా విచ్చేసి శ్రీ జగన్నాథ స్వామివారి రథాన్ని లాగి వారి దివ్య ఆశీర్వాదాలను పొందాలని కోరారు.ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ గారు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో డాక్టర్ నరహరి ప్రభు జీ , ఆఫ్షన్ సభ్యులు కన్న కృష్ణ, ఎల్ రాజభాస్కర్ రెడ్డి, డాక్టర్ బుర్ర మధుసూదన్



రెడ్డి, మ్మల రమేష్ రెడ్డి, కొమురవెల్లి వెంకటేశం గార్లు పాల్గొన్నారు

# ఐక్యతతోనే బహుజనులకు రాజ్యాధికారం

- ప్రజా ప్రభుత్వంలో మాలలకే సీట్లు, పదవులు
- ప్రతి నియోజకవర్గంలో 50 వేల మాదిగ ఓటర్లు
- మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు
- బీసీల సహకారంతో మాదిగలు రాజ్యాధికారం
- మాదిగల మహాశక్తి జండా ఎగరాలని పిలుపు




**హైదరాబాద్ వెలుతురు జులై 2:**

ఐక్యతతోనే బహుజనులకు రాజ్యాధికారం దక్కుతుందని మాజీ మంత్రి మోత్కుపల్లి నరసింహులు అన్నారు. మాదిగమహాశక్తి కార్యాలయంలో మాదిగల ఓట్లు మాదిగలకే అనే నినాదంతో మాదిగ మహాశక్తి నేత డా "సగరపు ప్రసాద్ రావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. స్వాతంత్ర్యం వచ్చి ఏడు దశాబ్దాలు గడుస్తున్నా కానీ మాదిగల బతుకులు మారడం లేదని రాష్ట్రంలో 70 లక్షల మంది మాదిగలు ఉంటే అగ్రకులాలైన రెడ్లు, కమ్మలు వెలమలు, అధికారాన్ని చలాయిస్తూ మాదిగలను, బహుజన కులాలను పావులుగా, ఓట్లు వేసే యంత్రాలుగా వాడుకుంటు న్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మాదిగల ఓట్లు మాదిగలకే వేసుకుంటే మన సత్తా ఏందో తెలుస్తదని ఓటుకి ఎంత బలం ఉందో అగ్రకులాల కు వణుకు పుడుతుందని అన్నారు. రాష్ట్రంలో ప్రతి నియోజకవర్గంలో 50 వేలకు మంది పైగా మాదిగలు ఉన్నారని మన ఓట్లు మనమే వేసుకుంటే బీసీల సహకారంతో మాదిగలు రాజ్యాధికారాన్ని ఏర్పాటు చేయవచ్చని అన్నారు. మాదిగల మహాశక్తి జండా ఎగరాలని రిజర్వేషన్లు ఉన్న ఫలాలు అందటంలో పాలకులు నిర్లక్ష్య వైఖరిని ప్రదర్శిస్తున్నారని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో మాల కుటుంబాలకే, సీట్లు మంత్రి పదవులు దక్కాయని ఆక్షేపించారు. ఈ కార్యక్రమంలో నాయకులు , ప్రొఫెసర్ కనకయ్య, ముంజగాళ్ల విజయ్ కుమార్ తదితరులు తదితరులు పాల్గొన్నారు

# స్పీడ్‌పోస్ట్‌తో గంజాయి స్మగ్లింగ్.. దేశవ్యాప్త ముఠా గుట్టురట్టు

- మెడిసిన్ పార్శిళ్ల పేరుతో 21 రాష్ట్రాలకు గంజాయి సరఫరా
- జార్ఖండ్ కేంద్రంగా నడుస్తున్న ముఠా సూత్రధారి అరెస్టు
- వాట్సాప్‌లో ఆర్డర్లు.. యూపీఐతో చెల్లింపులు
- ఏడాదికి రూ.5 కోట్ల వరకు అక్రమార్జన గుర్తింపు

**హైదరాబాద్ వెలుతురు జూలై 02:**

స్పీడ్‌పోస్ట్ ద్వారా దేశవ్యాప్తంగా గంజాయిని సరఫరా చేస్తున్న భారీ డ్రగ్స్ నెట్‌వర్క్‌ను హైదరాబాద్ నార్కోటిక్స్




ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ (హెచ్-న్యూ) ఛేదించింది. ఈ కేసులో జార్ఖండ్ కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న ముఠా ప్రధాన సూత్రధారి సత్యం మిశ్రాను పోలీసులు అరెస్టు చేశారు.పోలీసుల దర్యాప్తులో ముఠా అనుసరిస్తున్న పద్ధతి వెలుగులోకి వచ్చింది. జార్ఖండ్‌లో గంజాయిని సేకరించి, సామాజిక మాధ్యమాలు, వాట్సాప్ ద్వారా వినియోగదారుల నుంచి ఆర్డర్లు స్వీకరించేవారు. అనంతరం యూపీఐ ద్వారా నగదు వసూలు చేసి, గంజాయిని మెడిసిన్ పార్శిళ్లుగా ప్యాక్ చేసి స్పీడ్‌పోస్ట్ ద్వారా నేరుగా కస్టమర్ల ఇళ్లకు పంపించేవారని అధికారులు గుర్తించారు.ఈ ముఠా హైదరాబాద్, ముంబై, ఢిల్లీ, చెన్నై, బెంగళూరు సహా దేశంలోని 21 రాష్ట్రాలకు గంజాయిని సరఫరా చేస్తున్నట్లు విచారణలో తేలింది. రోజుకు 80 నుంచి 100 ఆర్డర్లను ప్రాసెస్ చేస్తూ, ఏడాదికి రూ.4 నుంచి రూ.5 కోట్ల వరకు అక్రమ ఆదాయం ఆర్జిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో ప్రజలు భాగస్వాములు కావాలని పోలీసులు పిలుపునిచ్చారు. డ్రగ్స్ రవాణా లేదా విక్రయాలకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే డయల్-100 లేదా హెచ్-న్యూ హెల్ప్‌లైన్ 8712661601కు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

# బీసీలు భ్రమలో లేరు, కేంద్రం మోసం చాలు

- డా అవ్వారు వేణు కుమార్ 42% బీసీ రిజర్వేషన్ పోరాట కమిటీ
- రేవంత్ రెడ్డి బిజెపి పై బంధు పిలుపు ఇవ్వాలి

**హైదరాబాద్ వెలుతురు జూలై 02:**

తెలంగాణ అసెంబ్లీ ఏకగ్రీవంగా పంపిన 42% బీసీ రిజర్వేషన్ బిల్లులు సంవత్సర పైగా బుట్టదాఖలు చేసిన కేంద్ర బీజేపీ ప్రభుత్వం తెలంగాణ బీసీలను మోసం చేస్తోందని 42% బీసీ రిజర్వేషన్ పోరాట కమిటీ కో-ఆర్డినేటర్ డాక్టర్ అవ్వారు వేణు కుమార్ ధ్వజమెత్తారు. దేశంలో 52% ఓబీసీ లకు కేంద్రంలో 27% మాత్రమే ఇస్తూ, తమిళనాడు 69%ని 9వ షెడ్యూల్‌లో కాపాడి, తెలంగాణ 42% బిల్లును మాత్రం అడ్డుకోవడం బీజేపీ బీసీ వ్యతిరేక వైఖరికి నిదర్శనమన్నారు."ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే బీజేపీ పై రాష్ట్రవ్యాప్త బంద్ కు పిలుపునివ్వాలి. బీసీల ఓట్లతో గెలిచిన కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ బిల్లు కోసం రోడ్డెక్కాలి. అసెంబ్లీ తీర్మానం పంపి చేతులు దులుపుకుంటే సరిపోదు. కేంద్రాన్ని నిలదీసే దమ్ము చూపాలి" అని డిమాండ్ చేశారు.బిల్లుకు వెంటనే ఆమోదం తెలిపి 9వ షెడ్యూల్‌లో చేర్చకపోతే 52% బీసీలు "ఛలో ఢిల్లీ"తో పార్లమెంట్ ముట్టడిస్తామని హెచ్చరించారు.



# బోనాల పండుగకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలి: జోనల్ కమిషనర్‌కు బిజెపి నాయకుల వినతి



**రాజేంద్రనగర్ వెలుతురు జూలై 02:**

రాజేంద్రనగర్ డివిజన్ పరిధిలో ఉప్పర్ పల్లి, హైదర్గూడా, అత్తాపూర్.

త్వరలో ప్రారంభం కానున్న పవిత్ర ఆషాఢ మాస తెలంగాణ బోనాల పండుగను పురస్కరించుకుని, వివిధ పోచమ్మ దేవాలయాల అభివృద్ధికి ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని భారతీయ జనతా పార్టీ (బీజేపీ) నాయకులు డిమాండ్ చేశారు.

గురువారం రోజున రాజేంద్రనగర్ సర్కిల్ జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి గారిని కలిసి వినతి పత్రం సమర్పించడం జరిగింది. వీలైనంత త్వరగా దేవాలయాల వద్ద మౌలిక వసతులు కల్పించాలని కోరారు.

**ప్రధాన డిమాండ్లు:**

ఆలయాల పరిసరాల్లో వెంటనే సిసి రోడ్ల (CC Roads) మరమ్మతులు చేపట్టాలి

డ్రైనేజ్ వ్యవస్థను సక్రమంగా నిర్వహించాలి

భక్తుల కోసం తాగునీటి సరఫరా వ్యవస్థను ఏర్పాటు చేయాలి తెలంగాణ సంస్కృతికి ప్రతీక అయిన బోనాల పండుగను భక్తులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా జరుపుకునేలా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా నాయకులు కోరారు. వినతి పత్రం సమర్పించిన వారిలో వై. శ్రీధర్, బొక్క బాల్ రెడ్డి, సందీప్, పవన్, రాజశేఖర్ రెడ్డి, సదానందం, వేణు, చిన్న, కిరణ్, రవి మరియు ఇతర బిజెపి కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

# తృణమూల్‌లో ముదిరిన సంక్షోభం

- మమత, రితబ్రతలకు కేంద్ర ఎన్నికల సంఘం నోటీసులు

**న్యూఢిల్లీ, వెలుతురు జూలై 02:**

పశ్చిమ బెంగాల్ అధికార పక్షమైన ఆల్ ఇండియా తృణమూల్ కాంగ్రెస్ లో అంతర్గత అధికార పోరు చిలికి చిలికి గాలివానగా మారింది. పార్టీ నాయకత్వం, సంస్థాగత నిర్మాణం మరియు అధికారిక సంతకందారులపై ఇరు వర్గాల మధ్య తలెత్తిన తీవ్ర వివాదంలో భారత ఎన్నికల సంఘం అధికారికంగా జోక్యం చేసుకుంది. పార్టీపై హక్కుల విషయమై వస్తున్న పరస్పర విరుద్ధ క్లెయిములపై సమగ్ర వివరణ ఇవ్వాలంటూ పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీతో పాటు తిరుగుబాటు వర్గ నేత రితబ్రత బెనర్జీకి ఈసీ నోటీసులు జారీ చేసింది. రాబోయే సోమవారం (జూలై 6) సాయంత్రం 5:30గంటల లోపు తమ లిఖితపూర్వక సమాధానాలను సమర్పించాలని కేంద్ర ఎన్నికల సంఘం ఉభయ పక్షాలను ఆదేశించింది.

ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల ఓటమి అనంతరం తృణమూల్ కాంగ్రెస్‌లో అసమ్మతి జ్వాలలు ఒక్కసారిగా భగ్గుమన్నాయి. పార్టీకి చెందిన మొత్తం 80 మంది ఎమ్మెల్యేలలో ఏకంగా 58 మంది ఎమ్మెల్యేలు మమతా బెనర్జీ నాయకత్వంపై తిరుగుబాటు జెండా ఎగురవేసి విడిపోయారు. ఈ రెబెల్ శాసనసభ్యులంతా రితబ్రత బెనర్జీకి మద్దతు ప్రకటించడమే కాకుండా, ఆయనను పశ్చిమ బెంగాల్ అసెంబ్లీలో ప్రతిపక్ష నేతగా ఎన్నుకున్నారు. అంతటితో ఆగకుండా తామే అసలైన తృణమూల్ కాంగ్రెస్ అని ప్రకటించుకుంటూ.. 30 మంది సభ్యులతో కూడిన సరికొత్త 'జాతీయ కార్యవర్గ కమిటీ'ని కూడా ఏర్పాటు చేయడంతో పార్టీలో సంక్షోభం పతాక స్థాయికి చేరింది.

పార్టీ గుర్తులు, పరిపాలనా అధికారాలు తమకే చెందుతాయని వాదిస్తున్న రితబ్రత బెనర్జీ నేతృత్వంలోని 10 మంది సభ్యుల ప్రతినిధి బృందం నిన్న కేంద్ర ఎన్నికల సంఘం పూర్తి బెంచ్‌తో భేటీ అయింది. ఈ సమావేశం అనంతరం రితబ్రత బెనర్జీ మాట్లాడుతూ, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ మరియు ఇతర కమిషనర్లు తమ వాదనలను ఎంతో ఓపికగా విన్నారని, అందుకు వారికి కృతజ్ఞతలు తెలుపుతున్నామని పేర్కొన్నారు. జూన్ 22న జరిగిన పార్టీ ప్రత్యేక సమావేశం వివరాలను, దానికి సంబంధించిన కీలక పత్రాలను ఇప్పటికే ఈసీకి సమర్పించామని, త్వరలోనే దీనిపై ఈసీ నుండి సానుకూల నిర్ణయం వస్తుందని ఆశిస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

మరోవైపు, పార్టీ నుండి బహిష్కరణకు గురైన వ్యక్తి నేతృత్వంలోని వర్గంతో ఎన్నికల సంఘం సమావేశం కావడంపై మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. గతంలోనే పార్టీ నుండి బహిష్కృతుడైన రితబ్రత బెనర్జీకి అసలు తృణమూల్ తరఫున మాట్లాడే నైతిక హక్కు ఎక్కడిదని ప్రఖ్యాత టీఎంసీ ఎంపీ సౌగతా రాయ్ ప్రశ్నించారు. అసలు ఎలాంటి క్రెడిబిలిటీ లేని ఇటువంటి వ్యక్తులకు ఎన్నికల సంఘం ప్రత్యేకంగా అపాయింట్‌మెంట్ ఇచ్చి చర్చలు జరపడమే ఒక పెద్ద విచిత్రం అని ఆయన మండిపడ్డారు.

మరొక ఎంపీ సాగరిక ఘోష్ సైతం ఈ తిరుగుబాటును తీవ్రంగా కొట్టిపారేశారు. ఇది అస్సలు పార్టీలోని గ్రూపు కాదని, ఎవరో కొందరు వ్యక్తులు ఎక్కడి నుంచో వచ్చి గుమిగూడారని ఆమె వ్యాఖ్యానించారు. ఈసీ నిబంధనల ప్రకారం కేవలం గుర్తింపు పొందిన అధికారిక ప్రతినిధులు లేదా సంతకందారులకు మాత్రమే కమిషన్‌ను కలిసి లేఖలు రాసే చట్టపరమైన అర్హత ఉంటుందని, స్వయంప్రకటిత నేతలకు ఇక్కడ స్థానం లేదని ఆమె స్పష్టం చేశారు. ఏదేమైనా, సోమవారం సాయంత్రం ఇరు వర్గాలు ఇచ్చే వివరణలపైనే తృణమూల్ కాంగ్రెస్ భవిష్యత్తు, 'జోడు పువ్వుల' గుర్తు ఎవరికి దక్కుతుందనేది ఆధారపడి ఉండటంతో దేశ రాజకీయాల్లో ఈ పరిణామం ఉత్కంఠ రేపుతోంది.

# పెండింగ్ లో ఉన్న ఫీజు బకాయిలు విడుదల చేయాలని చేపట్టిన కాలేజీల బంద్ విజయవంతం

- రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా విద్యార్థులకు రావలసిన ఫీజు బకాయిలు ఇవ్వాలి
- బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్

**హైదరాబాద్ వెలుతురు జూలై 02:**




పెండింగ్లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలన్నింటినీ విడుదల చేయాలని కోరుతూ బీసీ జేఏసీ ఇచ్చిన పిలుపు మేరకు విద్యా సంస్థల బంద్ లో భాగంగా NEIL GOGTE INSTITUTE OF TECHNOLOGY బంద్ చేస్తున్న బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారంలోకి రాకముందు బడుగు బలహీన వర్గాల ప్రజలకు న్యాయం చేస్తానికే కాంగ్రెస్ పార్టీ ఉందని నమ్మించి ఈరోజు అధికారంలోకి వచ్చాక పేద పిల్లలు చదువుకుంటానికి పైసలు ఇస్తానికి ఆయనకు మనసు రావడంలేదని అన్నారు. కాలేజీ యాజమాన్యాలు పూర్తి ఫీజు కడితేనే విద్యార్థులకు ఒరిజినల్ సర్టిఫికెట్స్ ఇస్తామని చెబుతున్నాయని చేతకాని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే గద్దె దిగాలని ఆయన డిమాండ్ చేశారు. బడుగు బలహీన వర్గాల విద్యార్థులు చదువుకోవడం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఇష్టం లేదన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

**జనగామ, వెలుతురు జూలై 02:**

చిల్పూర్ మండలంలోని ప్రభుత్వ పాఠశాలల సమస్యలను పరిష్కరించి ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం చిల్పూర్ మండల కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఎంఈవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ఎంఈవో డి. గోవర్ధన్కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు రాపర్తి రాజు మాట్లాడుతూ మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు శిథిలావస్థలో ఉన్న భవనాలు, ఉపాధ్యాయుల కొరత, తరగతి గదులు, తాగునీరు, మరుగుదొడ్లు, ప్రహరీ గోడలు, కంప్యూటర్లు, బెంచీలు వంటి మౌలిక సదుపాయాల లేమితో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు.ముఖ్యంగా చిన్నపెండ్యాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు నూతన భవనం నిర్మించి, ప్రమాదకరమైన గోడలను తొలగించాలని, రాజవరం కేజీబీవీ, మల్కాపూర్ హైస్కూల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు.విద్యార్థులకు యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, విద్యార్థి కిట్లు వెంటనే అందించాలని కోరారు.ప్రైవేట్ పాఠశాలలు నిబంధనలకు విరుద్ధంగా అధిక ఫీజులు వసూలు చేస్తూ తల్లిదండ్రులను ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేస్తున్నాయని, ప్రభుత్వం వెంటనే ఫీజుల నియంత్రణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వ పాఠశాలల సమస్యలపై వారం రోజుల పాటు నిర్వహించిన సర్వే నివేదికను అధికారులకు అందజేశామని, సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# రవీంద్రనగర్ బస్తీ దవఖానను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారి డా. పుట్ల శ్రీనివాస్



**హైదరాబాద్ వెలుతురు జూలై 02:**

జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారి డా. పుట్ల శ్రీనివాస్ గురువారం రోజున రవీంద్రనగర్ బస్తీ దవఖానను ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా DM&HO హాజరు రిజిస్టర్, రోగులకు అందుతున్న వైద్య సేవలు, ఔషధాల లభ్యత, లాబొరేటరీ కేంద్రాన్ని, వివిధ రికార్డులు మరియు పరిశుభ్రత పరిస్థితులను పరిశీలించారు. అనంతరం గర్భిణీల స్త్రీల సంరక్షణ, శిశు టీకాలు, అంటువ్యాధుల నివారణ, సీజనల్ వ్యాధులు, మలేరియా, డెంగీ, చికున్‌గునియా వ్యాధుల నియంత్రణ పైన ప్రజలకు అవగాహన కల్పించాలని, అలాగే ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించి, ప్రభుత్వ ఆరోగ్య పథకాల ప్రయోజనాలు ప్రతి అర్హుడికి చేరేలా కృషి చేయాలని ఆదేశించారు.ఈ కార్యక్రమములో డాక్టర్ పి. శ్రీధర్, డిఐఓ & ఎస్ పి హెచ్ ఓ మరియు వైద్యాధికారి సిబ్బంది హాజరైనారు.

# మల్కోటి పార్క్‌లో మౌలిక సదుపాయాల హెచ్‌ఎండీఏ అధికారితో కలిసి పార్కును పరిశీలించిన మహాలక్ష్మి రామన్ గౌడ్

- త్వరలో అభివృద్ధి పనులు పూర్తి చేస్తామని అధికారుల హామీ
- స్థానికులు, వాకర్స్‌తో కలిసి పార్కు సమస్యలపై చర్చ

**హైదరాబాద్ వెలుతురు జూలై 02:**

హిమాయత్‌నగర్ డివిజన్‌లోని విఠల్‌వాడలో ఉన్న మల్కోటి పార్క్‌లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని స్థానికులు మాజీ కార్పొరేటర్ రామన్ గౌడ్ ను కోరారు. ఈ నేపథ్యంలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన హెచ్‌ఎండీఏ అధికారి రోహిత్వికతో కలిసి మహాలక్ష్మి రామన్ గౌడ్ పార్కును సందర్శించారు.ఈ సందర్భంగా పార్క్‌లో లైటింగ్, వాకింగ్ ట్రాక్‌తో పాటు ఇతర మౌలిక సదుపాయాలకు సంబంధించిన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. సమస్యలను పరిశీలించిన హెచ్‌ఎండీఏ అధికారి, అవసరమైన అభివృద్ధి పనులను త్వరలో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జి. రామన్ గౌడ్, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు భరద్వాజ్, వినోద్, మహేష్, జైస్వాల్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



# స్పీడ్ పోస్ట్ ద్వారా దేశవ్యాప్తంగా గంజాయి సరఫరా చేస్తున్న ముఠా గుట్టురట్టు

- హైదరాబాద్ హెచ్-న్యూ ఆపరేషన్‌లో కీలక నిందితుడి అరెస్ట్



**హైదరాబాద్, వెలుతురు జూలై 02:**

స్పీడ్ పోస్ట్, కొరియర్ సేవలను వినియోగించి దేశవ్యాప్తంగా గంజాయిని సరఫరా చేస్తున్న అంతర్రాష్ట్ర మాదకద్రవ్యాల ముఠాను హైదరాబాద్ నార్కోటిక్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ ఛేదించింది. ఈ కేసులో జార్ఖండ్‌కు చెందిన కీలక నిందితుడు సత్యం మిశ్రాను అరెస్టు చేయగా, మరో నలుగురు నిందితులు పరారీలో ఉన్నారు.పోలీసుల వివరాల ప్రకారం జార్ఖండ్‌లో గంజాయిని సాగు చేసి, అక్కడి నుంచి హైదరాబాద్, ముంబై, చెన్నై, ఢిల్లీ, బెంగళూరు సహా దేశంలోని దాదాపు 21 రాష్ట్రాలకు స్పీడ్ పోస్ట్ ద్వారా గంజాయి పార్శిళ్లు పంపించేవారు. పోస్టాఫీసులో పార్శిళ్లలో మందులు ఉన్నాయని తప్పుడు సమాచారం ఇచ్చి బుకింగ్ చేసేవారని దర్యాప్తులో తేలింది. వాట్సాప్, సోషల్ మీడియా ద్వారా ఆర్డర్లు స్వీకరించి, యూపీఐ ద్వారా నగదు తీసుకుని రోజుకు 80 నుంచి 100 ఆర్డర్లు నిర్వహించేవారని పోలీసులు వెల్లడించారు. రోజుకు సుమారు రూ. లక్ష, నెలకు రూ.30–35 లక్షలు, ఏడాదికి రూ.4–5 కోట్ల వరకు అక్రమ ఆదాయం ఆర్జించినట్లు గుర్తించారు.హైదరాబాద్‌కు పంపిన గంజాయి పార్శిల్‌ను హెచ్-న్యూ అధికారులు స్వాధీనం చేసుకుని, కొనుగోలుదారులను విచారించగా మొత్తం నెట్‌వర్క్ వెలుగులోకి వచ్చింది. ఈ కేసులో హైదరాబాద్‌కు చెందిన ఇద్దరు కొనుగోలుదారులను కూడా అరెస్టు చేసి, వారి వద్ద నుంచి 2 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు.

# పోలీస్ శాఖలో ఏసీబీ భారీ స్కెచ్

- డీఎస్పీ భీమ్ రెడ్డి ఇళ్లపై ఏకకాలంలో దాడులు
- వెండి బిందెలు, విదేశీ మద్యం లభ్యం
- ఆదాయానికి మించిన ఆస్తుల గుట్టురట్టు
- విశ్వసనీయ సమాచారంతో రంగంలోకి..

హైదరాబాద్ వెలుతురు జూలై 02:

హైదరాబాద్ మహానగరంలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు మరోసారి తమ బలగాలతో విరుచుకు పడ్డారు. ఈసారి ప్రభుత్వ సామాన్య ఉద్యోగులు కాకుండా ఏకంగా పోలీస్ శాఖలోని ఒక ఉన్నతాధికారే లక్ష్యంగా ఈ దాడులు జరగడం సంచలనం సృష్టిస్తోంది. తెలంగాణ డీజీపీ కార్యాలయంలోని కంప్యూటర్స్ విభాగంలో అత్యంత కీలకమైన బాధ్యతల్లో ఉన్న డీఎస్పీ భీమ్ రెడ్డి నివాసాలపై అధికారులు గురువారం ఉదయాన్నే దాడులు ప్రారంభించారు. ఏసీబీ అధికారుల అకస్మాత్తు ఎంట్రీతో సదరు అధికారి కుటుంబ సభ్యులు ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు.డీఎస్పీ భీమ్ రెడ్డి తన అధికారిక ఆదాయానికి మించి విపరీతమైన ఆస్తులను కూడబెట్టారంటూ ఏసీబీ ప్రధాన కార్యాలయానికి గత కొంతకాలంగా అనేక ఫిర్యాదులు అందుతున్నాయి. ఈ నేపథ్యంలో అధికారులు రహస్యంగా నిఘా ఉంచి, ఆయన సంపాదన మరియు లగ్జరీ జీవితంపై నమ్మదగిన సమాచారాన్ని సేకరించారు. ప్రాథమిక ఆధారాలు లభించడంతో పక్కా ప్లాన్‌తో రంగంలోకి దిగిన ప్రత్యేక ఏసీబీ బృందాలు, ఏకకాలంలో దాడులు చేసి ఆయన అక్రమ సామ్రాజ్యం గుట్టురట్టు చేసే పనిలో పడ్డాయి.హైదరాబాద్ నగరంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతమైన తారామతి బారామతి పరిసరాల్లో భీమ్ రెడ్డికి ఒక అత్యంత విలాసవంతమైన లగ్జరీ విల్లా ఉంది. గురువారం ఉదయం నుంచే ప్రత్యేక బృందాలు ఈ విల్లాను తమ ఆధీనంలోకి తీసుకుని అంగుళం అంగుళం వెతకడం ప్రారంభించాయి. కేవలం ఆయన ఇల్లే కాకుండా, ఆయనకు అత్యంత ఆప్తులుగా ఉన్న సన్నిహితులు, బంధువుల ఇళ్లను కూడా వదిలిపెట్టలేదు. హైదరాబాద్ మరియు దాని చుట్టుపక్కల జిల్లాల పరిధిలోని సుమారు పది ప్రాంతాలలో ఈ సోదాల పర్వం ఏకకాలంలో కొనసాగుతోంది.ఇప్పటివరకు జరిగిన సోదాల్లో డీఎస్పీ భీమ్ రెడ్డి నివాసం నుండి కళ్లు చెదిరే స్థాయిలో అక్రమ సంపద బయటపడినట్లు తెలుస్తోంది. ఆయన ఇంట్లో పెద్ద ఎత్తున బంగారు నగలు, వజ్రాభరణాలు, వెండి వస్తువులను అధికారులు గుర్తించారు. వీటన్నింటికంటే ముఖ్యంగా పాతకాలపు నవాబుల తరహాలో భారీ పరిమాణంలో ఉన్న వెండి బిందెలను కూడా ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకోవడం గమనార్హం. ఈ ఆభరణాల బరువును, వాటి ప్రస్తుత మార్కెట్ విలువను లెక్కించేందుకు ప్రత్యేకంగా బరువులు తూచే వారిని పిలిపించారు.అక్రమ ఆస్తులు, నగలతో పాటు భీమ్ రెడ్డి నివాసంలో ఎవరూ ఊహించని మరో వ్యవహారం వెలుగులోకి వచ్చింది. సాధారణ నిబంధనల ప్రకారం ఇంట్లో ఉంచుకోవాల్సిన పరిమితికి మించి, భారీ మొత్తంలో విదేశీ మద్యం బాటిళ్లను అధికారులు కనుగొన్నారు. అత్యంత ఖరీదైన బ్రాండ్లకు సంబంధించిన ఈ మద్యం బాటిళ్లను నిబంధనలకు విరుద్ధంగా దాచి ఉంచడంతో, వాటిని కూడా ఏసీబీ అధికారులు సీజ్ చేశారు. ఈ విషయమై ఎక్సైజ్ శాఖ



నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు తీసుకునే అవకాశం ఉంది.భీమ్ రెడ్డి ఇంట్లో జరిపిన అన్వేషణలో లగ్జరీ విల్లాకు సంబంధించిన పత్రాలతో పాటు, హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో ఉన్న పలు విలువైన ఖాళీ స్థలాలు, వ్యవసాయ భూములకు సంబంధించిన ఒరిజినల్ ల్యాండ్ డాక్యుమెంట్లను ఏసీబీ బృందాలు స్వాధీనం చేసుకున్నాయి. ఇవన్నీ ఆయన పేరు మీద, అలాగే బినామీల పేర్ల మీద కొనుగోలు చేసినట్లు అధికారులు ప్రాథమికంగా అనుమానిస్తున్నారు. ఈ భూముల రిజిస్ట్రేషన్ విలువకు, ప్రస్తుత బహిరంగ మార్కెట్ విలువకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని అధికారులు అంచనా వేస్తున్నారు.గురువారం ఉదయం ప్రారంభమైన ఈ ఏసీబీ సోదాలు ఇంకా నిరంతరాయంగా కొనసాగుతూనే ఉన్నాయి. ఇళ్లు, కార్యాలయాల్లోని లాకర్లు, అల్మారాలను అధికారులు పూర్తిగా తెరిచి చూస్తున్నారు. సోదాలు పూర్తిగా ముగిసేసరికి భీమ్ రెడ్డికి సంబంధించిన అక్రమాస్తుల నికర విలువ మరిన్ని కోట్ల రూపాయలలో తేలే అవకాశం ఉందని ఏసీబీ ఉన్నతాధికార వర్గాలు వెల్లడించాయి. బ్యాంక్ ఖాతాలు, నిలవ ఉన్న నగదు వివరాలను కూడా సేకరిస్తున్నారు.డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ ప్రధాన కార్యాలయంలోని కంప్యూటర్స్ వంటి సాంకేతిక విభాగంలో పనిచేస్తున్న ఒక డీఎస్పీ స్థాయి అధికారి ఇళ్లపై ఏసీబీ దాడులు జరగడం పోలీస్ శాఖలో తీవ్ర కలకలం రేపింది. తోటి ఉద్యోగులు, ఉన్నతాధికారులు ఈ దాడి వార్త విని విస్మయానికి గురవుతున్నారు. చట్టాన్ని రక్షించాల్సిన విభాగంలో ఉంటూ ఇంతటి అక్రమాలకు పాల్పడటంపై సర్వత్రా చర్చ నడుస్తోంది. త్వరలోనే ఏసీబీ అధికారులు ఈ దాడులకు సంబంధించిన పూర్తి వివరాలతో అధికారిక ప్రకటన విడుదల చేయనున్నారు.

# రాబోయే మూడు రోజులు భారీ వర్షాలు

- తెలుగు రాష్ట్రాలకు వాతావరణ శాఖ కీలక హెచ్చరికలు
- ద్రోణి ప్రభావంతో ముంచెత్తనున్న వానలు
- ఆంధ్రప్రదేశ్‌కు మూడు రోజుల పాటు వాన గండం
- కోస్తాంధ్ర, యానాంలో పిడుగులతో కూడిన ముప్పు
- తీరం వెంబడి గంటకు 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు
- సముద్రంలోకి వెళ్లొద్దని మత్స్యకారులకు సూచన
- తెలంగాణకు వాతావరణ శాఖ భారీ వర్ష సూచన
- పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ

హైదరాబాద్ వెలుతురు జూలై 02:

తెలుగు రాష్ట్రాల్లో ఎండ తీవ్రత నుంచి ఉపశమనం



కలిగిస్తూ వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. వాయువ్య బంగాళాఖాతం, దానిని ఆనుకుని ఉన్న ఉత్తర ఒడిశా తీర ప్రాంతాలపై ఏర్పడిన ఉపరితల ఆవర్తనం తీవ్రరూపం దాల్చింది. దీని ప్రభావం వల్ల వాయువ్య బంగాళాఖాతం, ఉత్తర ఒడిశా-పశ్చిమ బెంగాల్ తీరాల సమీపంలో ఒక పటిష్టమైన అల్పపీడన ప్రాంతం ఏర్పడిందని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. ఈ అల్పపీడనం రాబోయే రెండు నుంచి మూడు రోజుల్లో మరింత బలపడి తీవ్ర అల్పపీడనంగా మారే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని అమరావతి వాతావరణ కేంద్రం స్పష్టం చేసింది.ప్రస్తుతం ఏర్పడిన అల్పపీడనానికి అనుబంధంగా ఉన్న ఉపరితల ఆవర్తనం సగటు సముద్ర మట్టం నుండి దాదాపు 7.6 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించి ఉంది. ఇది ఎత్తుకు వెళ్లే కొద్దీ నైరుతి దిశ వైపునకు వంగి ఉందని శాస్త్రవేత్తలు వివరించారు. దీనికి తోడు, సముద్ర మట్టం వద్ద ఉన్న నైరుతి రుతుపవన ద్రోణి వాయువ్య రాజస్థాన్ ప్రాంతం నుండి నైరుతి ఉత్తర ప్రదేశ్, ఉత్తర మధ్యప్రదేశ్, ఉత్తర ఛత్తీస్‌గఢ్ మీదుగా ఒడిశా తీరంలోని అల్పపీడన కేంద్రం వరకు చురుగ్గా సాగుతోంది. ఈ వాతావరణ మార్పుల వల్ల రాబోయే రోజుల్లో మేఘాలు దట్టంగా కమ్ముకుని భారీ వర్షాలు కురిసేందుకు అనుకూల పరిస్థితులు ఏర్పడ్డాయి.అల్పపీడన ప్రభావంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రాబోయే మూడు రోజుల పాటు విస్తారంగా వర్షాలు కురుస్తాయని అమరావతి వాతావరణ కేంద్రం ప్రకటించింది. ముఖ్యంగా ఉత్తర కోస్తా ఆంధ్రప్రదేశ్ మరియు యానాం పరిసర ప్రాంతాలలో తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు చాలా చోట్ల పడతాయని పేర్కొంది. ఒకటి రెండు ప్రాంతాలలో మాత్రం ఆకాశానికి చిల్లు పడినట్లుగా కుండపోతగా భారీ వర్షాలు కురిసే ప్రమాదం ఉందని అంచనా వేసింది. వానలతో పాటు బలమైన ఉరుములు, మెరుపులు సంభవించే అవకాశం ఉన్నందున ఉత్తర కోస్తా జిల్లాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు.వర్షాలు కురిసే సమయంలో కోస్తా తీరం వెంబడి వాతావరణం చాలా ఉధృతంగా మారే అవకాశం ఉంది. గంటకు 40 నుండి 50 కిలోమీటర్ల వేగంతో, కొన్ని సమయాల్లో అంతకంటే ఎక్కువ వేగంతో బలమైన ఈదురుగాలులు వీస్తాయని అధికారులు హెచ్చరించారు. గాలుల కోత (షియర్ జోన్) సముద్ర మట్టానికి గరిష్ట ఎత్తులో విస్తరించి ఉండటం వల్ల సముద్రం అలజడిగా మారుతుందని, అలలు భారీ ఎత్తున ఎగిసిపడే ముప్పు ఉందని తెలిపారు. అందువల్ల వేటకు వెళ్లే మత్స్యకారులు మరో మూడు రోజుల పాటు సముద్రంలోకి వెళ్లకూడదని విపత్తు నిర్వహణ సంస్థ గట్టి హెచ్చరికలు జారీ చేసింది.ఉత్తర కోస్తాతో పాటు దక్షిణ కోస్తా ఆంధ్రప్రదేశ్, రాయలసీమ ప్రాంతాలపై కూడా ఈ అల్పపీడన ప్రభావం ఉండబోతోంది. నెల్లూరు, ప్రకాశం జిల్లాలతో పాటు రాయలసీమలోని పలు ప్రాంతాలలో నేడు, రేపు, ఎల్లుండి ఉరుములతో కూడిన మోస్తరు జల్లులు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. ఇక ఉష్ణోగ్రతల విషయానికి వస్తే.. రాబోయే ఐదు రోజుల పాటు కోస్తాంధ్ర, రాయలసీమ, యానాం ప్రాంతాలలో గరిష్ట ఉష్ణోగ్రతల నమోదులో పెద్దగా మార్పులు ఏవీ ఉండవని, పగటిపూట సాధారణ ఉష్ణోగ్రతలే కొనసాగుతాయని స్పష్టం చేశారు.పొరుగు రాష్ట్రమైన తెలంగాణలోనూ వర్షాలు దంచి కొట్టనున్నాయి. హైదరాబాద్ వాతావరణ కేంద్రం విడుదల చేసిన తాజా బులిటెన్ ప్రకారం.. తెలంగాణ వ్యాప్తంగా రాబోయే మూడు రోజుల పాటు భారీ వర్షాలు పడే అవకాశం ఉంది. అల్పపీడనం కారణంగా బంగాళాఖాతం నుంచి తెలంగాణ వైపునకు తక్కువ ఎత్తులో బలమైన తేమ గాలులు వీస్తున్నాయని అధికారులు తెలిపారు. రాబోయే 72 గంటల్లో రాష్ట్రంలోని పలు జిల్లాలలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ఆయా జిల్లాల కలెక్టర్లను, స్థానిక యంత్రాంగాన్ని అప్రమత్తం చేస్తూ ఎల్లో అలర్ట్ జారీ చేశారు.ప్రస్తుత వర్ష కాలంలో వర్షాల కంటే ఉరుములు, మెరుపుల తీవ్రత ఎక్కువగా ఉండే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలో పిడుగులు పడే ప్రమాదం ఎక్కువగా ఉందని, ఉరుములు వచ్చే సమయంలో ప్రజలు ఎవరూ కూడా బహిరంగ ప్రదేశాలలో తిరగవద్దని హైదరాబాద్ వాతావరణ కేంద్రం గట్టిగా కోరింది. పొలాల్లో పనిచేసే కూలీలు, పశువుల కాపరులు వర్షం పడే సమయంలో చెట్ల కింద, విద్యుత్ స్తంభాల కింద నిలబడకుండా సురక్షితమైన పక్కా భవనాలలో ఆశ్రయం పొందాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.రెండు తెలుగు రాష్ట్రాల్లో రాబోయే మూడు రోజులు భారీ వర్షాల సూచన ఉన్న నేపథ్యంలో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. చేతికి వచ్చిన పంటలు తడిసిపోకుండా భద్రపరుచుకోవాలని, పొలాల్లో నీరు నిల్వ ఉండకుండా మురుగు నీటి కాల్వలను శుభ్రం చేసుకోవాలని కోరారు. పత్తి, మిరప వంటి ఆరబెట్టే పంటలపై తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈదురు గాలుల వల్ల చేలు పడిపోయే ప్రమాదం ఉన్నందున తోటల పెంపకందారులు తగిన రక్షణ ఏర్పాట్లు చేసుకోవాలని వ్యవసాయ శాఖ శాస్త్రవేత్తలు రైతులకు మార్గదర్శకాలు జారీ చేశారు.

# బెంగళూరు క్వారీలో ఘోర ప్రమాదం

- 40 అడుగుల ఎత్తు నుంచి విరిగిపడ్డ భారీ బండరాయి
- 8 మంది బిహార్ కూలీలు అక్కడికక్కడే దుర్మరణం
- రాతి క్వారీలో ఒక్కసారిగా కూలిన భారీ కొండచరియ
- బండరాయి కింద నలిగిపోయిన అమాయక ప్రాణాలు
- క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించిన పోలీసులు
- ఘటనా స్థలంలో ముమ్మరంగా సహాయక చర్యలు
- భద్రతా ప్రమాణాల ఉల్లంఘనపై పోలీసుల నిఘా
- క్వారీ నిర్వాహకుల నిర్లక్ష్యంపై కేసు నమోదు



బెంగళూరు వెలుతురు జూలై 02:

కర్ణాటక రాజధాని బెంగళూరు నగర పరిసర ప్రాంతంలో గురువారం తెల్లవారుజామున ఒక ఊహించని ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. బెంగళూరు దక్షిణ తాలూకా పరిధిలోని మాదపట్టణ గ్రామ సమీపంలో ఉన్న ఒక పెద్ద రాతి క్వారీ (స్టోన్ క్రషర్ సైట్) లో ఈ దారుణ సంఘటన వెలుగుచూసింది. ప్రతిరోజూ లాగే కార్మికులు తెల్లవారుజాము నుంచే క్వారీలో పనులు ప్రారంభించారు. కూలీలు కొండ దిగువన రాళ్లను పగులగొడుతున్న సమయంలో, పైన ఉన్న రాతి గుట్ట నుంచి ఒక్కసారిగా భారీ కొండచరియ విరిగిపడింది. ఈ ఊహించని ప్రమాదంతో ఆ ప్రాంతమంతా ఒక్కసారిగా కార్మికుల అరుపులతో హాహాకారాలు మిన్నంటాయి.క్వారీలో పనులు జరుగుతున్న తరుణంలో దాదాపు 40 అడుగుల ఎత్తు నుంచి ఒక భారీ బండరాయి అత్యంత వేగంగా కింద పనిచేస్తున్న కూలీలపైకి కుప్పకూలింది. ఆ రాయి పరిమాణం చాలా పెద్దదిగా ఉండటంతో, దాని కింద పడిన కార్మికులకు తప్పించుకునే అవకాశం కూడా లేకపోయింది. ఈ భయానక ప్రమాదంలో బండరాయి కింద నలిగిపోయి బిహార్ రాష్ట్రానికి చెందిన 8 మంది వలస కూలీలు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ప్రమాద సమయంలో ఆ ప్రదేశంలో దాదాపు 18 మందికి పైగా కూలీలు పనుల్లో నిమగ్నమై ఉన్నట్లు ప్రత్యక్షసాక్షులు బరువెక్కిన హృదయంతో తెలిపారు.ఘోర ప్రమాదం గురించి సమాచారం అందిన వెంటనే స్థానిక పోలీసులు మరియు విపత్తు నిర్వహణ బృందాలు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నాయి. తీవ్రంగా గాయపడిన ఐదుగురు కార్మికులను రక్షక భట సిబ్బంది వెంటనే సమీపంలోని రాజరాజేశ్వరి ఆసుపత్రికి తరలించి అత్యవసర చికిత్స అందిస్తున్నారు. క్రేన్లు, భారీ యంత్రాల సహాయంతో ఘటనా స్థలంలో శిథిలాలను, పడిపోయిన పెద్ద పెద్ద బండరాళ్లను తొలగిస్తూ సహాయక చర్యలను ముమ్మరం చేశారు. ఆ బండరాళ్ల కింద ఇంకా ఎవరైనా కార్మికులు చిక్కుకు పోయారా అనే కోణంలో గాలింపు చర్యలు ముమ్మరంగా సాగుతున్నాయి.ఈ ఘోర ప్రమాదం నుంచి తృటిలో ప్రాణాలతో బయటపడిన ఒక కార్మికుడు కన్నీరుమున్నీరవుతూ ప్రమాద వివరాలను వెల్లడించాడు. "బండరాయి పైభాగంలో కొందరు వ్యక్తులు డ్రిల్లింగ్ పనులు చేస్తున్నారు. ఆ సమయంలో అకస్మాత్తుగా రాయి దొర్లి కిందకు పడిపోయింది. ఒకవేళ పైన పనిచేస్తున్న వారు రాయి కదులుతున్నప్పుడే గట్టిగా అరిచి మాకు ముందే సమాచారం ఇచ్చి ఉంటే, మేమంతా పక్కకు తప్పుకునేవాళ్లం. మా స్నేహితులు చాలా మంది ఈరోజు బతికేవారు" అంటూ సదరు కార్మికుడు ఆవేదన వ్యక్తం చేశాడు.ఈ ఘోర ప్రమాదానికి క్వారీ నిర్వాహకుల నిర్లక్ష్యమే ప్రధాన కారణమని ప్రాథమికంగా తెలుస్తోంది. నిబంధనల ప్రకారం మైనింగ్ లేదా క్వారీ పనులు జరిపేటప్పుడు కార్మికులకు కల్పించాల్సిన కనీస రక్షణ ఏర్పాట్లు, హెల్మెట్లు, భద్రతా వలయాలు వంటివి ఇక్కడ అమలు చేయలేదని ఆరోపణలు వస్తున్నాయి. లాభాల కోసమే తప్ప కూలీల ప్రాణాలకు నిర్వాహకులు ఎలాంటి విలువ ఇవ్వలేదని స్పష్టమవుతోంది. ఈ ఘటనపై పోలీసులు తీవ్రంగా స్పందించి, భద్రతా ప్రమాణాల ఉల్లంఘన కింద క్వారీ యజమానులపై కేసు నమోదు చేసి సమగ్ర దర్యాప్తు ప్రారంభించారు.బెంగళూరు శివార్లలో జరిగిన ఈ భారీ ప్రమాదంపై కర్ణాటక ముఖ్యమంత్రి డీ.కే. శివకుమార్ సామాజిక మాధ్యమం ఎక్స్ (ట్విట్టర్) వేదికగా తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. "మాదపట్టణంలో క్వారీ ప్రమాదం వల్ల 8 మంది కార్మికులు మరణించడం నన్ను తీవ్రంగా కలచివేసింది. మృతుల కుటుంబాలకు నా సానుభూతి తెలియజేస్తున్నాను. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నాను. కార్మికుల ప్రాణాలకు రక్షణ కల్పించాల్సిన పూర్తి బాధ్యత క్వారీ యాజమాన్యాలదే. ప్రభుత్వ నిబంధనలను బేఖాతరు చేస్తూ, అక్రమాలకు పాల్పడే క్వారీ నిర్వాహకులపై మా ప్రభుత్వం కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటుంది" అని సీఎం స్పష్టం చేశారు.యశ్వంత్‌పుర్ నియోజకవర్గ శాసనసభ్యుడు (ఎమ్మెల్యే) ఎస్.టి. సోమశేఖర్ ప్రమాద స్థలాన్ని పరిశీలించి, అధికారుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలో గత కొన్నేళ్లుగా ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా క్వారీలు నిర్వహిస్తున్నారని, దీనిపై తాను గతంలోనే కర్ణాటక అసెంబ్లీలో కూడా గళమెత్తానని గుర్తుచేశారు. కొద్దిరోజుల క్రితం ఇక్కడి క్వారీ యజమానులు జరిపిన అక్రమ బాంబు పేలుళ్ల వల్ల ఒక చిరుతపులి కూడా చనిపోయిందని ఆరోపించారు. ఈ అక్రమ మైనింగ్ వెనుక పోలీసులు, అటవీ శాఖ, గనుల శాఖ అధికారుల అవినీతి హస్తం ఉందని, వారందరిపై కేసులు పెట్టి కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు.పొట్టకూటి కోసం వేల కిలోమీటర్ల దూరం నుంచి బిహార్ రాష్ట్రం నుండి బెంగళూరుకు వలస వచ్చిన పేద కూలీల ఇళ్లల్లో ఈ ప్రమాదం తీరని శోకాన్ని మిగిల్చింది. మరణించిన 8 మంది కార్మికులను గుర్తించిన బెంగళూరు పోలీసులు, బిహార్‌లోని వారి కుటుంబ సభ్యులకు అధికారికంగా సమాచారం అందించారు. కంటికి రెప్పలా కాపాడుకోవాల్సిన యజమానుల నిర్లక్ష్యం వల్ల తమ వారు శవాలుగా మారారని తెలిసి మృతుల బంధువులు కన్నీరుమున్నీరవుతున్నారు. మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి, అనంతరం వారి సొంత ఊర్లకు తరలించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

# ఢిల్లీలో లాల్ దర్వాజా బోనాల ఉత్సవాలకు రావాలని మంత్రి వాకిటి శ్రీహరికి ఆహ్వానం

- మంత్రి వాకిటి శ్రీహరికి ఆహ్వానం అందజేసిన ఆలయ కమిటీ చైర్మన్ అరవింద్ కుమార్ గౌడ్

హైదరాబాద్ వెలుతురు జూలై 02:

తెలంగాణ సాంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించే విధంగా దేశ రాజధాని ఢిల్లీలో లాల్ దర్వాజా సింహవాహిని శ్రీ మహంకాళి దేవాలయం కమిటీ ఆధ్వర్యంలో జూలై 20 నుంచి మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న బోనాల ఉత్సవాలకు రావాలని రాష్ట్ర క్రీడా, పాడి పరిశ్రమాభివృద్ధి, పశుసంవర్ధ, మత్స్య, యువజన సేవల శాఖమంత్రి వాకిటి శ్రీహరికి లాల్ దర్వాజా సింహవాహిని శ్రీ మహంకాళి దేవాలయం కమిటీ చైర్మన్ జి.అరవింద్ కుమార్ గౌడ్ ఆహ్వానం అందేశారు. గురువారం మంత్రి వాకిటి శ్రీహరిని మినిస్టర్ క్వార్టర్స్ లోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి డిల్లీ బోనాల ఉత్సవాల ఆహ్వాన పత్రిక ను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఢిల్లీలో జరిగే బోనాల ఉత్సవాలకు తప్పకుండా వస్తానని ఆలయ కమిటీ చైర్మన్ అరవింద్ కుమార్ గౌడ్ కు కమిటీ ప్రతినిధులకు హామీ ఇచ్చారు. మంత్రిని కలిసిన వారిలో ఆలయ కమిటీ మాజీ చైర్మన్ కె.వెంకటేష్, ఎ.బద్రినాథ్ గౌడ్, కోశాధికారి జి.హరీష్ గౌడ్, కమిటీ ప్రతినిధులు జె.రాజేష్ గౌడ్, ఎ.భరత్ కుమార్, దశరథ్ సప్నేకర్,సుధీర్ గౌడ్, కాంగ్రెస్ నేత డి.ఎల్,నరసింహ గౌడ్ తదితరులు ఉన్నారు.



# ఉత్తరాదిని ముంచెత్తిన వరదలు

- దేశవ్యాప్తంగా ముమ్మరమైన రుతుపవనాలు
- ఢిల్లీని తాకిన వర్షాలు.. ముంబై రోడ్లపై ప్రవాహం
- లోతట్టు ప్రాంతాలు జలమయం.. స్తంభించిన రవాణా
- లోతట్టు ప్రాంతాలు జలమయం.. స్తంభించిన రవాణా
- పలు రాష్ట్రాల్లో దంచికొడుతున్న వానలు
- రాజధాని ఢిల్లీకి 5 రోజులు ఆలస్యంగా ఎంట్రీ
- ఐదేళ్లలో జూలై నెలలో రావడం ఇదే తొలిసారి
- ఉరుములు, మెరుపులతో కూడిన హెచ్చరికలు

**ఢిల్లీ వెలుతురు జూలై 02:**

భారతదేశంలో నైరుతి రుతుపవనాల కదలికలు ఒక్కసారిగా పుంజుకున్నాయి. దేశవ్యాప్తంగా ఇవి అత్యంత చురుగ్గా కదులుతుండటంతో పలు రాష్ట్రాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తున్నాయి. నైరుతి రుతుపవనాలు దేశంలోని మెజారిటీ ప్రాంతాలను కమ్మేయడంతో వాతావరణం పూర్తిగా చల్లబడింది. ఒకవైపు వర్షాలు రైతులకు ఊరటనిస్తున్నప్పటికీ, నగరాలు మరియు కొండ ప్రాంతాలలో నిరంతరాయంగా పడుతున్న వానల కారణంగా సామాన్య జనం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రానున్న మరికొన్ని రోజుల పాటు ఇదే పరిస్థితి కొనసాగే అవకాశం ఉందని వాతావరణ అధికారులు అంచనా వేస్తున్నారు.భారత దేశ రాజధాని ఢిల్లీలోకి గురువారం నాడు నైరుతి రుతుపవనాలు అధికారికంగా ప్రవేశించాయని భారత వాతావరణ శాఖ వెల్లడించింది.

సాధారణంగా జూన్ 27వ తేదీ నాటికే ఢిల్లీని తాకాల్సిన రుతుపవనాలు, ఈసారి ఐదు రోజులు ఆలస్యంగా జూలై 3వ తేదీన నగరంలోకి ప్రవేశించాయి. గడిచిన ఐదేళ్ల కాలంలో జూలై నెలలో రుతుపవనాలు ఢిల్లీని తాకడం ఇదే మొదటిసారి కావడం గమనార్హం. గతంలో 2021 జూలై 13న రుతుపవనాలు ఆలస్యంగా వచ్చాయి. ఆ తర్వాత వరుసగా 2022లో జూన్ 30, 2023లో జూన్ 25, 2024లో జూన్ 28, 2025లో జూన్ 29వ తేదీలనే ఢిల్లీకి రుతుపవనాలు చేరాయి.ఢిల్లీలో రుతుపవనాల ప్రవేశంతో రాజధాని పరిసర ప్రాంతాలలో రోజంతా ఆకాశం పూర్తిగా మేఘావృతమై చల్లని వాతావరణం ఏర్పడింది. ఢిల్లీతో పాటు పొరుగునే ఉన్న ఉత్తర్ ప్రదేశ్, హరియాణా, పంజాబ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్ మరియు గుజరాత్ రాష్ట్రాల్లోని అనేక ప్రాంతాలకు నైరుతి రుతుపవనాలు వేగంగా విస్తరించాయని వాతావరణ శాఖ తెలిపింది. ఈ రాష్ట్రాల్లోని పలు జిల్లాలలో రాబోయే 24 గంటల్లో ఉరుములు, బలమైన మెరుపులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ హెచ్చరించింది.మరోవైపు దేశ ఆర్థిక రాజధాని ముంబయి నగరాన్ని భారీ వర్షాలు అతలాకుతలం చేస్తున్నాయి. గురువారం తెల్లవారుజాము నుంచే నగరంలో ఎడతెరిపి లేకుండా కుండపోత వాన కురవడంతో ముంబయి మునిగిపోయింది. నగరంలోని ప్రధాన లోతట్టు ప్రాంతాలైన దాదర్, పరేల్, హింద్‌మాతా, వర్లీ, చార్‌కోప్, గోరేగావ్, అంధేరి సబ్‌వే ప్రాంతాలు పూర్తిగా జలమయమయ్యాయి. రోడ్లపై మోకాళ్లకు పైగా నీరు చేరడంతో వాహనాల రాకపోకలు పూర్తిగా నెమ్మదించాయి. ఉదయాన్నే ఆఫీసులకు వెళ్లే ఉద్యోగులు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు రోడ్లపై గంటల తరబడి చిక్కుకుపోయి నరక యాతన అనుభవించారు.ముంబయి నగరానికి జీవనాడి లాంటి లోకల్ రైలు సర్వీసులపై కూడా ఈ భారీ వర్షాల ప్రభావం తీవ్రంగా పడింది. కుండపోత వానల కారణంగా రైల్వే పట్టాలపైకి భారీగా వరద నీరు వచ్చి చేరింది. సిగ్నలింగ్ వ్యవస్థ దెబ్బతినకుండా ఉండేందుకు మరియు భద్రతా కారణాల దృష్ట్యా రైల్వే అధికారులు లోకల్ రైళ్లను నెమ్మదిగా నడిపించారు.

దీనివల్ల సెంట్రల్, వెస్ట్రన్ లైన్లలో నడిచే రైళ్లు నిలబడిపోయి, దాదాపు 10 నుంచి 15 నిమిషాల ఆలస్యంగా నడిచాయి. రైల్వే స్టేషన్లలో ప్రయాణికుల రద్దీ విపరీతంగా పెరిగిపోయింది.ముంబయి నగరం మరియు దాని చుట్టుపక్కల ఉన్న శివారు ప్రాంతాలలో రాబోయే 24 గంటల పాటు ముప్పు పొంచి ఉందని వాతావరణ శాఖ



స్పష్టం చేసింది. గురువారం అర్ధరాత్రి నుంచి శుక్రవారం తెల్లవారుజాము వరకు నగరంలో అత్యంత భారీ వర్షాలు పడే అవకాశం ఉందని ఎల్లో అలర్ట్ జారీ చేశారు. వానలతో పాటు తీరం వెంబడి గంటకు 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీచే ప్రమాదం ఉందని, సముద్రం అలజడిగా ఉంటుందని పేర్కొన్నారు. అత్యవసరమైతే తప్ప ప్రజలు, మత్స్యకారులు బయటకు రాకూడదని మున్సిపల్ అధికారులు సూచించారు.కొండ ప్రాంతమైన ఉత్తరాఖండ్‌లో కురుస్తున్న వర్షాలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. రుద్రప్రయాగ్ జిల్లాలో ఎగువ హిమాలయాల నుంచి వస్తున్న భారీ వరద కారణంగా అలకనంద, మందాకిని నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. నదులలో నీటిమట్టం ప్రమాదకర స్థాయికి చేరువ కావడంతో జిల్లా యంత్రాంగం హైఅలర్ట్ ప్రకటించింది. నదీ తీర ప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు వాట్సాప్ గ్రూపులు, మైకింగ్ వాహనాల ద్వారా ప్రత్యేక హెచ్చరికల వ్యవస్థను సిద్ధం చేశారు. జూలై 4వ తేదీ వరకు జిల్లాలో కొండచరియలు విరిగిపడే ప్రమాదం ఉందని అధికారులు అప్రమత్తం చేశారు.హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రంలో కూడా ఎడతెరిపి లేని వర్షాలు వినాశనాన్ని సృష్టిస్తున్నాయి. కొండ ప్రాంతాలలో అకస్మాత్తుగా వస్తున్న వరదలు, కొండచరియలు విరిగిపడిన సంఘటనల వల్ల ఇప్పటివరకు ఆరుగురు ప్రాణాలు కోల్పోగా, మరో 10 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. అనేక చోట్ల రోడ్లు కొట్టుకుపోయి రవాణా, విద్యుత్ వంటి నిత్యావసర సేవలకు తీవ్ర అంతరాయం కలిగింది. అత్యవసర సహాయక చర్యలు చేపట్టేందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం రంగంలోకి దిగింది. ఇందులో భాగంగా క్షేత్రస్థాయిలో పనిచేసే ప్రభుత్వ ఉద్యోగులు అందరి సెలవులను రద్దు చేస్తూ ప్రభుత్వం తక్షణ ఉత్తర్వులు జారీ చేసింది.

# ఉగ్రవాదంపై గ్లోబల్ వేదికగా భారత్ గర్జన

- దౌత్య నీతిలో రాజీపడే ప్రసక్తే లేదు
- ఐరాసలో పర్వతనేని కీలక వ్యాఖ్యలు
- ఉగ్రవాద వ్యతిరేక పోరులో రాజీపడమని వెల్లడి
- మూడు దశాబ్దాలుగా పెండింగ్‌లోనే ఉగ్ర నిరోధక చట్టం
- అంతర్జాతీయ వ్యవస్థపై భారతదేశం తీవ్ర అసంతృప్తి
- ఉగ్రవాదుల చేతుల్లోకి కొత్త టెక్నాలజీ
- సభ్య దేశాల మధ్య ఏకాభిప్రాయం లేకపోవడంపై ఆందోళన

**ఢిల్లీ వెలుతురు జూలై 02:**

ప్రపంచ శాంతికి అత్యంత ప్రమాదకరంగా మారిన ఉగ్రవాద మహమ్మారిని తుడిచిపెట్టే విషయంలో భారతదేశం తన గళాన్ని మరోసారి బలంగా వినిపించింది. ఉగ్రవాద నిర్మూలన కోసం జరిగే పోరాటంలో ఎలాంటి వెనకడుగు వేసేది లేదని, ఈ విషయంలో ఎవరితోనూ రాజీపడే ప్రసక్తే లేదని ఐక్యరాజ్యసమితి అత్యున్నత వేదికగా భారత్ ఖచ్చితమైన విధివిధానాలను ప్రకటించింది. ప్రపంచవ్యాప్తంగా ఉగ్రవాదాన్ని ఏ పరిస్థితుల్లోనూ, ఏ కారణం చేతనూ సమర్థించలేమని స్పష్టం చేస్తూ, దాని అన్ని రకాల రూపాలను సభ్య దేశాలన్నీ నిస్సందేహంగా ఏకతాటిపైకి వచ్చి ఖండించాలని పిలుపునిచ్చింది.గ్లోబల్ కౌంటర్ టెర్రరిజం స్ట్రాటజీ తొమ్మిదో సమీక్ష సందర్భంగా నిర్వహించిన ఐరాస సర్వసభ్య సమావేశంలో ఐక్యరాజ్యసమితిలో భారత శాశ్వత ప్రతినిధి పర్వతనేని హరీశ్ పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "ఉగ్రవాది అంటే ఉగ్రవాదే. వాళ్లను సమర్థించడానికి రాజకీయ కారణాలు లేదా వ్యూహాత్మక లెక్కలు అంటూ ఎలాంటి సాకులు వెతకకూడదు" అని ఘాటుగా వ్యాఖ్యానించారు. ఈ హంతక భావజాలాన్ని నిర్మూలించేందుకు ప్రపంచ దేశాలన్నీ సమిష్టిగా పనిచేయాలని, దశాబ్దాలుగా సరిహద్దుల అవతలి నుంచి వస్తున్న సీమాంతర ఉగ్రవాదానికి భారత్ ఎంతో మంది అమాయక పౌరులను బలి ఇచ్చుకుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.ఉగ్రవాద మూలాలను దెబ్బతీయడానికి అంతర్జాతీయంగా ఒక బలమైన, సమగ్రమైన చట్టపరమైన చట్రం లేకపోవడంపై భారత్ తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేసింది. అంతర్జాతీయ ఉగ్రవాదంపై సమగ్ర ఒడంబడికను తీసుకురావాలని 2006లో జీసీటీఎస్ ఆమోదించడానికి ఒక దశాబ్దం ముందే భారత్ ప్రతిపాదించిన విషయాన్ని పర్వతనేని హరీశ్ గుర్తు చేశారు. దురదృష్టవశాత్తూ దాదాపు మూడు దశాబ్దాలు గడుస్తున్నా ఈ చట్టం ఇప్పటికీ




పెండింగ్‌లోనే ఉండిపోయిందని, సార్వత్రిక చట్టం లేకపోవడం వల్లే ఉగ్రవాదులకు, వారి స్పాన్సర్లకు సురక్షిత ఆశ్రయాలు, నిధులు అందకుండా నిరోధించడంలో అంతర్జాతీయ సమాజం వెనుకబడుతోందని ఆయన ఎత్తిచూపారు.ప్రస్తుత ఆధునిక డిజిటల్ యుగంలో ఉగ్రవాద సంస్థలు సరికొత్త టెక్నాలజీలను మరియు అత్యాధునిక సాంకేతిక సాధనాలను తమ స్వార్థ ప్రయోజనాల కోసం దుర్వినియోగం చేస్తున్నాయని భారత్ ఆందోళన వ్యక్తం చేసింది. ఇలాంటి అడ్వాన్స్డ్ సాంకేతిక పరిజ్ఞానం ఉగ్రవాదుల చేతుల్లోకి వెళ్లకుండా కఠినమైన ఆంక్షలు విధించడంలో ఐరాస సభ్య దేశాల మధ్య ఇప్పటికీ ఒక స్పష్టమైన ఏకాభిప్రాయం రాకపోవడం అత్యంత బాధాకరమని భారత్ పేర్కొంది. టెక్నాలజీ దుర్వినియోగాన్ని అడ్డుకోవడానికి అంతర్జాతీయ నియమావళిలోని లోపాలను తక్షణమే పూడ్చాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పింది.ఉగ్రవాద నెట్‌వర్క్‌లను పూర్తిగా నిర్వీర్యం చేయాలంటే వారికి అందుతున్న ఆర్థిక వనరులను నిలిపివేయడమే ఏకైక మార్గమని భారతదేశం స్పష్టం చేసింది. ఇందుకోసం ప్రపంచ దేశాలన్నీ తమ ఆర్థిక నిఘా సమాచార భాగస్వామ్యాన్ని మరింత మెరుగుపరుచుకోవాలని సూచించింది. ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్ ఫోర్స్ నిర్దేశించిన అంతర్జాతీయ ప్రమాణాల అమలును అన్ని దేశాల్లోనూ బలోపేతం చేయాలని డిమాండ్ చేసింది. ఏ ఒక్క దేశం లేదా అధికార పరిధి కూడా ఉగ్రవాద నిధుల సమీకరణకు సురక్షితమైన మార్గంగా మారకుండా అంతర్జాతీయ సమాజం గట్టి నిఘా ఉంచాలని కోరింది.ప్రపంచంలో ఏ ఒక్క మతం, జాతి, జాతీయత లేదా వర్ణంపై ద్వేషంతో జరిగే ఎలాంటి హింసాత్మక చర్యలనైనా భారతదేశం సమానంగా ఖండిస్తుందని పర్వతనేని హరీశ్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఐక్యరాజ్యసమితి అనేది ఒక సార్వత్రిక వేదిక అని, అందువల్ల సభ్య దేశాల దృక్పథం కూడా అందరినీ కలుపుకుపోయేలా సమగ్రంగా ఉండాలని సూచించారు. కేవలం ఇస్లామోఫోబియా, క్రిస్టియన్‌ఫోబియా లేదా యూదు వ్యతిరేకత మాత్రమే కాకుండా, ఇతర మతాలపై జరిగే విద్వేష దాడులను కూడా ప్రపంచ దేశాలు సమాన దృష్టితో చూడాలని, ద్వంద్వ ప్రమాణాలను విడనాడాలని ఆయన హితవు పలికారు.ఉగ్రవాద నిరోధక చర్యల్లో భారతదేశం ఎల్లప్పుడూ ముందంజలో ఉంటూ కీలక పాత్ర పోషిస్తోందని హరీశ్ వివరించారు. ఉగ్రవాదులు సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడకుండా అరికట్టేందుకు వీలుగా రూపొందించిన 'ఢిల్లీ ప్రకటన', అలాగే ఉగ్ర నిధుల నిరోధానికి నిర్వహించిన 'నో మనీ ఫర్ టెర్రరిజం' వంటి ప్రతిష్టాత్మక అంతర్జాతీయ సదస్సులకు భారత్ విజయవంతంగా ఆతిథ్యం ఇచ్చిందని గుర్తు చేశారు. అయితే, 2023లో జరిగిన జీసీటీఎస్ సమీక్షలో చారిత్రాత్మక ఢిల్లీ ప్రకటనకు చోటు కల్పించకపోవడం తీవ్ర నిరాశ కలిగించిందని, ఇది అంతర్జాతీయ వ్యవస్థలో ఉన్న పక్షపాత ధోరణికి నిదర్శనమని ఆయన విమర్శించారు.మరోవైపు, దేశంలో టెక్నాలజీ రంగంలో సాధించిన అద్భుత ప్రగతిని పురస్కరించుకుని 'డిజిటల్ ఇండియా' కార్యక్రమం విజయవంతంగా 11 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఐక్యరాజ్య సమితిలోని భారత శాశ్వత మిషన్ ఎక్స్ (ట్విట్టర్) వేదికగా ప్రత్యేక ప్రకటన విడుదల చేసింది. భారతదేశం నిర్మించిన పటిష్టమైన డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ దేశంలో ప్రజా సేవల పంపిణీని సమూలంగా మార్చివేసిందని కొనియాడింది. ఎక్కడా అవినీతికి తావులేకుండా, మెరుగైన ప్రజా సేవల ద్వారా నేరుగా పౌరులకే పాలనను చేరవేస్తూ ఆర్థిక సమ్మిళితాన్ని విస్తరించడంలో ఈ డీపీఐ వ్యవస్థలు మరెక్కడా లేని ఒక అద్భుతమైన పరివర్తన గాథను లిఖించాయని భారత మిషన్ సగర్వంగా ప్రకటించింది.

# న్యాయ ప్రక్రియలో ఏఐపై సుప్రీంకోర్టు ఆందోళన..

- కమిటీ ఏర్పాటు చేయాలని బార్ కౌన్సిల్‌కు ఆదేశం
- ధ్రువీకరించని ఏఐ సమాచారంపై తీవ్ర హెచ్చరిక
- న్యాయ వ్యవస్థ సమగ్రతకు ముప్పుగా వ్యాఖ్యలు
- ఏఐ వినియోగంపై కమిటీ ఏర్పాటు చేయాలని ఆదేశం
- బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాకు సుప్రీంకోర్టు సూచనలు
- ఎన్‌సీఎల్‌టీ తీర్పులో నకిలీ తీర్పుల ప్రస్తావనపై ఆగ్రహం
- ఏఐ సాయంతో కల్పిత సమాచారం సృష్టించినట్లు గుర్తింపు
- ఎస్సెల్ ఇన్‌ఫ్రా కేసులో ఎన్‌సీఎల్‌టీ తీర్పు రద్దు
- ధ్రువీకరణ లేని ఏఐ వినియోగంపై కఠిన చర్యలకు సూచన
- న్యాయ ప్రక్రియలో జాగ్రత్తలు అవసరమని స్పష్టం
- సాంకేతికత వినియోగానికి మార్గదర్శకాలపై దృష్టి

**ఢిల్లీ వెలుతురు జూలై 02:**



న్యాయ ప్రక్రియలో కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్–ఏఐ) వినియోగంపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ధ్రువీకరించని ఏఐ ఆధారిత సమాచారాన్ని న్యాయపరమైన నిర్ణయాల్లో ఉపయోగించడం న్యాయ వ్యవస్థ సమగ్రతను దెబ్బతీస్తుందని ఆందోళన వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో న్యాయ ప్రక్రియలో ఏఐ వినియోగంపై సమగ్రంగా అధ్యయనం చేసి తగిన మార్గదర్శకాలు రూపొందించేందుకు కమిటీని ఏర్పాటు చేయాలని బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాను ఆదేశించింది.ఎస్సెల్ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ దివాలా కేసులో నేషనల్ కంపెనీ లా ట్రైబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) ఇచ్చిన తీర్పును విచారించిన జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ ఆలోక్ అరాధే ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. ఎన్‌సీఎల్‌టీ తీర్పులో ఉనికిలో లేని పూర్వ తీర్పులు, నకిలీ న్యాయ ఉదాహరణలను ప్రస్తావించినట్లు సుప్రీంకోర్టు గుర్తించింది. అవి ఏఐ టూల్స్ సాయంతో రూపొందించిన కల్పిత సమాచారం కావచ్చని ధర్మాసనం అభిప్రాయపడింది.న్యాయ తీర్పుల్లో వాస్తవాలకు విరుద్ధమైన లేదా ఉనికిలో లేని తీర్పులను ప్రస్తావించడం అత్యంత ప్రమాదకరమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఇటువంటి తప్పులు న్యాయ వ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీసే అవకాశముందని పేర్కొంది. అందువల్ల ఏఐ ద్వారా రూపొందిన సమాచారాన్ని పూర్తిగా ధ్రువీకరించిన తర్వాతే వినియోగించాలని న్యాయస్థానాలకు సూచించింది.ఈ కేసులో ఎన్‌సీఎల్‌టీ ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు పక్కన పెట్టింది. భవిష్యత్తులో ధ్రువీకరణ లేకుండా ఏఐ రూపొందించిన సమాచారాన్ని న్యాయ ప్రక్రియలో ఉపయోగించకుండా కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పింది. సాంకేతికతను సమర్థవంతంగా వినియోగించాల్సిన అవసరం ఉన్నప్పటికీ, న్యాయ ప్రక్రియలో ఖచ్చితత్వం, విశ్వసనీయతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

# దిగ్విజయంగా పూర్తి చేసుకున్న 99 రోజుల సాంస్కృతిక కళా ప్రదర్శనలు

- ప్రజా కళాను మరో రెండు రోజులు పొడగింపు
- కళాకారులందరికి కృతజ్ఞతలు తెలిపిన డైరెక్టర్ ఏనుగు నరసింహారెడ్డి

**హైదరాబాద్ వెలుతురు జూలై 02:**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన 99 రోజుల ప్రజా ప్రణాళికలో భాగంగా తెలంగాణ భాష సంస్కృతి శాఖ ఆధ్వర్యంలో రవీంద్ర భారతిలోని పాల్కూరి సోమన్న మూల వేదికలో నిర్వహించిన తెలంగాణ ప్రజాకళా పేరిట 99 రోజుల సాంస్కృతిక కళా ప్రదర్శనలు విజయవంతంగా నిర్వహించినట్లు తెలంగాణ భాష సంస్కృతిక శాఖ సంచాలకుడు డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి, ఐఏఎస్ తెలిపారు. ఈ సందర్భంగా గురువారం రవీంద్రభారతిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజా కళాలో గత 99ల పాటు దాదాపు 2600 మంది కళాకారులు పాల్గొన్నారని తెలిపారు. దాదాపు 1000 మంది కొత్త కళాకారులకు అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు. మునుపెన్నడులేనివిధంగా స్థిరపడ్డ కళాకారులను చెక్కభజన, మాల దాసరి, బైండ్ల జిమిడికలు, గౌడ పురాణం, కడ్డీ తాంత్రి వాయిద్యంతో పాటు సాంస్కృతిక సారధి కళాకారులు, సినీ నటీనటులు తమ ప్రదర్శనలు ప్రదర్శించారని



వివరించారు. తెలంగాణలోని 33 జిల్లాల నుంచి కళాకారులు ప్రజా కళాలో పాల్గొన్నారని తెలిపారు. కళాకారుల ఆకాంక్ష మేరకు 99 రోజుల ప్రణాళికను మరో రెండు రోజులు పొడిగించి 101 రోజులకు చేర్చినట్లు చెప్పారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశానుసారం 99 రోజుల ప్రణాళికను దిగ్విజయంగా పూర్తిచేయడం ఆనందంగా ఉందని ప్రజా కళాను విజయవంతం చేసినందుకు కళాకారులకు కృతజ్ఞతలు తెలిపారు.

# గోషామహల్‌లో డబల్ బెడ్ రూం ఇళ్ల పట్టాలు పంపిణీ

**హైదరాబాద్, వెలుతురు జూలై 02:**

గోషామహల్ నియోజకవర్గంలోని జాంబాగ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ వద్ద గతంలో గుడుంబా విక్రయించిన కుటుంబాల పునరావాసంలో భాగంగా 125 మంది లబ్ధిదారులకు డబల్ బెడ్ రూం ఇళ్ల పట్టాలను మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, అజారుద్దీన్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు రాజాసింగ్, శ్రీ గణేష్, నవీన్ యాదవ్, ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయి కుమార్, జిల్లా కలెక్టర్ ప్రియాంక అలా తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ప్రజాపాలన ప్రభుత్వం అర్హులైన ప్రతి కుటుంబానికి ఇళ్ల పట్టాలు అందజేస్తోందన్నారు. గతంలో నగర శివార్లలో డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించగా, ప్రస్తుతం హైదరాబాద్ నగరంలోనే లక్ష ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలిపారు. ప్రతి నియోజకవర్గంలోనే స్థలాలు గుర్తించి ఇళ్ల నిర్మాణం చేపట్టడమే లక్ష్యమన్నారు.

గుడుంబా కుటుంబాలను దెబ్బతీసే సామాజిక సమస్య అని పేర్కొన్న మంత్రి, ఆ వృత్తిపై ఆధారపడిన కుటుంబాలకు గౌరవప్రదమైన జీవితం కల్పించేందుకే ఈ పునరావాస కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేదల సంక్షేమం, సామాజిక న్యాయానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొంటూ, లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని చట్టబద్ధమైన జీవనోపాధితో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

# మత్తు, మొబైల్ మాయలో యువత: భవిష్యత్తు ప్రశ్నార్థకం

- విచ్చలవిడి జీవనశైలితో లక్ష్యం కోల్పోతున్న తరం
- యువతను మార్చేదెవరు అంటున్న తల్లిదండ్రులు, మేధావులు

యాదాద్రి భువనగిరి జూలై 01 (వెలుతురు న్యూస్ ):

ఒకప్పుడు సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషించిన యువత ఇప్పుడు విచ్చలవిడి జీవనశైలితో దారి తప్పుతోంది. మత్తు పానీయాలకు బానిసలుగా మారడం, స్మార్ట్ ఫోన్లకు అతుక్కుపోయి గంటల తరబడి కాలం వృథా చేయడం, భవిష్యత్తుపై సరైన కార్యాచరణ లేకపోవడం ప్రస్తుత తరం యువతను పట్టి పీడిస్తున్న ప్రధాన సమస్యలుగా మారాయి. దీంతో యువత భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతోందని సామాజిక వేత్తలు, మానసిక నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.జిల్లాలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో బెల్ట్ షాపులు విచ్చలవిడిగా వెలిశాయి. చట్ట బద్ధమైన మద్యం దుకాణాలతో పాటు అనధికార షాపులు యువతను మత్తు వైపు ఆకర్షి స్తున్నాయి. 18 ఏళ్లు నిండని బాలురు సైతం సులభంగా మద్యం, గుట్కా, సిగరెట్లకు అలవాటు పడుతున్నారు. స్నేహితుల ఒత్తిడి, కుటుంబ సమస్యలు, నిరుద్యోగం, ప్రేమ వైఫల్యాలు యువతను మత్తు పానీయాల వైపు నడిపిస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. ఇటీవల కాలంలో గంజాయి, ఇతర మత్తు పదార్థాల వినియోగం కూడా యువతలో గణనీయంగా పెరిగిందని పోలీసు గణాంకాలు వెల్లడిస్తున్నాయి.



### స్మార్ట్ ఫోన్.. జీవితాలను నాశనం చేస్తున్న సాధనం

చేతిలో స్మార్ట్ ఫోన్ ఉంటే చాలు యువత ప్రపంచాన్ని మరిచిపోతోంది. యూట్యూబ్ షార్ట్స్, ఇన్‌స్టాగ్రామ్ రీల్స్, ఫ్రీ ఫైర్, పబ్‌జీ లాంటి గేమ్‌లకు గంటల తరబడి సమయం కేటాయిస్తున్నారు. ఆన్‌లైన్ క్లాసుల పేరుతో తల్లిదండ్రులు ఫోన్లు కొనివ్వడంతో పిల్లలు అదే అదనుగా తీసుకొని పూర్తిగా సోషల్ మీడియాకు బానిసలవుతున్నారు.దీని ప్రభావంతో చదువుపై శ్రద్ధ తగ్గడం, కంటి సమస్యలు, నిద్రలేమి, మానసిక ఒత్తిడి, చిరాకు వంటి సమస్యలు యువతలో పెరిగిపోతున్నాయి. అంతేకాకుండా ఆన్‌లైన్ బెట్టింగ్, రమ్మీ గేమ్‌లకు అలవాటు పడి లక్షల రూపాయలు పోగొట్టుకొని అప్పల పాలైన యువకుల ఉదంతాలు కూడా జిల్లాలో అనేకం వెలుగుచూస్తున్నాయి.

### లక్ష్యం లేని జీవితాలు.. పెరుగుతున్న నేరాలు

డిగ్రీలు, పీజీలు చేసినా సరైన నైపుణ్యం లేక ఉద్యోగాలు రావడం లేదు. దీంతో చాలా మంది యువకులు "ఏం చేస్తాంలే" అనే నిర్లిప్తతతో కాలం వెళ్లదీస్తున్నారు. కష్టపడే తత్వం తగ్గి, సులభంగా డబ్బు సంపాదించాలనే ఆలోచనతో కొందరు నేరాల వైపు మళ్లుతున్నారు. చైన్ స్నాచింగ్‌లు, దొంగతనాలు, గొడవలు, దాడుల కేసుల్లో యువత ప్రమేయం పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది.

### మార్పు ఎక్కడ మొదలు?

యువతను ఈ విష వలయం నుంచి బయటకు తీసుకురావాలంటే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సమాజం, ప్రభుత్వం అందరూ సమష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందని విద్యావేత్తలు సూచిస్తున్నారు.

**1. తల్లిదండ్రుల పర్యవేక్షణ:**

పిల్లలకు కేవలం ఫోన్లు, బైకులు కొనివ్వడం కాదు, రోజులో కాస్త సమయం కేటాయించి వారితో మాట్లాడాలి. వారి సమస్యలు తెలుసుకోవాలి. స్నేహితులు ఎవరు, ఎక్కడికి వెళ్తున్నారు, ఏం చేస్తున్నారో గమనించాలి.

**2. విద్యావ్యవస్థలో సంస్కరణలు:**

పాఠశాల స్థాయి నుంచే విద్యార్థుల్లో నైతిక విలువలు, వ్యక్తిత్వ వికాసం, స్కిల్ డెవలప్‌మెంట్ పాఠాలు చేర్చాలి. క్రీడలు, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, కళా కార్యక్రమాలను ప్రోత్సహించాలి.

**3. ప్రభుత్వ చర్యలు:**

బెల్ట్ షాపులు, గంజాయి విక్రయాలపై ఉక్కుపాదం మోపాలి. విద్యాసంస్థల దగ్గర మత్తు పదార్థాల విక్రయాలు జరగకుండా నిఘా పెంచాలి. ప్రతి మండలంలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు, గ్రంథాలయాలు, ఆట స్థలాలు ఏర్పాటు చేయాలి. ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లపై కఠిన నియంత్రణ విధించాలి.

**4. సామాజిక బాధ్యత:**

గ్రామాల్లో యూత్ క్లబ్‌లు ఏర్పాటు చేసి యువతను సృజనాత్మక



కార్యక్రమాల వైపు మళ్లించాలి. మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి.

మానసిక వైద్య నిపుణులు డా. రవికుమార్ మాట్లాడుతూ, "యువత మత్తుకు, ఫోన్‌కు బానిస కావడానికి ప్రధాన కారణం లక్ష్యం లేకపోవడం, ఒంటరితనం. వారికి సరైన కౌన్సెలింగ్ ఇచ్చి, ఏదైనా ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకునేలా ప్రోత్సహించాలి. తల్లిదండ్రులు పిల్లలను తిట్టడం కాకుండా స్నేహితుల్లా మారి వారిని దారిలో పెట్టాలి" అని సూచించారు.

### గణాంకాలు ఏం చెబుతున్నాయి?

జిల్లాలో గత ఏడాది నమోదైన నేరాల్లో 18-25 ఏళ్ల వయస్సు వారి ప్రమేయం 42 శాతం.

మత్తు పదార్థాల కేసుల్లో పట్టుబడ్డ వారిలో 60 శాతం మంది 30 ఏళ్లలోపు వారే.

డీ-అడిక్షన్ సెంటర్లకు వస్తున్న వారిలో 70 శాతం మంది విద్యార్థులు, నిరుద్యోగ యువకులే.

మొత్తంగా చూస్తే, దేశ భవిష్యత్తుకు ఆయువు పట్టు అయిన యువశక్తి ఇలా దారి తప్పితే సమాజ పురోగతి కుంటుపడుతుంది. ఇప్పటికైనా అన్ని వర్గాలు మేల్కొని యువతను సరైన మార్గంలో నడిపించకపోతే రేపటి తరం అంధకారంలో కూరుకుపోయే ప్రమాదం ఉందని మేధావులు హెచ్చరిస్తున్నారు.



రంగ కవిత గౌడ్...
యాదాద్రి భువనగిరి జిల్లా
వెలుతురు స్టాఫర్...



## ఎల్‌నినో విసురుతున్న సవాలు...

# నీటి సంరక్షణే మార్గం



నేడు భూ పర్యావరణం మనం ఏదో ఒకటి చేయాల్సిన స్థితికి చేరింది. ప్రకృతి సంకేతాలు కూడా రోజు రోజుకూ స్పష్టంగానే కనిపిస్తున్నాయి. రుతువులు సకాలంలో రావడం కూడా తగ్గిపోయింది.

దూరదృష్టి గల గౌరవ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ సారి ఎండలు తీవ్రంగా ఉంటాయని మే నెల చివరలోనే స్పష్టంగా చెప్పారు. దేశ ప్రజలు తగినంత నీరు తాగుతుండాలనీ, నీటి వనరుల సంరక్షణ పట్ల అప్రమత్తంగా ఉండాలనీ ఆయన సూచించారు. ప్రధానమంత్రి ఇచ్చిన ఈ పిలుపు మున్నెన్నడూ చూడని ప్రస్తుత పర్యావరణ సంక్షోభం మధ్య దేశానికి సురక్షితమైన మార్గాన్ని చూపిస్తూ ఒక మార్గదర్శక కాంతిరేఖగా నిలుస్తోంది.

భూమిపై నిరంతరం పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, రుతువుల్లో వస్తున్న తీవ్రమైన మార్పులే ఇందుకు స్పష్టమైన ఆధారాలు. వాతావరణ మార్పు ఇకపై కేవలం సుదూర భవిష్యత్తుకు సంబంధించిన విషయం కాదని ఇవి నిరూపిస్తున్నాయి. ఇది వర్ధమాన కాలంలో అతిపెద్ద పాలనాపరమైన, సామాజిక సవాలుగా మారింది. అకాల భారీ వర్షాలు, సుదీర్ఘ కరువులు, వేసవి తీవ్ర రూపం దాల్చటం.. ఇవన్నీ నేడు మొత్తంగా ప్రపంచ సమాజానికి తీవ్ర ఆందోళన కలిగించే విషయాలు. ఈ ప్రపంచ స్థాయి వాతావరణ అలజడికి పసిఫిక్ మహాసముద్రంలో ఉద్భవించే అత్యంత సంక్లిష్టమైన జల–వాతావరణ ప్రక్రియ ఒక ముఖద్వారంగా ఉంది. దీనిని ఆధునిక శాస్త్ర పరిభాషలో 'ఎల్‌నినో' అని పిలుస్తారు. ప్రాథమికంగా వ్యవసాయంపై ఆధారపడుతూ భారీ విస్తీర్ణం, జనసాంద్రత ఎక్కువ కలిగిన భారత్ లాంటి దేశానికి ఈ ఎల్‌నినో కేవలం ప్రయోగశాల పరిశోధనలకే పరిమితమైన అంశం కాదు. ఇది దేశవ్యాప్తంగా ఉన్న మిలియన్ల కొద్దీ రైతు కుటుంబాల జీవితాలు.. జీవనోపాధి, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ, మన జాతీయ ఆహార భద్రతతో ప్రత్యక్షంగా ముడిపడి ఉన్న అత్యంత తీవ్రతతో కూడుకున్న వాస్తవ సమస్య.

సముద్ర విజ్ఞాన శాస్త్రం ప్రకారం సాధారణ పరిస్థితుల్లో పసిఫిక్ మహాసముద్ర భూమధ్యరేఖ ప్రాంతంలో తూర్పు నుంచి పడమర వైపు వీచే బలమైన వాణిజ్య పవనాలు వెచ్చని ఉపరితల జలాలను ఆసియా, ఆస్ట్రేలియా వైపు నెడతాయి. దీని ప్రభావం వల్ల దక్షిణ అమెరికాలోని పెరూ తీరంలో సముద్ర గర్భం నుంచి పోషకాలతో కూడిన చల్లని నీరు పైకి వస్తుంది. ఈ ప్రక్రియ ప్రపంచ పర్యావరణ ప్రసరణ విషయంలో సమతుల్యతను కాపాడటంలో సహాయపడటంతో పాటు భారతీయ రుతుపవనాలకు సానుకూల ప్రోత్సాహాన్ని ఇస్తుంది. అయితే ఎల్‌నినో ప్రభావం ఉన్న సమయంలో ఈ వాణిజ్య పవనాలు అకస్మాత్తుగా బలహీనపడతాయి. కొన్నిసార్లు వాటి దిశ పూర్తిగా మారిపోతుంది. ఫలితంగా సముద్రంలోని వెచ్చని ఉపరితల జలాలు పడమర వైపు వెళ్లేందుకు బదులుగా దక్షిణ అమెరికా తీర ప్రాంతాల వైపు వెనక్కి ప్రవహించడం ప్రారంభిస్తాయి. సముద్ర ఉపరితలం ఇలా అసాధారణంగా వేడెక్కడం వల్ల మొత్తం వాతావరణ పీడన మండలాలు అస్తవ్యస్తమవుతాయి. తద్వారా మేఘాలు ఏర్పడే విధానం, వర్షపాతానికి సంబంధించిన ప్రపంచ భౌగోళిక వ్యవస్థ రూపురేఖలే మారిపోతాయి. ఇది పెరూలోని కొన్ని ప్రాంతాల్లో విపరీతమైన వర్షాలు, వరదలకు కారణం కాగా భారత్, ఆగ్నేయాసియాలో వాయు పీడనం పెరగడానికి దారితీస్తుంది. దీనివల్ల రుతుపవనాల వేగం తగ్గుతుంది. భారత భూభాగంపై దీని ప్రత్యక్ష ప్రభావం తీవ్రమైన వర్షపాత లోటు, అస్తవ్యస్తమైన రుతుపవనాలు, వేసవిలో రికార్డు స్థాయి ఎండల రూపంలో కనిపిస్తుంది. ఇది భారతదేశపు మొత్తం జల చక్రం, నీటి ప్రసరణను అస్థిరపరిచే పూర్తి సామర్థ్యం కలిగిన ఒక శాస్త్రీయ విపత్తు. దీనితో పాటు మారుతున్న పశ్చిమ అవాంతరాలు, ఎల్‌నినో ప్రభావం కలిసి దేశానికి అనివార్యమైన నీటి సంక్షోభం, వాతావరణ అస్థిరత వంటి పరిస్థితులను సృష్టించాయి.

ప్రధానమంత్రి ఎల్లప్పుడూ నీటి భద్రతకు అత్యున్నత ప్రాధాన్యతనిస్తూ దానిని జాతీయ సార్వభౌమాధికారం, రక్షణ– భద్రతలతో సమానంగా పరిగణించారు. నీటి సంరక్షణ అనేది ప్రతి పౌరుడి రోజువారీ జీవితంలో ఒక సహజమైన భాగంగా, ఒక భారీ ప్రజా ఉద్యమంగా మారాలన్న స్పష్టమైన దృక్పథం ఆయనకు ఉంది. ఈ ఆలోచన ఆధారంగానే ఆయన 'క్యాచ్ ది రెయిన్' కార్యక్రమాన్ని ప్రారంభించారు. దీని ప్రాథమిక మంత్రం ఏంటంటే.. ఆధునిక సాంకేతికతలను ఉపయోగించి వర్షపు నీరు భూమిపై ఎక్కడ పడితే అక్కడే ప్రతి చుక్కను మనం సంరక్షించాలి. దేశ చరిత్రలోనే మొదటిసారిగా ప్రస్తుత ప్రభుత్వం 'జలశక్తి మంత్రిత్వ శాఖ' రూపంలో ఒక సమగ్రమైన, శక్తి



మంతమైన పరిపాలనా విభాగాన్ని ఏర్పాటు చేసింది. ఇది దేశ నీటి ప్రణాళికకు సరికొత్త, శాస్త్రీయ, స్పష్టమైన దిశను అందించడంలో నిజంగానే ఒక విప్లవాత్మకమైన కార్యక్రమంగా నిరూపితమైంది.

పెరుగుతున్న కాంక్రీటీకరణ, ప్రణాళిక లేని మితిమీరిన వినియోగం కారణంగా భూగర్భ జలమట్టాలు నిరంతరం పడిపోతూ ఉన్నాయి. దీనిని అరికట్టటంతో పాటు నీటి వనరుల దీర్ఘకాలిక రక్షణను నిర్ధారించడానికి ప్రభుత్వం అత్యంత సమగ్రమైన, పరస్పర అనుసంధాన విధానాలు, కార్యక్రమాలతో కూడిన ఒక కార్యాచరణ చట్రాన్ని రూపొందించింది.

దేశ పర్యావరణ సమతుల్యతకు, నీటి సంరక్షణకు 'జల జీవన్ హరియాళి మిషన్' సరికొత్త ఊతాన్ని ఇచ్చింది. నేడు 'ప్రతి ఇంటికీ నీరు' అనే సంకల్పంతో దేశంలోని ప్రతి గ్రామీణ, సుదూర ప్రాంతాలకు స్వచ్ఛమైన, నాణ్యత విషయంలో పరీక్షలు చేసిన, నిరంతర తాగునీటి సరఫరా ఉండేలా 'జల జీవన్ మిషన్' చూసుకుంటోంది. 'అటల్ భూజల్ యోజన' కింద భూగర్భ జలాలు మితిమీరిన వినియోగానికి గురైన ప్రాంతాలలో సామాజిక భాగస్వామ్యాన్ని ప్రోత్సహిస్తూ భూగర్భ జలమట్టాల శాస్త్రీయ నిర్వహణ, పునరుద్ధరణ పనులు జరుగుతున్నాయి. వ్యవసాయ రంగాన్ని సుస్థిరం చేయడానికి 'ప్రధాన మంత్రి కృషి సించాయి యోజన' కింద 'ప్రతి నీటి చుక్కకు ఎక్కువ పంట' అనే సూత్రంపై బిందు సేద్యం, స్ప్రింక్లర్ వంటి ఆధునిక సూక్ష్మ–నీటిపారుదల సాంకేతికతలను దేశవ్యాప్తంగా విస్తరిస్తున్నారు. దీనిద్వారా ప్రతి నీటి చుక్కను అత్యంత సమర్థవంతంగా ఉపయోగించుకోవచ్చు. జలాశయాలను సమర్థవంతంగా సంరక్షించటం కోసం 'అమృత్ సరోవర్ మిషన్' ప్రారంభమైంది. దీని కింద దేశంలోని ప్రతి జిల్లాలో కనీసం 75 చారిత్రక లేదా కొత్త చెరువులను నిర్మించడం, పునరుద్ధరించడం ద్వారా స్థానిక నీటి వనరులకు సరికొత్త జీవం పోస్తున్నారు. ఈ జాతీయ కార్యక్రమాలన్నింటితో పాటు దేశంలో ఏ ప్రాంతం కూడా నీటి సంక్షోభం బారిన పడకుండా చూసేందుకు సముద్రపు ఉప్పు నీటిని శుద్ధి చేసే ఆధునిక 'డీశాలినేషన్' సాంకేతికతలు, 'నదుల అనుసంధానం' వంటి ప్రతిష్టాత్మక ప్రాజెక్టులపై కూడా ప్రభుత్వం పూర్తి వేగంతో పని చేస్తోంది.

అత్యంత అధిక ఉష్ణోగ్రతలు, తీవ్రమైన వడగాల్పులు మానవ శరీరంలో అంతర్గత జీవ సమతుల్యతను కూడా తీవ్రంగా దెబ్బతీస్తాయి. మన శరీరం ప్రాథమికంగా ఒక నిర్దిష్ట, కచ్చితమైన నీటి శాతంపై ఆధారపడి పనిచేస్తుంది. బాహ్య శరీరం ఉష్ణోగ్రత అంతర్గత సాధారణ ఉష్ణోగ్రత కంటే పెరగడం ప్రారంభమైనప్పుడు చెమట ద్వారా శరీరం చల్లబరుచుకోవడానికి ప్రయత్నిస్తుంది. ఈ నిరంతర చెమట ప్రక్రియ వల్ల శరీరంలో నీరు, అవసరమైన ఖనిజ లవణాలు తీవ్రంగా తగ్గిపోతాయి. ఈ పరిస్థితిని వైద్య పరిభాషలో 'డీహైడ్రేషన్' అని పిలుస్తారు. ఈ పరిస్థితి తీవ్రరూపం దాల్చినప్పుడు శరీరంలోని కేంద్ర నాడీ వ్యవస్థ ప్రభావితం కావడం ప్రారంభమవుతుంది. ఇది చివరికి వడదెబ్బకు దారితీస్తుంది. మన సమాజంలో అత్యంత బలహీన వర్గాలైన వృద్ధులు, చిన్నపిల్లలు, గర్భిణీలు.. ముఖ్యంగా దేశాన్ని పునర్నిర్మించడానికి మండుటెండల్లో శ్రమించే కష్టజీవులైన రైతు–కూలీ సోదరులు దీనికి బాధితులు అవుతుంటారు. ఇటువంటి పరిస్థితిలో ప్రత్యేక జాగ్రత్తలు అవసరం. శరీరంలో ద్రవాలు ఉండేలా చూసుకునేందుకు ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా తగినంత స్వచ్ఛమైన నీరు, ఓఆర్ఎస్, నిమ్మరసం, తాజా మజ్జిగ తీసుకోవడం చాలా ముఖ్యం. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండే మధ్యాహ్నం వేళల్లో అనవసరంగా బయటకు వెళ్లడం పూర్తిగా నివారించాలి. వృద్ధులు, పిల్లలు ఉండే గదుల్లో సరైన గాలి వెలుతురు, చల్లదనం ఉండేలా చూసుకోవాలి. పొలాల్లో, నిర్మాణ స్థలాల్లో పనిచేసే రైతులు, కూలీలు తమ తలలను కాటన్ వస్త్రంతో కప్పుకోవటంతో పాటు నీడ కింద మధ్యమధ్యలో విశ్రాంతి తీసుకుంటూ తగినంత నీరు తాగుతూ ఉండాలి. కళ్లు తిరగడం లేదా తీవ్రమైన తలనొప్పి వంటి ఏవైనా శారీరక ఇబ్బందులు తలెత్తితే వెంటనే వైద్య సహాయం తీసుకోవాలి.

ఆధునిక శాస్త్ర విజ్ఞానం గురించి మనం ఆలోచిస్తున్నప్పుడు శతాబ్దాల క్రితమే నీటికి ఉన్న శాశ్వతమైన, జీవనప్రదాయిని ప్రాముఖ్యతను పూర్తిగా గుర్తించిన మన ప్రాచీన భారతీయ నాగరికత సుసంపన్న సాంస్కృతిక వారసత్వాన్ని, సాంప్రదాయ నీటి సంరక్షణ పద్ధతులను కూడా మనం గుర్తు చేసుకోవాలి. మన ప్రాచీన గ్రంథాలు, వేదాల్లో నీటిని ఎన్నడూ కేవలం ఒక వినియోగ వస్తువుగా పరిగణించలేదు. దానిని ఒక అమూల్యమైన ఔషధంగా భావించారు. రాజస్థాన్ పర్యటన అక్కడి నీటి సంస్కృతిపై ఒక ప్రత్యేకమైన అవగాహనను అందిస్తుంది. కఠినమైన ఎడారి ఉష్ణ పరిస్థితుల్లో కూడా సాంప్రదాయ పద్ధతులను ఉపయోగించి ప్రతి ఒక్క నీటి చుక్కను సంరక్షించడానికి స్థానిక సమాజం ఒక అసాధారణమైన వ్యవస్థను ఎలా అభివృద్ధి చేసిందో అక్కడ తెలుసుకోవచ్చు. రాజస్థాన్‌లోని కళాత్మకమైన భారీ మెట్ల బావులు, చెరువులు, బావులు ప్రతికూల వాతావరణంలో కూడా ఒక సమాజం తన సాంస్కృతిక స్పృహ, వివేకంతో నీటి లభ్యతను ఎలా కాపాడుకోగలదనే దానికి సజీవ ఉదాహరణలు. బుందేల్‌ఖండ్‌లోని చందేల కాలం నాటి చెరువులు, దక్షిణ భారత్‌లోని 'ఏరి' చెరువుల వ్యవస్థలు, ఉత్తర భారత్–బీహార్ మైదానాల్లో శతాబ్దాలుగా పనిచేస్తున్న 'ఆహార్–పైన్' వంటి నీటిపారుదల వ్యవస్థలు కేవలం అద్భుతమైన ఇంజనీరింగ్ నైపుణ్యానికి ఉదాహరణలు మాత్రమే కాదు. వాస్తవానికి అవి మన సామాజిక, ఉమ్మడి చైతన్యానికి సజీవ కేంద్రాలుగా నిలిచాయి. నీటిని గౌరవించడం, జలాశయాలను అత్యంత పవిత్రంగా ఉంచడం, వాటిని ఉమ్మడిగా నిర్వహించడం మన సమాజానికి ఉన్న సహజమైన, నైజమైన లక్షణం. నేటి ఆధునిక, కాంక్రీట్ యుగంలో ఈ సాంప్రదాయ పద్ధతులను ఆధునిక విజ్ఞాన శాస్త్రంలోని అధునాతన సాధనాలతో పూర్తిగా అనుసంధానించడమే అత్యంత కీలకమైన అవసరం.

వాతావరణ మార్పు, నీటి సంక్షోభానికి సంబంధించిన వినాశకరమైన ప్రభావం కేవలం మానవ సమాజపు సరిహద్దులకే పరిమితం కాబోవడం లేదు.

ఈ ప్రాకృతిక ఉగ్రరూపం.. తమ దాహాన్ని, ఆవేదనను మాటల్లో వ్యక్తపరచలేని మన చుట్టూ తిరిగే మూగజీవులకు కూడా అంతే ఘోరమైన విపత్తుగా మారుతోంది. మనం మన సురక్షితమైన, నీడ ఉన్న భవనాలలో కూర్చుని ఈ సంక్షోభం విషయంలో ప్రపంచ గణాంకాలను విశ్లేషిస్తున్న సమయంలో మనం మన వాకిళ్లు, మిద్దెలు, తోటల వైపు కూడా చూడాలి. అక్కడ కిలకిలలాడే పక్షులు, ఉడుతలు, వీధి పశువులు, ఇతర చిన్న జీవులు ప్రతి నీటి చుక్క కోసం ఎంతలా పరితపిస్తున్నాయో కనిపిస్తుంది. మన సనాతన సంస్కృతి ప్రపంచమంతటికీ ఎల్లప్పుడూ అపారమైన కరుణ, సహజీవనం అనే సందేశాన్ని అందించింది. ప్రకృతి మొత్తం సమతుల్యత ఈ పరస్పరం ఆధారపడటం అనే పునాదిపై నిలబడి ఉంది. ఈ మండుటెండల్లో మన ఇళ్లపై, బాల్కనీలలో, పొలాల గట్లపై లేదా మన వ్యాపార సంస్థల వెలుపల ఒక చిన్న మట్టి పాత్రలో స్వచ్ఛమైన, చల్లని నీటిని ఉంచడం మన ప్రథమ మానవీయ, నైతిక బాధ్యత. జంతువుల పట్ల ఉన్న కరుణను ఆచరణలో పెట్టే ఈ చిన్న ప్రయత్నం మండుతున్న ఎండలో ఎగిరే దాహంతో ఉన్న పక్షికి ఒక అమూల్యమైన ప్రాణదాతగా మారుతుంది. ఇటువంటి సున్నితత్వం సమాజంలోని ప్రతి వ్యక్తి రోజువారీ ప్రవర్తనలో భాగమైనప్పుడు ఆ దేశం ప్రపంచాన్ని ఆర్థికంగానే కాకుండా సాంస్కృతికంగా, ఆధ్యాత్మికంగా కూడా నడిపించే సామర్థ్యాన్ని పొందుతుంది.

పాత వార్తాపత్రికల నుంచి నేటి సమకాలీన జర్నలిజం వ్యాసాల వరకు ఈ నీటి సంక్షోభానికి సంబంధించిన ప్రతిధ్వని మనల్ని నిరంతరం హెచ్చరిస్తూనే ఉంది. మునుపెన్నడూ చూడని విధంగా వాతావరణ మార్పులు చోటుచేసుకుంటున్న ప్రస్తుత కాలంలో నీటి సంరక్షణ, నీటి లభ్యతను పెంపొందించటం అనేది పర్యావరణ శాస్త్రవేత్తల సదస్సులలో కేవలం ఒక తాత్విక చర్చాంశం మాత్రమే కాదు. ఇది మన దేశ సరిహద్దుల భద్రతకు, మన వ్యవసాయ వ్యవస్థ స్వయంసమృద్ధికి, మన పరిశ్రమల గతిశీలతకు, మన రాబోయే తరాల సురక్షిత భవిష్యత్తుకు ప్రత్యక్ష హామీ. నీటి భద్రత, నీటి వనరుల సంరక్షణ అనేది 'వికసిత భారత్' వైపు అత్యంత కీలకమైన, ప్రాథమికమైన అడుగుగా నిరూపితమవుతుంది. కాలాతీతమైన ఈ 'జల్ హై తో కల్ హై' (నీరు ఉంటేనే రేపు ఉంటుంది) అనే నినాదం కేవలం ఒక సాధారణ నినాదం మాత్రమే కాదు. ఇది మానవ నాగరికత మనుగడకు సంబంధించిన అతిపెద్ద, అచంచలమైన సత్యం. మనమందరం కలిసి ప్రతి నీటి చుక్కను పూర్తిగా గౌరవిస్తామని, దాని అనవసర వృథాను పూర్తిగా అరికడతామని, మన చుట్టూ ఉన్న సాంప్రదాయ నీటి వనరులను కాలుష్య రహితంగా ఉంచుతూ వాటిని పునరుజ్జీవింపజేస్తామని అచంచలమైన సంకల్పం తీసుకోవడం నేడు అత్యవసరం. మూగజీవుల పట్ల మనకున్న కరుణను ఆచరణలో పెట్టటం.. ప్రకృతితో సమతుల్యమైన, పరిమితమైన, ఆత్మీయమైన బంధాన్ని ఏర్పరుచుకోవడం అనేది ప్రస్తుత సమయం మనకు ఇస్తున్న అతిపెద్ద పిలుపు. నేడు ఉమ్మడిగా తీసుకునే ఈ చిన్న సంకల్పం రాబోయే సంవత్సరాల్లో అత్యంత బలమైన, సంపన్నమైన, స్వయంసమృద్ధి గల, సురక్షితమైన, నీటి భద్రత కలిగిన ఒక గొప్ప 'వికసిత భారత్' నిర్మాణానికి అత్యంత బలమైన పునాదిని వేయడంలో పూర్తిగా విజయవంతమవుతుంది.



డాక్టర్ రాజ్‌భూషణ్ చౌదరి





Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com